అనుదినం... జనస్వరం
నవతెలంగాణ
మంగళవారం 15-01-2019 సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 5 సంచిక : 18 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు వెల : 6.50

వరుసగా ఐదో రోజూ..



ఆగని పెట్రో వడ్డన

- పెట్రోల్ పై రూ. 0.40, డీజిల్‌పై రూ. 0.53 పెంపు

వివరాలు 2లో

రక్షణ మార్కెట్లో..
డస్సాల్ట్ కన్నా హెచ్‌ఏఎల్‌దే పైచేయి

హెచ్‌ఏఎల్‌కు 38వ ర్యాంకు.. డస్సాల్ట్‌కు 44వ స్థానం

- అయినా రాఫెల్ డీల్‌కు నోచుకోని సంస్థ
- ఈ ఒప్పందంతోనే ఒడ్డునపడ్డ ఫ్రెంచ్ కంపెనీ!
- ప్రభుత్వ సంస్థపై మోడీ సర్కారు చిన్నచూపు

9లో




పని ప్రదేశాల్లో రైట్ టు సిట్..
అసంఘటిత రంగంలోని మహిళలకు

- కేరళ సర్కారు చొరవతో తీరనున్న మహిళల కష్టాలు



తిరువనంతపురం: అసంఘటిత రంగంలో పనిచేస్తున్న మహిళలకు ప్రభుత్వ గుర్తింపు, సదుపాయాల సంగతి అటుంచితే అసలు వారికి కనీస సౌకర్యాలు కూడా అందుబాటులో ఉండవు. కానీ, కేరళ ప్రభుత్వ చొరవతో అక్కడి మహిళలు.. పని ప్రదేశాలలో కూర్చునే హక్కు (రైట్ టు సిట్)ను పొందారు. దీంతో, ఈ రంగంలో పనిచేస్తున్న మహిళలకు కొంత ...9లో




కేసీఆర్ 'పెదవి దాటని 'మంత్రివర్గ విస్తరణ!'

అంతా ఆదివాసీలదే
ఏజెన్సీల్లో పంచాయతీల కన్నా గ్రామసభలకే అధికారాలు

అక్కడ ఆదివాసీలే ప్రభువులు. ప్రభుత్వ నిర్ణయాల్ని బేఖాతర్ చేసే అధికారం కూడా వారికి ఉన్నది. ప్రజలు ఎన్నుకున్న సర్పంచ్‌ని, వార్డు సభ్యులను పక్కన పెట్టి నిర్ణయాలు తీసుకునే వెసులుబాటు కూడా వారికి సంక్రమించింది. షెడ్యూలు ప్రాంతాలకు పంచాయతీ రాజ్ విస్తరణ (పీసా) చట్టం ప్రకారం స్వతంత్ర నిర్ణయాలు తీసుకునే అధికారం వారికి ఉన్నా ఏజెన్సీ గ్రామాలు మాత్రం అభివృద్ధికి నోచుకోలేదు. పరిపాలనా వికేంద్రీకరణలో భాగంగా 500 జనాభా కలిగిన ఆదివాసీ గూడేలను గ్రామపంచాయతీలుగా ప్రకటించిన తర్వాత మొదటి సారి ఎన్నికలు జరుగుతున్న సందర్భంలో గ్రామసభల అధికారాలపై రాష్ట్ర వ్యాప్తంగా చర్చ జరుగుతున్నది.


(ఫైల్)



- ప్రభుత్వ నిర్ణయాల్ని 'వీటో' చేసే అధికారం
- 'పీసా' చట్టం అమలు కాక అభివృద్ధికి నోచుకోని వైనం
- ప్రకృతి వనరులపై పేరుకే ఆధిపత్యం
- ఎన్నికల తర్వాతైనా పరిస్థితి మారుతుందా?

వివరాలు 9లో



ప్రభాస్ ఎవరో నాకు తెలియదు
పుకార్లు టీడీపీకి కొత్తేమీ కాదు


వైఎస్ఆర్‌సీపీ నాయకురాలు షర్మిల

- దుష్ప్రచారంపై చర్యలు తీసుకోవాలి సీపీకి వినతి
- కేసు సీసీఎస్‌కు బదలాయింపు

నవతెలంగాణ-సిటీబ్యూరో

'సినీ హీరో ప్రభాస్ ఎవరో నాకు తెలీదు. తాను ఇప్పటి వరకు ఆయన్ను కలవలేదు. ఫోన్లో సైతం మాట్లాడలేదు. నాపై దుష్ప్రచారం వెనుక టీడీపీ హస్తం ఉన్నట్టు భావిస్తున్నా' అని వైఎస్ఆర్‌సీపీ నాయకురాలు వైఎస్ షర్మిల అన్నారు. సామాజిక మాధ్యమాల్లో తనపై ...9లో

నీరు గారుతున్న ఉపాధి
ఎంజీఎన్ఆర్ఈజీ చట్టాన్ని పటిష్టం చేయండి



- ప్రధాని మోడీకి 90 మంది ఎంపీలు, 160 మంది ప్రముఖుల బహిరంగ లేఖ

న్యూఢిల్లీ: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజీఎన్ఆర్ఈజీఏ) తీవ్ర నిధుల కొరతను ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ఈ పథకం కోసం కేంద్రం కేటాయించిన మొత్తంలో 99శాతం నిధులు ...9లో

విలీన కాటు!
పెరుగుతున్న పన్నులు.. ఊడుతున్న ఉపాధి

- వేలాది మంది జాబ్‌కార్డుదారుల్లో ఆందోళన
- ఉపాధి కోసం ఇతర ప్రాంతాలవైపు చూపు
- గ్రామాల్లో పడకేసిన పాలన.. నిలిచిన అభివృద్ధి
- ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్న పంచాయతీలు

9లో

ఫ్రాన్స్‌లో ఆందోళనలు
ఆర్థిక సంస్కరణలకు వ్యతిరేకంగా..



వివరాలు 9లో

జింబాబ్వేలో నిరసనలు

- చమురు ధరలు తగ్గించాలని డిమాండ్
- భాష్ప వాయుగోళాల ప్రయోగం



వివరాలు 7లో

పల్లెకు చేరిన పట్నవాసం


హైదరాబాద్ హైటెక్‌సిటీ వద్ద

నవతెలంగాణ - సిటీబ్యూరో

హైదరాబాద్ నగరం బోసిపోయింది. ఎప్పుడూ రయ్..రయ్‌మంటూ దూసుకెళ్లే వాహనాల రద్దీ కనిపించడం లేదు. ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారాయి. సంక్రాంతి పండుగ, గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పట్నం ప్రజలు పల్లె బాట పట్టారు. విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రయివేటు కంపెనీలకు వరుస సెలవులూ కలిసివచ్చాయి. దీంతో నిరంతరం ఉరుకులు, పరుగులతోనే యాంత్రిక జీవనం గడిపే నగర ప్రజలు గ్రామీణ వాతావరణం కోసం తరలివెళ్లారు. వారం ...9లో

వారిని తగలబెట్టండి

- మత కల్లోలాలకు కారణమయ్యే

రాజకీయ నాయకులపై యూపీ మంత్రి వ్యాఖ్యలు



లక్నో: మత కల్లోలాలను ప్రేరేపిస్తూ రెండు వర్గాల ప్రజల మధ్య గొడవలు సృష్టించే రాజకీయ నాయకులను మంటల్లో తగలబెట్టండంటూ బీజేపీ మిత్ర పక్ష నాయకుడు, ఉత్తరప్రదేశ్ మంత్రి ఓ పి రాజ్‌భర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అలీగఢ్‌లో ఓ ర్యాలీలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాజ్‌భర్ మాట్లాడుతూ.. 'ఇంత వరకు ఎప్పుడైనా హిందు ముస్లింల అల్లర్లలో ఏ పేరు మోసిన రాజకీయ నాయకుడైనా చనిపోయారా..? రాజకీయ నాయకులు ఎందుకు చనిపోరు..? మతం పేరిట రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసి మిమ్మల్ని (ప్రజలనుద్దేశించి) హింసకు ప్రేరేపిస్తున్న నాయకులనే మంటల్లో తగలబెట్టండి' అంటూ వ్యాఖ్యానించారు. ప్రజలు అలా చేసినప్పుడే నాయకులకు అర్థమౌతోందని.. దాంతో వారు ఈ తరహా అల్లర్లకు పాల్పడరని చెప్పారు. రాజ్‌భర్.. గతంలోనూ యోగీ సర్కారు పాలనపై బహిరంగంగానే విమర్శలు గుప్పించిన విషయం తెలిసిందే. శనివారం ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికలలో పోటీపై బీజేపీకి అల్టిమేటం జారీ చేశారు. తనకు సరైన సమాధానం రాకుంటే రాష్ట్రంలోని 80 స్థానాలలో తమ సుహల్‌దేవ్ భారతీయ సమాజ్ పార్టీ (ఎస్‌బీఎస్‌పీ) ఒంటరిగానే పోటీ చేస్తోందని తేల్చి చెప్పారు. రాష్ట్రంలో ముస్లిం పేర్ల మీద ఉన్న నగరాల పేర్ల మార్పుపై స్పందిస్తూ.. వీటి కంటే ముందు తమ పార్టీలో ఉన్న ముస్లిం నేతల పేర్లను మార్చాలని బీజేపీకి చురకలంటించారు.

ఇతర రంగాలలో జోక్యం చేసుకోకూడదు

- ఇది రాజకీయనాయకులు నేర్చుకోవాలి :

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ



న్యూఢిల్లీ: రాజకీయ నాయకులు ఇతర రంగాల్లో జోక్యం చేకసుకోకూడదని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. మహారాష్ట్రలోని యవత్మల్‌లో జరిగిన మరాఠా సాహిత్య సమ్మేళనంలో పాల్గొన్న ఆయన రాజకీయనాయకులకు సూచించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ ఆంగ్ల రచయిత నయన్‌తారా సెహగల్‌కు అందిన ఆహ్వానాన్ని నిర్వాహకులు వెనక్కి తీసుకోవడంతో వివాదం రేగింది. కొన్నేండ్ల క్రితం కేంద్రం తీరుకు నిరసనగా దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారి తీసిన 'అవార్డు వాపసీ'లో ఆయన ఒకరు. దీంతో ఈ అంశంపై రాజకీయ నాయకులను ఉద్దేశించి ఆయన పరోక్షంగా పైవ్యాఖ్యలు చేశారు. ఎలాంటి జోక్యమూ చేసుకోకూడదని అంటే సాహిత్య రంగంలోని వ్యక్తులకు, రాజకీయ నాయకులకు మధ్య సంబంధం ఉండకూడదని కాదన్నారు. రాజకీయనాయకులు, రచయితల మధ్య సహకారం, సమన్వయం, సంభాషణలు ఉండాలని లేకపోతే అది తప్పుడు వాదనలకు దారి తీస్తుందన్నారు. ఈనెల 11న యవత్మల్‌లో ప్రారంభమైన 92వ అఖిల భారతీయ మరాఠీ సాహిత్య సమ్మేళన్‌కు సెహగల్‌ను కార్యక్రమ నిర్వాహకులు ఆహ్వానించారు. అయితే బీజేపీ, మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన(ఎంఎన్‌ఎస్)లకు చెందిన స్థానిక నాయకులు దీనిని వ్యతిరేకించడంతో ఆహ్వానాన్ని నిర్వాహకులు వెనక్కి తీసుకున్నారు. దీంతో ఈ అంశం వివాదానికి దారి తీసింది.

మహారాష్ట్రలో 45 ఎంపీ సీట్లకు ఎన్సీపీ-కాంగ్రెస్‌ల మధ్య కుదిరిన డీల్

ముంబయి: ఈ ఏడాదిలో రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో కలిసిపోటీచేయనున్న నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ), కాంగ్రెస్‌ల మధ్య ఎంపీ సీట్ల పంపకం పూర్తయ్యింది. మహారాష్ట్రలోని మొత్తం 48 ఎంపీ స్థానాలకు గానూ 45 సీట్ల విషయంలో డీల్ కుదిరినట్టు రాహుల్‌గాంధీతో సమావేశం అనంతరం ఎన్సీపీ అధినేత శరద్‌పవార్ వెల్లడించారు. మిగిలిన రెండు, మూడు సీట్లకోసం ఇంకా చర్చించాల్సి ఉన్నదన్నారు. తమ కోటా నుంచి రాజు శెట్టికి చెందిన స్వాభిమానీ షెట్కారీ సంఘటనకు ఒక సీటు కేటాయిస్తామన్నారు. అలాగే మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన్(ఎంఎన్‌ఎస్)తో పొత్తుపై పుకార్లను పవార్ తోసిపుచ్చారు. ఇటీవల రాజ్‌థాక్రేతో జరిపిన సమావేశం వ్యక్తిగతమైనదన్నారు. ముంబయి నార్త్ సీట్‌ను ఎంఎన్‌ఎస్ కోరిందన్న వార్తలను ఆయన ఖండించారు. లోక్‌సభ ఎన్నికలతో పాటే మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే.

కర్నాటకలో ఆపరేషన్ లోటస్

- బీజేపీ 'వల'లో ముగ్గురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు


కుట్రలను తిప్పికొడతాం : శివకుమార్

బెంగళూరు : కర్నాటకలో కాంగ్రెస్-జెడీఎస్ సంకీర్ణ ప్రభుత్వాన్ని కూలదోసేందుకు ఆపరేషన్ కమలం పేరుతో బీజేపీ తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. ఈ కుట్ర నిజమేనని, కాంగ్రెస్‌కు చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలు ముంబయిలోని ఒక హోటల్‌లో బీజేపీ నేతలతో భేటీ అయ్యారని జల వనరుల శాఖ మంత్రి డికె శివకుమార్ తెలిపారు. అక్కడ ఏం జరిగిందో, తమ శాసనకర్తలను ఏవిధంగా ప్రలోభాలకు గురిచేశారో తమకు తెలుసునని ఆయన వ్యాఖ్యానించారు. ఈ కుట్రను తమ ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి కుమార స్వామితో పాటు సిద్ధరామయ్య దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. 'వేచి చూద్దాం' అన్న మెతక వైఖరిని ముఖ్యమంత్రి ప్రదర్శిస్తున్నారని 'ట్రబుల్ షూటర్' గా పేరొందిన శివకుమార్ ఆరోపించారు. కుమారస్వామి స్థానంలో తాను ఉంటే ఈ కుట్రను తిప్పికొడతానని వ్యాఖ్యానించారు. ఈ ఆపరేషన్‌లో బీజేపీ విజయం సాధించదని అన్నారు.

తెలియని గని కార్మికుల ఆచూకీ

- గాలింపునకు

అదనపు బృందాలు



గువహతి : మేఘాలయాలో అక్రమ బొగ్గు గని కూలి నెల రోజులు గడిచినా అందులో చిక్కుకుపోయిన 15 మంది కార్మికుల ఆచూకీ ఇంకా తెలియలేదు. వారు ప్రాణాలతో ఉంటారనే ఆశలు సన్నగిల్లుతున్నప్పటికీ గాలింపు చర్యలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. గనిలో చిక్కుకుపోయిన కార్మికులను వెలికి తీసే చర్యల్లో భాగంగా మరో ఐదు నిపుణుల బృందాలు సహాయక చర్యల్లో పాల్గొంటున్నాయి. హైదరాబాద్‌కు చెందిన జియో ఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, రూర్కీకి చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హైడ్రాలజీ సంస్థలతోపాటు చెన్నైకి చెందిన బృందాలు గాలింపు చర్యల్లో పాలు పంచుకున్నాయి. ఇప్పటికే ఎన్‌డీఆర్‌ఎఫ్ గాలింపు చర్యలను కొనసాగిస్తున్నది. ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలకు నావికాదళం, ఒడిషా అగ్నిమాపక దళ సిబ్బంది, కోల్ ఇండియా లిమిటెడ్‌కు చెందిన సిబ్బంది సహాయ పడుతున్నారు.

పైలెట్ల ఫైటింగ్

- విమానం నడిపే విషయంలో తలెత్తిన ఘర్షణ

న్యూఢిల్లీ: విమానంలో పైలెట్ల మధ్య ఘర్షణ తలెత్తింది. విమానాన్ని నడిపే విషయంలో ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగింది. ఘర్షణ తీవ్రమవడంతో వారిపై ఎయిర్‌లైన్స్ క్రమశిక్షణ చర్యలకు ఉపక్రమించింది. దీనిపై ఎయిర్‌లైన్స్ అధికారి మాట్లాడుతూ... పైలెట్ల మధ్య ఘర్షణ జరిగిన మాట వాస్తవమేననీ తెలిపారు. దేశీయ విమానాన్ని నడిపే విషయంలో ఇద్దరు పైలెట్ల మధ్య గొడవ జరిగిందని తెలిపారు. దీంతో వారిని విమానం నడిపే విధుల నుంచి తప్పించినట్టు తెలిపారు. కొన్ని నెలలపాటు ఎయిర్‌లైన్స్‌లోని మరో విభాగానికి వారిని మార్చినట్టు ఆయన తెలిపారు. కాగా పైలెట్ల పేర్లను వెల్లడించడానికి నిరాకరించారు.

వరుసగా ఐదో రోజూ...

ఆగని పెట్రో వడ్డన

- పెట్రోల్ పై రూ. 0.40, డీజిల్‌పై రూ. 0.53 పెంపు

న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరల పెరుగుదలతో ఇంధన ధరలు మళ్లీ భగ్గుమంటున్నాయి. ఈ ఏడాదిలో వరుసగా ఐదో రోజూ, మొత్తంగా ఆరోసారి పెట్రో ఉత్పత్తుల ధరలు పెరిగాయి. పెంపు పైసలలోనే కనిపిస్తున్నా.. దాని ప్రభావం వినియోగదారులపై తీవ్రంగా పడుతోంది. దీంతో, దేశవ్యాప్తంగా ఇప్పటికే లీటరు పెట్రోల్, డీజిల్‌పై ధరలు రూ. 2 కు పైగా పెరిగాయి. కాగా, లీటరు పెట్రోల్‌పై రూ. 0.40, డీజిల్‌పై రూ. 0.53 పైసలు పెంచుతూ ఆయిల్ కంపెనీలు నిర్ణయం తీసుకున్నాయి. ధరలు వరుసగా పెరుగుతుండటంతో మరోసారి చమురు ఉత్పత్తుల ధరలు ఆకాశాన్ని అంటుతాయేమోనని సామాన్య జనం ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది ప్రారంభమై పదిహేను రోజులు గడవకముందే పెట్రో ధరలు రూ. 2 పెరగడమే దీనికి నిదర్శనం. గతేడాది ఆగస్టు మాసాంతం నుంచి వరుసగా నలభై రోజుల పాటు ఇంధన ధరలు పెరిగిన సంగతి తెలిసిందే. గతానుభవాల దృష్ట్యా మరోసారి పెట్రో పోటు తప్పదని జనం భయాందోళనలో ఉన్నారు. ఇప్పట్లో కేంద్ర, రాష్ట్ర ఎన్నికలు కూడా లేకపోవడంతో మోడీ సర్కారు చమురు ఉత్పత్తుల ధరలను తగ్గించే యోచన చేయబోదని వారు భావిస్తున్నారు. ఇంధన ధరల పెంపుతో ఢిల్లీలో లీటరు పెట్రోల్ ఈ ఏడాది తొలిసారి రూ. 70.13ల మార్కు దాటింది. డీజిల్ రూ. 64.18గా ఉంది. ముంబయిలో ఇవే ధరలు రూ. 75.77, రూ. 67.18గా నమోదయ్యాయి. హైదరాబాద్‌లో లీటరు పెట్రోల్ రూ. 74.40గా ఉంది. డీజిల్ రూ. 69.77కు చేరింది. పెట్రో ధరల వరుస పెంపుతో పండుగ పూట తెలుగు రాష్ట్రాల్లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోనున్నారు.

సీవీసీ చౌదరీని తొలగించాలి..

- అలోక్‌వర్మపై విచారణలో ఆయన పాత్ర అనుమానాస్పదం : సీపీఐ(ఎం)

న్యూఢిల్లీ : సీబీఐ చీఫ్‌గా అలోక్‌వర్మ తొలగింపు విషయంలో కేంద్ర విజిలెన్స్ కమిషనర్ (సీవీసీ) కే.వీ.చౌదరీ వ్యవహరించిన తీరును సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో తీవ్రంగా ఖండించింది. అలోక్‌వర్మకు వ్యతిరేకంగా ఎలాంటి ఆధారాలూ లేకున్నా, కుట్రపూరితంగా ఆయనపై కేంద్రం బదిలీవేటు వేసిందని పొలిట్‌బ్యూరో ఆరోపించింది. నిజాల్ని దాచిపెట్టేవిధంగా కే.వీ.చౌదరీ పోషించిన పాత్ర చాలా అనుమానాల్ని కలిగిస్తోందనీ, కాబట్టి ఆయన్ని వెంటనే ఆ పదవి నుంచి తొలగించాలనీ, కే.వీ.చౌదరీ పాత్రపై విచారణ జరిపించాలనీ సీపీఐ(ఎం) డిమాండ్ చేసింది. పొలిట్‌బ్యూరో సోమవారం మీడియాకు విడుదల చేసిన ప్రకటన ఈ విధంగా ఉంది... అలోక్‌వర్మకు వ్యతిరేకంగా సీవీసీ చూపిన ఆధారాలు చాలా బలహీనంగా ఉన్నాయి. మరో నిందితుడు సీబీఐలో నెం.2 అయిన రాకేశ్ ఆస్థానా చేసిన ఆరోపణలనే సీవీసీ ఆధారంగా చేసుకోవటం దారుణం. అలోక్‌వర్మపై సీబీఐ విచారన పర్యవేక్షించిన జస్టిస్ పట్నాయక్ కూడా, అలోక్‌వర్మకు వ్యతిరేకంగా ఆధారాలు లభ్యం కాలేదని తెలిపారు.

సీవీసీ నివేదిక, అందులోని నిర్ధారణలతో తనకు సంబంధం లేదని కూడా పట్నాయక్ మీడియా సమావేశం పెట్టి మరీ చెప్పారు. ఈ నేపథ్యంలో సీవీసీ కే.వీ.చౌదరీ ఇచ్చిన నివేదిక ఆధారంగా అలోక్‌వర్మను లొలగించటం, బదిలీవేటు వేయటం చాలా అన్యాయం, అక్రమం. సహజన్యాయ సూత్రాల్ని కాలరాచారు. తన వాదన వినిపించుకునే అవకాశం అలోక్‌వర్మకు ఇవ్వలేదు. అలోక్‌వర్మను తొలగించటం కోసం మోడీ సర్కార్ ఎంతో వేగంగా కదిలింది. కేంద్ర ప్రభుత్వంలోని పెద్ద పెద్ద రాజకీయ నాయకుల అవినీతి బాగోతాలు బయటపడతాయన్న ఆందోళనతోనే మోడీ సర్కార్ ఇదంతా చేస్తోంది. ఇందులో రాఫెల్ కుంభకోణంతో సహా అనేక అవినీతి బాగోతాలున్నాయి.

నిఘా బిల్లుపై వివరణ ఇవ్వండి

కేంద్రానికి 'సుప్రీం' నోటీసులు

న్యూఢిల్లీ : వ్యక్తిగత సమాచారంపై నిఘాను పెంచుతూ ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్‌కు సంబంధించి దాఖలైన పిటిషన్‌లపై సుప్రీంకోర్టు సోమవారం నోటీసులు జారీచేసింది. ఈ అంశంపై ఆరువారాల్లోగా నివేదికను సమర్పించాల్సిందిగా చీఫ్ జస్టిస్ రంజన్‌గొగోయ్‌తో కూడిన ధర్మాసనం ప్రభుత్వాన్ని ఆదేశించింది. కాగా, డిజిటల్ యుగంలో వ్యక్తి స్వేచ్ఛకు సంబంధించిన విషయంలో జాగరూకతతతో ఉండాలని ధర్మాసనం పేర్కొంది. అయితే ఈ నోటిఫికేషన్ పౌరుల ప్రాథమిక హక్కులను ఉల్లంఘిస్తోందని న్యాయవాది ఎంఎల్ శర్మతో సహ తొమ్మిదిమంది పిటిషన్లు దాఖలు చేసిన సంగతి తెలిసిందే. వ్యక్తి గోప్యతను కాపాడాల్సిన అవసరం ఉందని, అదే సమయంలో డిజిటల్ యుగంలో వస్తున్నమార్పులపైనా, ప్రమాదాలపైనా జాగ్రత్తగా ఉండాలని సూచించింది. ప్రతివ్యక్తికీ గోప్యత అనేది రాజ్యాంగంలో ఆర్టికల్ 21 ప్రకారం ప్రాథమిక హక్కు అని తొమ్మిది మంది జడ్జిలతో కూడిన ధర్మాసనం 2017లో తీర్పు నిచ్చింది. సమాచార గోప్యతకు రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించిన సంగతి తెలిసిందే. ఇటీవల ఇంటిలిజెన్స్ బ్యూరో, సిబిడిటి, 'రా'తోపాటు పలు సంస్థలు ఏ శాఖ నుంచైనా నేరుగా సమాచారాన్ని తీసుకునేందుకు వీలుగా హక్కుల కల్పిస్తూ కేంద్రం బిల్లును ఆమోదించిన సంగతి తెలిసిందే. సమాచార వ్యవస్థ చట్టం 2000లోని సెక్షన్ 69 (1)ప్రకారం, నిబంధన 4 ప్రకారం ప్రభుత్వం ఈ ఆదేశాలను జారీ



చేసింది.

పౌరసత్వ (సవరణ) బిల్లు చట్టం కాకముందే విచారణ కుదరదు

పౌరసత్వ (సవరణ) బిల్లును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణను సోమవారం సుప్రీంకోర్టు పెండింగ్‌లో పెట్టింది. బిల్లు చట్టరూపంలోకి రాకముందే విచారణ చేపట్టడం కుదరదని పేర్కొంది. లోక్‌సభ ఆమోదం పొందిన ఈ బిల్లు రాజ్యసభలో పెండింగ్‌లో వుంది. ఆ పిటిషన్‌ను తగిన సమయంలో దాఖలు చేయాలని పిటిషనర్‌కు సూచించింది. వివాదాస్పద పౌరసత్వ చట్ట బిల్లును ప్రతిపక్ష ఎంపీల ఆందోళనల మధ్య ఈ నెల 8న లోక్‌సభ ఆమోదించింది. ఈ బిల్లును వ్యతిరేకిస్తూ ఈశాన్య రాష్ట్రాలలో ఆందోళనలు, ఘర్షణలు వెల్లువెత్తుతున్న సంగతి తెల్సిందే.

సామాజిక కార్యకర్త తెల్‌తుంబ్డేపై కేసు రద్దుకు సుప్రీం 'నో'

భీమ కొరెగావ్ కేసులో సామాజిక కార్యకర్త ఆనంద్ తెల్‌తుంబ్డేపై పూనే పోలీసులు దాఖలు చేసిన ఎఫ్ఐఆర్‌ను రద్దు చేసేందుకు సుప్రీంకోర్టు సోమవారం తిరస్కరించింది. ఆనంద్ తెల్‌తుంబ్డే విచారణ కోర్టు నుంచి బెయిల్ కోరిగా నాలుగు వారాల పాటు ఆయనను అరెస్టు చేయకుండా ఇటీవల ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసుకు సంబంధించి దర్యాప్తు జరుగుతోంది, ఈ దశలో ఎఫ్ఐఆర్‌ను రద్దుచేయడం వాంఛనీయం కాదని ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ అన్నారు. ప్రస్తుతం జరుగుతున్న దర్యాప్తులో జోక్యం చేసుకునేందుకు కూడా కోర్టు నిరాకరించింది.

నాగేశ్వరరావు నియామకాన్ని సవాల్ చేస్తూ పిటిషన్

కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) తాత్కాలిక డైరెక్టర్ ఎం. నాగేశ్వర్ నియామకాన్ని సవాల్ చేస్తూ ఓ స్వచ్ఛంద సంస్థ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఎన్జీవో తరపున న్యాయవాది ప్రశాంత్ భూషణ్ పిటిషన్ దాఖలు చేశారు. సీబీఐ మాజీ డైరెక్టర్ అలోక్ వర్మనే తిరిగి డైరెక్టర్‌గా నియమించాలని సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేసిన రెండు రోజులకే మోడీ సర్కారు ఆయనను పదవి నుంచి తప్పించింది. అలోక్‌ను ఫైర్ సర్వీసెస్‌కు చీఫ్‌గా బదిలీ చేయడమేగాక మరోసారి నాగేశ్వరరావునే డైరెక్టర్‌గా నియమించింది. ఇది అక్రమమని, మోడీ సర్కారు తీసుకున్న ఏకపక్ష నిర్ణయమని ప్రశాంత్ భూషణ్ తన పిటిషన్‌లో ఆరోపించారు. అంతేగాక, ప్రస్తుత డైరెక్టర్‌ను తప్పించి, అలోక్ వర్మనే తిరిగి సీబీఐ చీఫ్‌గా నియమించేలా కేంద్రానికి సూచించాలని పిటిషన్‌లో కోరారు.

మోడీ పర్యటన కోసం..

- ఒడిషాలో వందలాది చెట్లు నరికివేత

భువనేశ్వర్: మోడీ సర్కారు చేపట్టిన స్వచ్ఛ భారత్ ప్రచార కార్యక్రమాలకు ఎక్కడికెళ్లినా పచ్చదనం కోసం చెట్లను నాటాలని.. ప్రతీ ఒక్కరూ విధిగా మొక్కలను కాపాడాలని ప్రధాని సెలవిస్తారు. కానీ, మోడీ పర్యటన నిమిత్తం ఒడిషాలో వందలాది చెట్లను నరికేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రాష్ట్రంలో పలు అభివృద్ధి ప్రాజెక్టుల ప్రారంభానికి గానూ ఆయన నేడు (జనవరి 15) బాలాంగిర్‌కు రానున్నారు. ఈ నేపథ్యంలో తాత్కాలిక హెలిప్యాడ్ నిర్మాణం కోసం ఇక్కడి రైల్వే స్టేషన్‌కు సమీపంలో ఉన్న వందలాది చెట్లను అధికారులు కొట్టివేసారు. ఈ చెట్లు రైల్వే శాఖ పరిధిలోనే ఉన్నా తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే వాటిని రైల్వే అధికారులు కొట్టివేస్తున్నారని జిల్లా అటవీశాఖ అధికారి సమీర్ సత్పతి అన్నారు. దీనిపై విచారణ చేపట్టామని రైల్వే శాఖ విచారణ కోరామని తెలిపారు. అయితే, హెలిప్యాడ్‌లు నిర్మాణం చేపట్టేది పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ (పీడబ్ల్యూడీ) కాగా రైల్వే అధికారులు ఈ చర్యకు పూనుకోవడానికి గల కారణాలేమిటో తమకు తెలియవని పీడబ్ల్యూడీ అధికారి ఒకరు తెలిపారు.

జస్టిస్ పట్నాయక్ నివేదిక మాకివ్వలేదు...

- కాంగ్రెస్ ఎంపీ మల్లిఖార్జున ఖర్గే

న్యూఢిల్లీ : సీబీఐ చీఫ్‌గా అలోక్‌వర్మను తొలగించే సందర్భంలో రిటైర్డ్ జస్టిస్ పట్నాయక్ నివేదికలోని విషయాల్ని ఎంపిక కమిటీతో పంచుకోలేదని మోడీ సర్కార్ తీరును కాంగ్రెస్ ఎంపీ మల్లిఖార్జునఖర్గే తప్పుబట్టారు. అలోక్‌వర్మపై జరిగిన సీబీఐ విచారణ అంతా కూడా జస్టిస్ పట్నాయక్ పర్యవేక్షణలో జరిగిందనీ, ఈ సందర్భంగా అలోక్‌వర్మకు వ్యతిరేకంగా ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదన్న విషయం పట్నాయక్ నివేదిక అంశం తమకు తెలియకుండా దాచారనీ ఖర్గే ఆగ్రహం వ్యక్తం చేశారు. సీబీఐ చీఫ్‌గా అలోక్‌వర్మ తొలగింపు నిర్ణయాన్ని జస్టిస్ పట్నాయక్ కూడా తప్పుబట్టారు. మోడీ సర్కార్ తీరును విమర్శించారు. ప్రధాని మోడీ నేతృత్వంలోని ఎంపిక కమిటీ అలోక్‌వర్మను బదిలీ చేస్తూ కొద్ది రోజుల క్రితం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈ ఎంపిక కమిటీలో ప్రధాని మోడీ, పార్లమెంట్‌లో ప్రతిపక్ష నాయకుడు ఖర్గే, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పంపిన జస్టిస్ ఏకే.సిక్రీ ఉన్నారు. అలోక్‌వర్మపై బదిలీవేటు నిర్ణయాన్ని ఖర్గే వ్యతిరేకించారు.

కనీస ఆదాయ పథకంపై.. తేలని లెక్కలు..?

సార్వత్రిక కనీస ఆదాయ పథకం గురించి 2017 బడ్జెట్‌లో ప్రస్తావించిన మోడీ సర్కార్ ఎటూ తేల్చకుండానే 2019 లోక్‌సభ ఎన్నికలకు వెళ్లనున్నదా..? ఈ పథకాన్ని అమలు చేయాలంటే ఎన్ని నిధులు అవసరమవుతాయి..? ఈ పథకాన్ని అమలులోకి తెస్తే ఇప్పుడు అమలవుతున్న సంక్షేమ పథకాలన్నీ పక్కన పెడ్తారా..?

న్యూఢిల్లీ: సార్వత్రిక కనీస ఆదాయ(యూబీఐ) పథకం దేశంలోని పేద ప్రజలకు పరిష్కారం చూపిస్తుందా అన్న చర్చ మరోసారి మొదలైంది. పేద ప్రజల కోసం ఇప్పటివరకూ అమలు చేసిన సబ్సిడీ పథకాల వల్ల ఆశించిన ఫలితాలు సమకూరలేదన్న అభిప్రాయమున్నది. కొన్ని పాశ్చాత్య దేశాల్లో యూబీఐ పథకం అమలు ద్వారా పేదలకు కనీస వసతులకు ఇబ్బంది లేకుండా చేయగలిగారని పరిశీలకులు చెబుతున్నారు. యాంత్రీకరణ వల్ల ఆయా దేశాల్లో నిరుద్యోగ సమస్య అధికమైనపుడు ఈ పథకాన్ని అమలులోకి తెచ్చారు. 2017లో పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టే ముందు విడుదల చేసిన ఆర్థిక సర్వేలో యూబీఐ పథకం గురించి మోడీ ప్రభుత్వం ప్రస్తావించింది. అయితే, ఈ పథకాన్ని ఏవిధంగా అమలులోకి తేవాలన్న విషయంలో మోడీ సర్కార్ ఓ నిర్ణయానికి రాలేకపోయింది.

దేశంలో రైతుల ఆత్మహత్యలు పెరిగిన నేపథ్యంలో పలు రాష్ట్రాల్లో రైతుల రుణాల మాఫీకి ఆయా ప్రభుత్వాలు నిర్ణయం తీసుకున్నాయి. తెలంగాణతోపాటు ఏపీలోనూ రుణమాఫీని అమలు చేస్తున్నారు. తెలంగాణలో రైతు బంధు పథకాన్ని కూడా టీఆర్‌ఎస్ అమలు చేస్తోంది. ఈ పథకం పట్ల కొన్ని అభ్యంతరాలున్నప్పటికీ రైతుల నుంచి సానుకూలత వ్యక్తమైనట్టుగా పరిశీలకులు భావిస్తున్నారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ అనూహ్య విజయం సాధించిన విషయం తెలిసిందే. సంక్షేమ పథకాల అమలు వల్లే టీఆర్‌ఎస్ సానుకూల ఫలితాలు సాధించినట్టు ఇతర రాష్ట్రాలకు చెందిన రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు. అయితే, తెలంగాణలో అమలవుతున్న రైతు బంధు పథకం వల్ల సాధారణ రైతులతోపాటు కార్పొరేట్ రైతులు, ధనిక రైతులు ప్రయోజనం పొందుతున్నారు. మరోవైపు అప్పుల ఊబీలో చిక్కుకున్న కౌలు రైతులకు ఈ పథకాన్ని టీఆర్‌ఎస్ ప్రభుత్వం



నిరాకరిస్తోంది. దాంతో, కష్టం కౌలు రైతులదైతే ఈ పథకం కింద ప్రభుత్వం ఇచ్చే డబ్బులు ధనిక రైతుల ఖాతాల్లో పడుతున్నాయి. పట్టాదారు పాస్ బుక్కులు ఎవరి పేరు మీద ఉంటే వారి ఖాతాలోకే రైతు బంధు డబ్బులు వెళ్తాయన్నది గమనార్హం. తెలంగాణలో కౌలు రైతులు13.7 శాతమున్నట్టు అంచనా. ఈ పథకం కింద ఇప్పటివరకూ ఎకరానికి రూ.4000 చొప్పున ఇచ్చిన తెలంగాణ ప్రభుత్వం ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ నుంచి రూ.5000 చొప్పున ఇవ్వనున్నది. ఏటా రెండు సీజన్లలో కలిపి మొత్తం రూ.10000 రైతుల ఖాతాల్లో పడనున్నాయి. ఈ పథకాన్ని దేశవ్యాప్తంగా అమలు చేస్తే ఏటా మూడున్నర లక్షల కోట్లు అవసరమవుతాయని అంచనా.

అయితే, కేవలం రైతులకే కాకుండా అన్ని రంగాలలోని తక్కువ ఆదాయవర్గాలవారికి(దారిద్ర్య రేఖ దిగువన ఉన్నవారికి) యూబీఐని అమలు చేయాలన్నది మరికొందరు ఆర్థికవేత్తల సూచన. మాజీ ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణ్యం కూడా ఆర్థిక సహాయ పథకానికి మద్దతు తెలిపారు. అయితే, ఆయన ప్రతిపాదించింది యూబీఐ పథకం కాదన్నది గమనార్హం.

యూబీఐని అమలు చేయాలంటే 2017-18 ధరల ప్రకారం దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న ప్రతి ఒక్కరికి సగటున నెలకు రూ.1180 చొప్పున అందించాలి. ఈ లెక్కన ఏడాదికి రూ.19 లక్షల కోట్లు అవసరమవుతాయి. ఇది దేశ జీడీపీలో 11.4 శాతంకు సమానం. ఏటా కేంద్రం వసూలు చేసే పన్నుల మొత్తంకన్నా 50 శాతం అధికం. 2017-18లో దేశ జీడీపీ ప్రస్తుత ధరల్లో రూ.167 లక్షల 73 వేల కోట్లు (రూ.130 లక్షల 11వేల కోట్లు 2011-12 స్థిర ధరల్లో)..

2011లో సేవా అనే స్వచ్ఛంద సంస్థతో కలిసి మధ్యప్రదేశ్‌లో అధ్యయనం చేసిన యూనిసెఫ్ మరో ప్రతిపాదన చేసింది. పేద ప్రజల్లోని పెద్దవారికి నెలకు రూ.300 చొప్పున, చిన్నారులకు రూ.150 చొప్పున సహాయం అందించాలన్నది ఆ సూచన. దీన్ని అమలులో పెడితే ఏడాదికి ఐదుగురు కుటుంబసభ్యులకు(ఇద్దరు పెద్దలు, ముగ్గురు చిన్నారులు) అయ్యే ఖర్చు 2017-18 ధరల్లో రూ.18000గా లెక్క కట్టారు. ఇలాంటిదే మరో సూచన ప్రముఖ ఆర్థికవేత్త ప్రణబ్ బర్ధాన్ నుంచి వచ్చింది. ఆయన ప్రతిపాదించిన యూబీఐ ప్రకారం ఐదుగురు సభ్యుల కుటుంబానికి ఏటా ఇవ్వాల్సిన మొత్తం రూ.16000గా లెక్క తేల్చారు. బర్ధాన్ ప్రతిపాదనను అమలు చేయాలంటే ఏటా రూ.4 లక్షల 30 వేల కోట్లు అవసరమవుతాయి. ఈ మొత్తం మన జీడీపీలో 2.6 శాతానికి సమానం. కేంద్రం ప్రస్తుతం ఇస్తున్న సబ్సిడీల మొత్తం జీడీపీలో 3 శాతమేర ఉన్నాయి. చౌక ధరలకు ఆహార ధాన్యాలు అందించే పీడీఎస్‌కు జీడీపీలో 0.84 శాతం, గ్రామీణ ఉపాధి హామీ పథకానికి 0.33 శాతం,పెట్రోలియం సబ్సిడీ 0.15 శాతం, ఎరువుల సబ్సిడీ కింద 0.4 శాతంమేర కేంద్రం ఖర్చు చేస్తోంది. ఓవేళ యూబీఐ పథకాన్ని అమలులోకి తెచ్చినా ఆరోగ్య బీమా, చిన్నారులు, మహిళల కోసం అమలు చేస్తున్న (మాతా,శిశుసంరక్షణ, వగైరా)పథకాలను కొనసాగించాలని సామాజికవేత్తలు సూచిస్తున్నారు.

కన్నయ్య కుమార్‌పై చార్జిషీటు

- దేశద్రోహం కేసులో మూడేండ్ల తర్వాత దాఖలు చేసిన పోలీసులు

న్యూఢిల్లీ: జేఎన్‌యూ విద్యార్థి సంఘం మాజీ నాయకులు కన్నయ్య కుమార్, ఉమర్ ఖాలిద్‌లపై దేశద్రోహం కింద ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేశారు. పార్లమెంటుపై దాడి కేసులో ప్రధాన వ్యూహకర్త అఫ్జల్‌గురు ఉరితీతకు వ్యతిరేకంగా 2016 ఫిబ్రవరిలో యూనివర్సిటీలో కార్యక్రమం చేపట్టిన ఆరోపణలతో ఆయనతో పాటు మరో ఎనిమిది మందిపై సోమవారం చార్జిషీటు నమోదు చేశారు. ఈ ఘటనపై మూడేండ్ల క్రితమే దర్యాప్తును ప్రారంభించిన పోలీసులు హడావుడిగా ఇప్పుడు చార్జిషీటు దాఖలు చేయడం చర్చనీయాంశమైంది. కాగా, కన్నయ్య, ఉమర్ ఖాలిద్, అనిర్బన్ భట్టాచార్యలతో పాటు జమ్ముకాశ్మీర్‌కు చెందిన మరో ఏడుగురు విద్యార్థులపైన చర్యలు తీసుకోవడానికి తమ వద్ద తగిన ఆధారాలు ఉన్నాయని పోలీసులు తెలిపారు. వీరిపై 1200ల పేజీలతో కూడిన చార్జిషీటును ఢిల్లీ పటియాల కోర్టుకు పోలీసులు సమర్పించారు. కాగా కోర్టు ఈ కేసుపై మంగళవారం విచారణ చేపట్టనుంది.

రాజకీయ ఎత్తుగడలో భాగం : కన్నయ్య

పోలీసుల చార్జిషీటుపై కన్నయ్య కుమార్ స్పందించారు.' ఒకవేళ ఈ వార్త నిజమైతే పోలీసులకు, ప్రధాని మోడీకి ధన్యవాదాలు. సార్వత్రిక ఎన్నికలకు ముందున్న తరుణంలో చార్జిషీటును దాఖలు చేయడాన్ని బట్టి చూస్తే ఇది రాజకీయ ఎత్తుగడలో భాగమని సుస్పష్టంగా తెలుస్తున్నది. న్యాయవ్యవస్థపైన నాకు నమ్మకం ఉన్నది' అని కన్నయ్య అన్నారు. 'దేశ దృష్టిని మళ్లించడానికి, తమ పాలన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి కేంద్ర ప్రయత్నిస్తున్నది. కేసులో పోరాడి మా నిజాయతీని నిరూపించుకుంటాం' అని తనపై వచ్చిన ఆరోపణలను ఉమర్ ఖాలిద్ ఖండించారు.


అబద్ధపు వార్తల ప్రచారంలో దిట్ట

సార్వత్రికం సమీపిస్తున్న వేళ...

తప్పుడు వార్తలకు ఫ్లడ్ గేట్లు ఎత్తేసిన బీజేపీ

- శబరిమల మొదలు.. దేన్నీ వదలని హిందూత్వశక్తులు

న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ అబద్ధపు వార్తల ప్రచారానికి బీజేపీ వరదగేట్లు ఎత్తివేసినట్టు కనిపిస్తున్నది. సైనికపరమైన, మత సంబంధిత విషయాలు, రామమందిరం, మతఘర్షణల హింస, రాజకీయ నేతల పరువు తీసే వార్తలు, పాకిస్తాన్... ఇలా ఒకటేమిటి అనేక విషయాలపై బీజేపీ ఐటీ విభాగం అబద్ధపు వార్తలను ప్రచారం చేస్తున్నది. ఐటీ విభాగం వాటిని ఇంటర్నెట్‌లో అప్‌లోడ్ చేయటం తరువాయి.. క్షణాల్లో అనేక సోషల్‌మీడియా వేదికలపైకి ఈ వార్తలు పాకిపోతున్నాయి. కేరళలోని వలాంచెరి పట్టణంలో ఒక రిటైర్డ్ పోస్టు మాస్టర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆ మరుసటి రోజే రుతుక్రమ వయస్సులో వున్న ఇద్దరు మహిళలు శబరిమల అయ్యప్ప ఆలయంలోకి ప్రవేశించారు. ఈ రెండింటికీ ముడిపెడుతూ బీజేపీ ఐటీ విభాగం నిర్వాహకులు 'మహిళలు శబరిమల సంప్రదాయాన్ని ఉల్లంఘించారన్న మనస్తాపంతో వలంచెరిలో పోస్టు మాస్టర్ ఆత్మహత్య చేసుకున్నాడు' అంటూ కట్టు కథ అల్లి ఇంటర్నెట్‌లో అప్‌లోడ్ చేశారు.



క్షణాల్లో ఆ వార్త సోషల్ మీడియాలో గుప్పు మంది. అసలు ఈ రెండు ఘటనలకు ఎటువంటి సంబంధమూ లేకపోవటం గమనార్హం.

'మహిళా మావోయిస్టులు శబరిమల ఆలయాన్ని అపవిత్రం చేశారు. మహిళలు ఆలయప్రవేశాన్ని తట్టుకోలేక గత రెండు నెలల్లో గుండెపగిలి మరణించిన వారిలో ఈయన నాలుగో వ్యక్తి' అని బీజేపీ రాష్ట్ర ఐటీ విభాగం ట్విట్టర్‌లో పెట్టిన వార్తకు స్పందనగా ఇటువంటిదే మా గ్రామంలో సాయిబాబా ఆలయం విషయంలో జరిగిందంటూ ఆ పార్టీ మరో గ్రామ నేతలు ట్వీట్ చేశారు.

వెలంచరి రిటైర్డ్ పోస్టు మాస్టర్ జయరామన్ మరణానికి, ఆలయంలో మహిళల ప్రవేశానికి ఎటువంటి సంబంధమూ లేదని ఈ వార్తలపై దర్యాప్తు చేసిన పోలీసులు స్పష్టం చేశారు. మహిళలు ఆలయ ప్రవేశానికి ముందు రోజే జయరామన్ ఆత్మహత్యకు పాల్పడ్డాడని అధికారులు వివరించారు. జయరామన్ వార్త ఇప్పటికీ సోషల్ మీడియా వేదికపై ప్రత్యక్షమవుతూనే వున్నది. దీనికి 1300 రిట్వీట్‌లు, దాదాపు వెయ్యికి పైగా లైక్‌లూ లభించాయి కూడా. గత కొద్ది నెలలుగా కేరళలో శబరిమల వివాదాన్ని ఆసరాగా చేసుకొని బీజేపీ హింసాత్మక దాడులకు తెగబడుతున్న విషయం తెలిసిందే. ఈ అంశానికి సంబంధించి ఇదే తొలి నకిలీ వార్త కానప్పటికీ, సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన నాటి నుండి బీజేపీ ఐటీ విభాగం, దాని మద్దతుదారులు ఇటువంటి తప్పుడు ప్రచారంపై దృష్టి కేంద్రీకరించి నకిలీ వార్తలను ప్రచారంలోకి తెస్తూనే వున్నారు.

ఎన్నికలు సమీపిస్తున్న ప్రస్తుత తరుణంలో ఎవరి మరణవార్తనైనా సరే మత కోణంలో వెలుగులోకి తెచ్చే అవకాశాన్ని బీజేపీ/ఆరెస్సెస్ మూకలు వదులుకోవటం లేదన్న విషయం స్పష్టమవుతోంది. ఉదాహరణకు ఈ నెల రెండున రాయ్‌బరేలీలోని రామజానకీ మందిరం పేరు మార్పిడి వ్యవహారంలో అక్కడి పూజారి ఉరి వేసుకున్న ఘటనను బీజేపీ-ఆరెస్సెస్ సోషల్ మీడియా నిర్వాహకులు ఈ హత్యను 'జిహాదిస్టులు' ముస్లింలు చేశారంటూ ప్రచారం ప్రారంభించారు. కొంతమంది బీజేపీ మద్దతుదారులు ఈ పూజారి ఉరి వేసుకున్న ఫోటోను షేర్ చేస్తూ ఇది 'ఐఎస్ తరహా ఉగ్రవాదం' అంటూ వ్యాఖ్యలను జోడించారు. ఈ వార్తపై కొందరు మీడియా మిత్రులు విచారణ జరిపి నిగ్గుతేలిస్తే.. ఆత్మహత్యకు పాల్పడిన ఆ పూజారి లైంగికదాడి కేసులో నిందితుడన్న విషయం వెల్లడయింది.

'సోనియా గాంధీ ప్రపంచంలోనే ఆరో సంపన్నురాలు' అని కేంద్ర మంత్రి మేనకాగాంధీ వ్యాఖ్యలు చేసినట్టున్న ఒక వీడియోను 'ది ఇండియా ఐ', జీ న్యూస్ ఫాన్స్ క్లబ్ వంటి పేర్లతో సోషల్ మీడియాలో కాషాయ శక్తులు మరోసారి పోస్ట్ చేశాయి. వాస్తవాలను పరిశీలిస్తే ఇది నాలుగేండ్ల నాటి వీడియో అన్న విషయం వెలుగులోకి వచ్చింది. ఈ వీడియో 2012లో బిజినెస్ ఇన్సైడర్‌లో ప్రచురితమైందని, అయితే ఎన్నికల కమిషన్ వద్ద వున్న సమాచారం ఇందుకు విరుద్ధంగా వుందని తెలుస్తోంది. అదే విధంగా 'వుయ్ సపోర్ట్ నరేంద్రమోడీ' అన్న పేరుతో వామపక్ష నేతల ప్రతిష్టను దెబ్బతీసే విధంగా కొన్ని వ్యాఖ్యలు, వీడియోలు సోషల్ మీడియాలో ప్రచారమవుతున్నాయి.

తండాలపై బ్లాస్టింగ్ దుమ్ము

వెంకటాద్రి రిజర్వాయర్‌తో ప్రాణాలకు ముప్పు

- శ్వాసకోశ వ్యాధులతో చిన్నారులు
- ఆస్పత్రి పాలైన 70 గిరిజన కుటుంబాలు
- పరిహారం ఇవ్వకుండానే పనులు.. స్థానికుల ఆగ్రహం

నవతెలంగాణ-మహబూబ్‌నగర్‌ప్రతినిధి

'వట్టెం రిజర్వాయర్‌లో గుట్టకు చేస్తున్న బ్లాస్టింగ్ వల్ల దుమ్ము మా తండాలను కప్పేస్తోంది. భారీ శబ్దాలతో గుండె అదురుతోంది. చంటి పిల్లలు, వృద్ధులు ఎక్కువగా వ్యాధుల బారిన పడుతున్నారు. దుమ్మూ దూళితో అస్తమాకు గురవుతున్నారు. మేం చేసిన కష్టం దవాఖానా ఖర్చులకే సరిపోవడం లేదు. ఇంతవరకు భూములకు పరిహారమివ్వలేదు. ఇండ్లను నిర్మించలేదు. పైగా ప్రాజెక్టు వల్ల మా ప్రాణాలకు ముప్పు వాటిల్లుతోంది' అని వెంకటాద్రి రిజర్వాయర్ నిర్వాసితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల్లో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లా వట్టెం దగ్గర వెంకటాద్రి రిజర్వాయర్ నిర్మిస్తున్నారు. 2015 నుంచి ఇక్కడ హెచ్‌ఈఎస్ కంపెనీ వారు నిర్మాణ పనులు చేపడుతున్నారు. రిజర్వాయర్‌లో కారుకొండ తండా, అనకాపల్లి తండా, అన్‌కాన్ పల్లి, జీగుట్ట తండా, రాంరెడ్డితండా, పోతరెడ్డిపల్లి, వెంకాయపల్లి, వట్టెం, కారుకొండ, కుమ్మెర గ్రామాల వారు 12వేల మంది సాగు భూమి, ఇండ్లను కోల్పోయారు. ప్రధానంగా 5,750 ఎకరాలు 2,500 ఇండ్లు సర్వం నీటిలో మునుగుతున్నాయి. ప్రారంభంలో కొంతమందికి పరిహారం ఇచ్చినప్పటికీ ఇంకా సగం మందికి రావాల్సి ఉంది. రిజర్వాయర్ నిర్మాణంలో జాగ్రత్తలు తీసుకోవాల్సిన అధికారులు అవి పాటించడం లేదు. కట్ట నిర్మాణం కోసం పక్కనే ఉన్న గుట్టకు బ్లాస్టింగ్ చేస్తున్నారు. బ్లాస్టింగ్‌తో వెలువడిన దుమ్ము వల్ల తండాలు, సమీప గ్రామాలు దుమ్మూ, దూళితో నిండిపోతున్నాయి. పక్కనే పంట పొలాలను దుమ్ము కప్పేస్తోంది.

ఆస్పత్రుల్లో చిన్నారులు



అంకాన్‌వల్లి తండాకు చెందిన వర్త్యావత్ రాజు కొడుకు నాలుగేండ్ల చరణ్ దుమ్ము వల్ల ఊపిరితిత్తులు పూర్తిగా దెబ్బతిన్నాయని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రధాన ఆస్పత్రికి తీసుకెళ్తే బాబు పరిస్థితి విషమంగా ఉందని చెప్పి హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ వివిధ పరీక్షలు చేసిన తర్వాత డాక్టర్లు బయటి వాతావరణం, దుమ్మూదూళితోనే బాబు ప్రాణాపాయ స్థితికి చేరుకున్నాడని చెప్పారు. ఇప్పటికే రూ.25వేలు ఖర్చు చేశారు. రాజు రెండో కుమారునికి కూడా అస్తమా వచ్చింది. కారుకొండ తండాకు చెందిన చందు కుమారుడు యశ్వంత్ కూడా ఆస్పత్రి పాలయ్యాడు. రోజుకు మూడుసార్లు శ్వాస సరిగా అందడానికి ఆక్సిజన్ అందిస్తున్నారు. ఇతని పరిస్థితి విషమంగానే ఉన్నట్టు డాక్టర్లు చెప్పారని గ్రామస్తులు తెలిపారు. జీగుట్ట తండాకు చెందిన భాషా కుమారుడు శంకర్ పరిస్థితి విషమంగానే ఉంది. మొత్తం తండాలో సుమారు 70 మందికి పైగా పిల్లలు, వృద్ధులు ఆస్పత్రుల పాలయ్యారు. పాండు అనే 70ఏండ్ల వృద్ధునికి దుమ్ము వల్ల అస్తమాతో పాటు పక్షవాతం వచ్చింది. పరిశుభ్రమైన వాతావరణం ఉంటే తప్ప ఆరోగ్యం కుదుట పడే పరిస్థితి లేదని డాక్టర్లు చెప్పడంతో తండాల వాసులు ఆందోళన చెందుతున్నారు.



ప్రాజెక్టు పేరుతో మా ప్రాణం తీస్తున్నారు

కలోగంజో తాగి తండాల్లో ఆరోగ్యంగా ఉండేవాళ్లం. ప్రభుత్వం చేపట్టిన రిజర్వాయర్ మా ప్రాణం మీదకి తెచ్చింది. రాతి కట్టడాలను బ్లాస్టింగ్ చేయడం వల్ల దుమ్ము తండాలను ముంచెత్తుతోంది. దీంతో తండావాసులు అనారోగ్యాల బారిన పడుతున్నారు.

- పాండు, రాములు నాయక్- అన్‌కాన్‌పల్లి

ఇల్లు, భూమి ఇవ్వలేదు..ఉద్యోగం రాలేదు..

రిజర్వాయర్ కంటే ముందు ఇంటికో ఉద్యోగం, భూమికి భూమి ఇస్తామన్నారు. ఉద్యోగమిచ్చి నెల రోజుల వేతనం తీసుకున్న తర్వాతే రిజర్వాయర్ పనులు మొదలు పెడ్తామన్నారు. కానీ రిజర్వాయర్ పనులు మొదలెట్టి నాలుగేండ్లు కావస్తున్నా ఒక్కరికైనా ఉద్యోగమివ్వలేదు. ఇండ్లు నిర్మించి ఇవ్వలేదు. మార్కెట్లో గజానికి రూ.10వేలుంటే, తండా వాసులకు మాత్రం రూ.250 చెల్లిస్తామంటున్నారు. ఇదెక్కడి న్యాయం?. మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లించాలి. ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా తగిన చర్యలు తీసుకోవాలి.

- శివ, బాలు నాయక్- కారుకొండ తండా

పతంగులు ఎగురవేస్తుండగా ప్రమాదం

- ఇద్దరికి గాయాలు



నవతెలంగాణ- విలేకరులు

సంక్రాంతి పండుగ సందర్భంగా పతంగులు ఎగురవేస్తుండగా నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం మామిడిపల్లిలో విద్యుత్ తీగలు తగిలి బాలుడికి గాయాలయ్యాయయి. గ్రామంలోని వెంకటేశ్వరకాలనీలో చిట్టి నీక్షిత్ డాబాపైన పతంగి ఎగుర వేశాడు. అది పక్కనే ఉన్న 11కెవి హైటెన్షన్ వైర్లకు తగలడంతో విద్యుద్ఘాతంలో బాలునికి కుడిచేయి, కుడికాలుకు తీవ్ర గాయాలయ్యాయి. బాలుడ్ని నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు.

యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రానికి చెందిన పోత్కాని సాయినాథ్ గాలిపటం ఎగరవేస్తూ ప్రమాదవశాత్తు భవనంపై నుంచి కింద పడ్డాడు. తీవ్ర గాయాలైన ఆయన్ను కుటుంబ సభ్యులు స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ప్రయివేట్ ఆస్పత్రికి తీసుకుపోయారు.

చంద్రబాబుకు రిటర్న్ గిఫ్ట్ ఇస్తాం

- ఏపీలో బీసీలకు నాయకత్వం వహిస్తా: తలసాని



విజయవాడ: ఆంధ్రప్రదేశ్‌లోని యాదవులకే కాదు.. బీసీలకు నాయకత్వం వహించడానికి తాను సిద్ధంగా ఉన్నానని తెలంగాణ మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లోని మిత్రుల ఆహ్వానం మేరకు ఇబ్రహీంపట్నంలో యాదవ మహాసభలో తలసాని పాల్గొన్నారు. ఆ తర్వాత విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా తలసాని మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం యాదవులకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నదని, చట్టసభల్లో తగినన్ని సీట్లిచ్చి అక్కడి ముఖ్యమంత్రి కేసీఆర్ యాదవులను గౌరవించారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ యాదవ నేతలు రాజకీయాల్లో ఎదగాలని, ఇండ్లల్లో కూర్చుంటే రాజకీయ అవకాశాలు రావని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో యాదవుల రాజకీయ ఎదుగుదలకు తాను అండగా ఉంటానని, ఇక్కడ వెనుకబడిన తరగతులకు పప్పు బెల్లాలు పెట్టి సరిపెడుతున్నారంటూ ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ పరిపాలన సరిగా లేదని, ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు తప్పనిసరిగా తాము రిటర్న్ గిఫ్ట్ ఇస్తామని చెప్పారు. హైదరాబాద్‌కు 450 సంవత్సరాల చరిత్ర ఉందని, సైబర్ టవర్ నిర్మించినంత మాత్రాన ఆ రాష్ట్ర అభివృద్ధి చేసినట్టేనా అని తలసాని ప్రశ్నించారు.

రెండు చిరుత పులులు మృత్యువాత

- మంచిర్యాల జిల్లాలో వేటగాళ్ల ఉచ్చులో చిక్కుకుని..
- నిజామాబాద్‌లో అనుమానాస్పద స్థితిలో..

నవతెలంగాణ - హాజీపూర్ / లక్షెట్టిపేట/ మాక్లూర్

అటవీ ప్రాంతంలో రెండు చిరుత పులులు మృత్యువాత పడ్డాయి. వేటగాళ్ల ఉచ్చులో చిక్కుకుని ఒకటి, అనుమానాస్పద స్థితిలో మరొకటి చనిపోయాయి. ఈ రెండు ఘటనలు మంచిర్యాల, నిజామాబాద్ జిల్లాల్లో ఆలస్యంగా వెలుగుచూశాయి. మంచిర్యాల జిల్లా పాత మంచిర్యాల పరిధిలోని రంగపేట గ్రామ శివారులో జరిగిన ఘటనకు సంబంధించి లక్షెట్టిపేట ఫారెస్టు రేంజ్ అధికారి నాగవత్ స్వామి తెలిపిన వివరాలు..

పాత మంచిర్యాల పరిధిలోని రంగంపేట గ్రామ సమీపంలోని గుట్టబోరు వద్ద వేటగాళ్లు క్లచ్ వైర్‌తో బిగించిన ఉచ్చులో పడి చిరుతపులి చిన్నచెట్టుకు చిక్కుతుంది. దాన్ని లాక్కుంటూ చిరుత కొంత దూరం వచ్చింది. ఈ క్రమంలో ఉచ్చు మరో పెద్దచెట్టు కొమ్మలకు ఇరుకోవడంతో ఉచ్చు బిగుసుకుని చిరుత మృతిచెందింది. సోమవారం అటువైపుగా వెళ్తున్న గ్రామస్తులు గమనించి ఫారెస్టు అధికారులకు సమాచారం అందించారు. లక్షెట్టిపేట ఫారెస్టు అధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. చనిపోయింది మగ చిరుతపులిగా గుర్తించారు. మూడ్రోజుల కిందటే మృతిచెందిందనీ, దాని వయస్సు నాలుగేండ్లు ఉంటుందనీ అధికారులు తెలిపారు. జన్నారం నుంచి డాగ్‌స్క్వాడ్ రప్పించి వేటగాళ్లను పట్టుకుంటామని రేంజ్ అధికారి నాగవత్ స్వామి తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వరుసగా చిరుత పులులు కనిపోవడం కలకలం రేపుతోంది.



ఉచ్చులో ఉరిపడి మృతిచెందిన చిరుత

పోలీసుల అదుపులో నలుగురు నిందితులు
7పులి గోర్లు, నాలుగు దంతాలు స్వాధీనం

నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం గుత్ప గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో అనుమానాస్పద స్థితిలో మృత్యువాత పడిన చిరుతపులి కళేబరాన్ని అటవీశాఖ అధికారులు సోమవారం గుర్తించారు. బీట్ అధికారులు పెట్రోలింగ్ చేస్తుండగా చనిపోయిన చిరుతపులి కనిపించింది. సమాచారాన్ని ఉన్నతాధికారులకు ఇవ్వడంతో ఆర్మూర్ డివిజన్, జిల్లా స్థాయి అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని డాగ్‌స్క్వాడ్‌ను రప్పించారు. చిత అనే డాగ్‌తో పరిశీలించగా నలుగురు నిందితులను పట్టించింది. వారి నుంచి ఏడు పులి గోర్లు, నాలుగు దంతాలను స్వాధీనం చేసుకున్నట్టు అధికారులు తెలిపారు. కేతావత్ రవి, మానవత్ నరేందర్, ఆవుల కాపార్లు మోతివార్ తులసీరాం, తోపర్తి విజయ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. పశు వైద్యులు కిరణ్‌దేశ్‌పాండే చిరుత పులి కళేబరానికి పోస్టుమార్టం నిర్వహించారు. చిరుత మృతికి గల కారణాలు తెలియ రాలేదన్నారు. దర్యాప్తు చేసి, పోస్టుమార్టం రిపోర్టు వచ్చిన తరువాత వివరాలు తెలియజేస్తామని డివిజనల్ ఫారెస్టు అధికారి రాములు తెలిపారు. అటవీ ప్రాంతంలో ఎస్ఐ సాయినాథ్, అటవీశాఖ అధికారులు అమృత, నర్సింగ్‌రావు, డాగ్ స్క్వాడ్ బృందం సత్యనారాయణ, శ్రీనివాస్ తదితరులు పరిశీలించారు.

సినీ దర్శకుడు రంగారావు మృతి

- డైరెక్టర్ ఎన్.శంకర్ నివాళి
- మేడారంలో అంత్యక్రియలు పూర్తి



నవతెలంగాణ-నేరేడుచర్ల

ప్రముఖ తెలుగు సినీ దర్శకుడు, తెలుగు ఫిలిం డైరెక్టర్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ రంగారావు(59) సోమవారం ఉదయం హైదరాబాద్‌లో మృతిచెందారు. ఆయన కొంత కాలంగా కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. రంగారావు సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం మేడారం గ్రామానికి చెందిన కట్టా వెంకటరామయ్య-అనసూర్యమ్మల కుమారుడు. వృత్తిపరంగా హైదరాబాద్‌లోని మలక్‌పేటలో నివసిస్తున్నారు. రంగారావుకు ఇద్దరు కుమారులు ఉన్నారు. సినీరంగంపై మక్కువతో 1985లో చెన్నైలో వివిధ దర్శకుల వద్ద అసిస్టెంట్‌గా పనిచేశారు. 1989లో రాజశేఖర్- జీవిత జంటగా నటించిన ఇంద్రధనస్సు సినిమాతో సినీరంగంలో గుర్తింపు తెచ్చుకున్నారు. 1990లో ఉద్యమం సినిమాకు రచయితగా, దర్శకునిగా పనిచేసి నంది అవార్డు పొందారు. అనంతరం అలెగ్జాండర్, నమస్తే అన్న, బెబ్బిలిబుల్లోడు, వారేవ్వా మొగుడా, చెప్పుకోండి చూద్దాం, ఆఖరి క్షణం సినిమాలకు దర్శకత్వం వహించారు. తెలుగు ఫిలిం అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా సేవలు అందిస్తున్నారు.

రంగారావు స్వగ్రామమైన మేడారంలో సోమ వారం అంత్యక్రియలు నిర్వహించారు. ఆయన ఆకస్మిక మృతి పట్ల బంధుమిత్రులు, గ్రామస్తులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రముఖ సినీదర్శకుడు ఎన్.శంకర్ రంగారావు భౌతికకాయంపై పుష్పగుచ్ఛం ఉంచి, నివాళి అర్పించారు. అనంతరం అంతిమ యాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకర్లతో ఆయన మాట్లాడుతూ.. రంగారావు అత్యంత సౌమ్యుడనీ, తెలుగు ఫిలిం డైరెక్టర్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా సేవలు అందిస్తూ, ప్రముఖ డైరెక్టర్ల ప్రశంసలు పొందారనీ అన్నారు. ఆయన మృతి సినీ లోకానికి తీరని లోటన్నారు. తెలుగు ఫిలిం డైరెక్టర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాంప్రసాద్, జాయింట్ డైరెక్టర్ ఎన్ఎస్ రమేష్‌రెడ్డి, మన్నె వాసి, ప్రజానాట్య మండలి రాష్ట్ర కమిటీ సభ్యులు నాగసైదులు నివాళి అర్పించారు.



పుష్పగుచ్ఛం ఉంచుతున్న దర్శకుడు ఎన్.శంకర్

చలికి గుర్తుతెలియని వ్యక్తి మృతి

- బాలానగర్‌లో ఘటన

నవతెలంగాణ - బాలానగర్

చలికి తట్టుకోలేక గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన సోమవారం బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ కిషన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బాలానగర్-నర్సాపూర్ చౌరస్తాలో మతిస్థిమితం కోల్పోయిన గుర్తు తెలియని వ్యక్తి(35) తిరుగుతూ ఉండేవాడు. చలి తీవ్రతకు తట్టుకోలేక ఆదివారం రాత్రి బాలానగర్-నర్సాపూర్ చౌరస్తాలో మృతిచెందాడు. చౌరస్తాలో ఉన్న ఓ టీస్టాల్ యజమాని గమనించి పోలీసులకు సమాచారం అందించాడు. మృతుడి ఒంటిపై లైట్‌బ్లూకలర్ ఫుల్‌షర్టు, ఎరుపురంగు జర్కిన్ ఉంది. మృతదేహాన్ని 108లో గాంధీ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చండీగఢ్‌లో పరిశుభ్రత ప్రశంసనీయం

- పేట్ సఫా అంబాసిడర్ హాస్యనటుడు రాజు శ్రీవాత్సవ

రాయ్‌పూర్: చండీగడ్‌లో పరిశుభ్రత ప్రశంసించదగినదని ప్రముఖ హాస్యనటుడు పేట్ సఫా బ్రాండ్ అంబాసిడర్ రాజు శ్రీవాత్సవ్ అన్నారు. ఆయన చండీగడ్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయనను పేట్‌సఫా కంపెనీ సీఎండి డా. సంజీవ్ జునేజా సాదరంగా ఆహ్వానించారు. అనంతరం కంపెనీ ఉద్యోగులకు ఆయనను పరిచయం చేశారు. ఈ సందర్భంగా పేట్ సఫా కంపెనీ అమ్మకాల వివరాలను అయనకు వివరించారు. అనంతరం ఆయన ఉద్యోగులతో కలిసి ఉత్సాహంగా పాటలు పాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రతి ఒక్కరూ శరీరాన్ని ఆరోగ్యంతో పాటు పొట్టను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అలాగే గ్రామాలు, పట్టణాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే దేశం పచ్చగా ఉంటుందనీ తెలిపారు. ప్రతి ఒక్కరూ దేశ పరిశుభ్రత కోసం పాటుపడాలని వెల్లడించారు.

షేర్‌మార్కెట్ కోసమే వాటా పెంపు

- పీఎఫ్ఆర్‌డీఏ చట్టాన్ని రద్దు చేయాలి: ఎన్‌ఎంఓపీఎస్ ప్రధాన కార్యదర్శి స్థితప్రజ్ఞ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సీపీఎస్ ఉద్యోగుల వాటాను 10 శాతం నుంచి 4 శాతం పెంచి 14 శాతానికి పెంచడం ఆ సొమ్మును షేర్ మార్కెట్ పాలు చేయడం కోసమేనని నేషనల్ మూవ్‌మెంట్ ఫర్ ఓల్డ్ పింఛన్ స్కీం (ఎన్‌ఎంఓపీఎస్) ప్రధాన కార్యదర్శి స్థితప్రజ్ఞ విమర్శించారు. జార్ఖండ్‌లోని రాంచీలో ఎన్‌ఎంఓపీఎస్ ఆధ్వర్యంలో సోమవారం బహిరంగసభ జరిగింది. ఈ సందర్భంగా స్థితప్రజ్ఞ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగి సీపీఎస్ కాంట్రిబ్యూషన్ 4 శాతం పెంచడం కన్నా పింఛన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (పీఎఫ్ఆర్‌డీఏ) చట్టంలో గ్యారంటీ చేర్చాలని సూచించారు. ఉద్యోగులకు ఎలాంటి సామాజిక భద్రత చేకూరదని చెప్పారు. ఈ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. పీఎఫ్ఆర్‌డీఏ చట్టాన్ని రద్దు చేసి ఇటు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పింఛన్ నిధిని రాష్ట్రాలకు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పింఛన్ నిధిని ఉద్యోగులకు చేరేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేశంలో 21 రాష్ట్రాల్లో సీపీఎస్ విధానాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని అన్నారు. కేరళ, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల్లో ఈ విధానంపై అధ్యయనం కోసం హైపవర్ కమిటీలు వేశాయని చెప్పారు. సీపీఎస్‌ను రద్దు చేయాలనీ, ఓపీఎస్‌ను అమలు చేయాలని కోరుతూ ఢిల్లీ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించిందని అన్నారు. అన్ని రంగాల్లో ముందున్నామని చెప్పే తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర ఉద్యోగులకు సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జార్ఖండ్ శాఖ అధ్యక్షులు విక్రాంత్, టీఎస్‌సీపీఎస్ఈయూ ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్, జాతీయ నాయకులు విజె బంధు తదితరులు పాల్గొన్నారు.



సంపాదకీయం

కార్మికలోకానికి అభినందన

జనవరి 8,9 రెండు రోజుల సార్వత్రిక సమ్మె, 9న గ్రామీణ భారత్ బంద్ విజయవంతం చేసిన భారత శ్రామిక జనావళికి జేజేలు. సార్వత్రిక సమ్మెలో సంఘటిత, అసంఘటిత కార్మికులూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగులూ ఉత్సాహంగా పాల్గొన్నారు. భవన నిర్మాణం, ప్రయివేటు రవాణా, కొండలు, గుట్టలు మొదలు శిఖరాల వరకూ పని చేసే ప్లాంటేషన్ వర్కర్లూ... ఇలా అన్ని విభాగాలు, తరగతుల కార్మికులు పెద్దఎత్తున పాల్గొనడం హర్షణీయం. బ్యాంకింగ్, ఇన్సూరెన్సు, టెలికమ్యూనికేషన్లు, పోర్టులు, షిప్‌యార్డులతోసహా అనేక భారీ పరిశ్రమల్లో పని స్తంభించిపోయింది. భారత కార్మికోద్యమ చరిత్రలో ఇది ఓ ముఖ్య ఘట్టంగా నిలిచిపోతుంది. కేంద్ర ట్రేడ్ యూనియన్లు రెండు రోజుల సమ్మెకు పిలుపునివ్వగా అఖిలభారత కిసాన్‌సభ, వివిధ రైతు, వ్యవసాయ కార్మిక, సామాజిక సంఘాలతో కూడిన భూమి అధికార్ ఆందోళన్ జనవరి 9న గ్రామీణ భారత్ బంద్ నిర్వహించాలని నిర్ణయించడం కార్మిక కర్షక మైత్రీ బంధాన్ని బలోపేతం చేసింది. బీజేపీ సర్కారుపై యావద్భారత శ్రామిక లోకం ఎత్తిన తిరుగుబాటు బావుటా ఉవ్వెత్తున ఎగసింది. సార్వత్రిక సమ్మె, గ్రామీణ బంద్ విజయం కష్ట జీవుల్లో మరింత ఆత్మ విశ్వాసాన్ని నింపి, భవిష్యత్ పోరాటాలకు గొప్ప బలాన్ని చేకూర్చుతుంది.

ప్రపంచంలో ఈ విధానాలెక్కడా ప్రజలకు ప్రయోజనాలు చేకూర్చలేదు సరికదా కడగండ్లనే మిగిల్చాయి. అయినప్పటికీ మొండిగా ఆ విధానాలనే అమలు చేయబూనుకుంటే పాలక వర్గాలకు శృంగభంగం తప్పదు. రెండు రోజుల దేశవ్యాప్త సమ్మెలో పాల్గొని ఐక్య పోరాట స్ఫూర్తి ప్రదర్శించిన శ్రామికలోకానికి అభినందనలు.

సార్వత్రిక సమ్మెతో కేరళ, అసోం, ఒడిషా, పశ్చిమ బెంగాల్, త్రిపుర తదితర రాష్ట్రాల్లో జనజీవనం స్తంభించిపోయింది. సమ్మె ఈ రాష్ట్రాల్లో గరిష్ట ప్రభావాన్ని చూపింది.




తెలంగాణ రాష్ట్రంలో మొదటి రోజు కార్మిక సమ్మె, మండల కేంద్రాలు, పారిశ్రామిక ప్రాంతాల్లో ప్రదర్శనలు జరగ్గా రెండో రోజున వివిధ పట్టణాల్లో, నగరాల్లో సమ్మెలో పాల్గొన్న శ్రామికులు ప్రభుత్వ కార్యాలయాల దగ్గర బైటాయించారు. కష్టజీవుల ఐక్యత చాటి చెప్పారు. దేశంలో అనేక ప్రాంతాల్లో గ్రామీణ ప్రజలు జాతీయ రహదారితో సహా అనేక రోడ్లపై ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లు నిలిపివేసి రవాణా స్తంభింపజేశారు. బెంగాల్‌లో తృణమూల్ శ్రేణులు, పోలీసుల దాడులు, తీవ్ర నిర్బంధం విధించినా అనేక రంగాలకు చెందిన శ్రమజీవులు వాటిని అధిగమించి సమ్మెను విజయవంతం చేయడం శ్లాఘనీయం. త్రిపురలో కాషాయ మూకలు, రక్షక భటుల నిర్బంధాన్ని తిప్పికొట్టి శ్రామికులు బంద్ నిర్వహించడం అభినంద నీయం. మహారాష్ట్ర, కర్ణాట కల్లో అనేక బహుళ జాతి సంస్థలు సైతం మూత పడినాయి. ప్రధాని నరేంద్ర మోడీ స్వరాష్ట్రం గుజరాత్‌లో ఇంత విస్తృతంగా కార్మిక సమ్మె జరగడం కొన్ని దశాబ్దాల తరువాత ఇదే మొదటిసారి అని మీడియా పేర్కొనడం గమనార్హం.

వినాశకర నయా ఉదారవాద విధానాలను అనసరిస్తున్న మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలను అడ్డగోలుగా యజమానులకు అనుకూలంగా సవరిస్తోంది. కార్మిక సంఘాలతో కనీసం చర్చించకుండానే చట్టాల్లో పెను మార్పులు చేసేస్తోంది. దేశానికి కీలకమైన రక్షణ రంగ ఉత్పత్తులతో సహా ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణకు పూనుకుంది. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా 2016 సెప్టెంబర్ 2న జరిగిన సమ్మె తరువాత సాగిన ఈ విస్తృత కార్యాచరణ కార్మికవర్గ ఆగ్రహానికి అద్దం పట్టింది. వివిధ కార్మిక సంఘాలూ శ్రమజీవులూ సాగించిన అనేక పోరాటాలు నిరసనలకు కొనసాగింపుగానే ఈ సమ్మె జరిగింది. గత ఆగస్టు తొమ్మిదిన జరిగిన జైల్‌భరో, సెప్టెంబర్ 5న ఢిల్లీలో జరిగిన కిసాన్-మజ్దూర్ సంఘర్ష్ ర్యాలీ, ఆ తరువాత నవంబర్ 29,30 తేదీల్లో హస్తినలో కదం తొక్కిన కిసాన్ ముక్తి మార్చ్ వంటివన్నీ కార్మికుల్లో పోరాటస్ఫూర్తిని మరింతగా పెంచాయి. మహారాష్ట్ర రైతుల పోరాటం, మధ్యప్రదేశ్, రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లో నిలకడగానూ విస్తృతంగానూ సాగిన గ్రామీణ ప్రజల పోరాటాలు, ఉద్యమాలూ ఇందులో భాగమే!

ఆసేతు హిమాచలం శ్రామికులు కన్నెర్ర చేస్తున్నా మోడీ సర్కారు తన రూటు మార్చుకోవడంలేదు సరికదా కష్టజీవులపై దాడిని మరింత పెంచడం గర్హనీయం. కార్పొరేట్ల సేవలో తరించిపోతున్నది. సమ్మె మొదటి రోజైన జనవరి ఎనిమిదవ తేదీనే కేంద్ర కార్మిక మంత్రి ట్రేడ్ యూనియన్ చట్ట సవరణ బిల్లును ప్రవేశ పెట్టడం ఇందుకు తార్కాణం. పైపెచ్చు ఈ సమ్మెవల్ల ఎలాంటి ప్రభావమూ ఉండదని సభలో మంత్రి వ్యాఖ్యానించడం అహంకారానికి నిదర్శనం. కేంద్ర ప్రభుత్వ శ్రామిక వ్యతిరేక వైఖరిలో ఎలాంటి మార్పు లేదని, రాదనీ స్పష్టమవుతోంది. బీజేపీని, మోడీ ప్రభుత్వాన్నీ ఓడించడానికి రానున్న లోక్‌సభ ఎన్నికల రాజకీయ పోరాటంలో కార్మికవర్గం భాగస్వామి అవుతుందని ఈ రెండు రోజుల సమ్మె సంకేతాలిచ్చింది. కార్మికులు, రైతులు, ఉద్యోగులు, నిరుద్యోగులు నయా ఉదారవాద విధానాలనే మొత్తంగా విడనాడాలని ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నారు. ప్రపంచంలో ఈ విధానాలెక్కడా ప్రజలకు ప్రయోజనాలు చేకూర్చలేదు సరికదా కడగండ్లనే మిగిల్చాయి. అయినప్పటికీ మొండిగా ఆ విధానాలనే అమలు చేయబూనుకుంటే పాలకవర్గాలకు శృంగభంగం తప్పదు. రెండు రోజుల దేశవ్యాప్త సమ్మెలో పాల్గొని ఐక్య పోరాట స్ఫూర్తి ప్రదర్శించిన శ్రామికలోకానికి అభినందనలు.

గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి తూట్లు



ప్రభాత్ పట్నాయక్

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అస్తిత్వంలోకి రావటానికి కారణమైన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి స్వతంత్ర భారతదేశ చరిత్రలో ఒక విలక్షణ స్వభావం ఉంది. కావాలని అడిగిన తరువాత ఒక పక్షంరోజుల్లో ఉపాధి అందించాలని ఈ చట్టం చెబుతోంది. అలా ఉపాధి అందించలేని స్థితి ఏర్పడినపుడు నిరుద్యోగభృతి చెల్లించాలని కూడా ఈ చట్టం చెబుతోంది. ఈ చట్టం గ్రామీణ ప్రాంతాలకే పరిమితమైందనేది నిజం. అయితే ఇది ఉపాధి హక్కుగా మార్చింది. బాగా చర్చించిన తరువాత పార్లమెంటు ఈ చట్టాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది. భారత రాజ్యాంగం సామాజిక, రాజకీయ హక్కులకు మాత్రమే హామీ ఇచ్చి ఆర్థిక హక్కులను విస్మరించిందనే లోపాన్ని ఈ చట్టాన్ని రూపొందించి ఆచరణలో పార్లమెంట్ సరిదిద్దింది.

కాబట్టి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంతో ఒక నూతన పరిస్థితి ఏర్పడింది. గతంలో కూడా పేదరికం నిర్మూలనకు ఉద్దేశించిన పనికి ఆహారంవంటి పథకాలున్నాయి. అయితే వాటిలో హామీలు ఏమీ లేవు. వాటికి బడ్జెట్ కేటాయింపులు ఉండేవి. అవి ప్రతి సంవత్సరం మారుతూ ఉండేవి. ఆ కేటాయింపులు ఒక్కోసారి పెరగటం, మరోసారి తరగటం జరిగేది. అయితే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వీటికి పూర్తిగా భిన్నమైంది. ఈ చట్టం ఉపాధికి హామీని ఇచ్చింది. ఆ క్రమంలో ఆర్థిక హక్కును సృష్టించటమే కాకుండా పౌరసత్వ భావనకు లోతైన అర్థాన్ని ఇచ్చింది. బిచ్చగాళ్ళతోసహా ప్రతి పౌరుడు తాను కొన్న సరుకులపై పరోక్ష పన్నుల రూపంలో ప్రభుత్వానికి పన్ను కడతాడు. కానీ గతంలో రాజ్యం అందుకు బదులుగా ఆచరణలో పౌరులకు ఏమీ చేసేదికాదు. అది పౌరులకు 'భద్రత'ను కల్పించిందని ఎవరైనా చెబితే అది చాలా చిన్న విషయం అవుతుంది. ఎందుకంటే పేదలకు 'భద్రత' కల్పించటం అర్థరహితం అవుతుంది. అందుకు భిన్నంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఒక నూతన శకానికి తెరలేపుతున్నానని వాగ్దానం చేసింది. ఈ పథకం ద్వారా రాజ్యం తన పౌరులకు కొంతవరకు ఆర్థిక భద్రతను కల్పించటానికి ముందుకు వచ్చింది. అంటే పేదలకు అది ఎంతోకొంత మేలు చేస్తుంది.

నిరుద్యోగంపై అన్ని ప్రభుత్వ వ్యయాలకంటే గుణక ప్రభావంగల మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఒక బ్రహ్మాండమైన ఆయుధంగా పనిచేయగలదు. ఒకవేళ ప్రభుత్వం నిరుద్యోగ సమస్య పరిష్కరించాలని అనుకుంటే అది మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయటానికి బదులుగా దానిపై మరింతగా వ్యయం చేయాలి. అయితే ప్రస్తుత ధోరణి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేదిగానే ఉంది.

పాలక వర్గాలకుండే కుల వివక్ష కారణంగాను, వర్గ వైషమ్యాల కారణంగాను(ఈ పథకం కింద ఉపాధిని పొందుతున్నవారిలో 40శాతం దళిత, ఆదివాసీ కుటుంబాలకు చెందినవారే) ఈ వాగ్దానం అమలులో తీవ్రమైన ఒడిదుడుకులు ఏర్పడ్డాయి. యుపిఏ-2 పాలనలో చిదంబరం ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి చేయవలసిన వాస్తవ బడ్జెటరీ కేటాయింపులలో కోతను విధించటం ద్వారా ఈ పథకానికి తూట్లు పొడవటం మొదలయింది. ఈ పథకం డిమాండ్‌ను అనుసరించి అమలు చేసేది అయినందున అవసరమైతే అదనపు కేటాయింపులు చేయటం జరుగుతుందని, బడ్జెట్‌లో చేసిన కేటాయింపులబట్టి అభిప్రాయానికి రాకూడదని ఈ పథకానికి చేసే కేటాయింపులలో కోతను విధించటాన్ని ఆయన సమర్థించుకున్నాడు. అయితే అలా చేయటం వల్ల కేటాయింపులకు మించి డిమాండ్ ఏర్పడినప్పుడు వేతన బకాయిలు పోగుపడ్డాయి.

కేటాయింపులకంటే డిమాండ్ నిరంతరం పెరుగుతుండగా ఒకవేళ కేటాయింపులను పెంచకపోతే కాలక్రమంలో వేతన బకాయిలు పెరిగిపోతాయి. ప్రస్తుతం ఈ విషయంలో సరిగ్గా ఇదే జరుగుతోంది. వేతన బకాయిలు నిరంతరం పెరిగిపోతూ ఉన్నాయి. అంటే సంవత్సర కాలంలో అనేకమంది కార్మికులకు వేతనాలు అందవు. అంతేకాకుండా వేతనాలను అందుకోవటానికి పట్టే సగటు కాలం కూడా నిరంతరం పెరుగుతూ ఉంటుంది. వేతనాలు సకాలంలో అందని స్థితిలో కార్మికులు ఈ పథకం నుంచి నిష్క్రమించటం మొదలెడతారు. తత్ఫలితంగా ఈ పథకం కింద పనికివుండే డిమాండ్ ఏదో ఒక స్థితిలో దెబ్బతింటుంది. అదే సమయంలో చట్టప్రకారం నిరుద్యోగానికి చేయవలసిన చెల్లింపులు చెల్లించకుండా ఉంటూ, కనీసం తగిన సమయంలో పేర్లు నమోదు చేసుకున్నవారికి కూడా పని ఇవ్వకుండా, దరఖాస్తుదారులను రిజిస్టరు చేయకుండా డిమాండ్‌ను తగ్గించే ధోరణి కనపడుతోంది. ఒక ఆర్థిక హక్కుగా ఉండవలసిన హక్కును నిర్వీర్యం చేయటం జరుగుతోంది. రాజ్యం దయాదాక్షిణ్యాలతో పేదలకు ఎంతోకొంత ఉపశమనం అందించే మరో పేదరిక వ్యతిరేక కార్యక్రమంగా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని మార్చటం జరిగింది.

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి ఒక పేదరిక వ్యతిరేక కార్యక్రమంగా కూడా గణనీ యమైన విస్తృతి ఉంది. ఈ కార్యక్రమం మొదలయినప్పటినుంచి దేశంలోని ప్రతి మూడు గ్రామీణ కుటుంబాలలో ఒకదానికి ఎప్పుడో ఒకప్పుడు పని దొరికింది. 2017-18లోనే ఈ కార్యక్రమం కింద ఎనిమిది కోట్ల మంది ప్రజలకు పని దొరికింది. ఆ సంవత్సరంలో ప్రతి కుటుంబానికి సగటున 46 రోజులపాటు పని దొరికింది. ప్రపంచంలోనే అత్యంత ఉద్యోగితను సృష్టించే పథకం ఇది. అయితే రానురాను ఈ కార్యక్రమానికి చేసే కేటాయింపులు తగ్గుతూ వస్తున్నాయి. నిజానికి ఇది ఉపాధి హామీ పథకం అవటం అటుంచి ఉపాధిని సృష్టించే కార్యక్రమంగా కూడా దీని విస్తృతి కుచించుకు పోతున్నది. ఇంతకుముందే చెప్పినట్టు ఒకవేళ ఈ పథకానికి చేస్తున్న కేటాయింపులు నిలకడగా ఉన్నట్టయితే లేక ప్రతి సంవత్సరం కావలసిన దానికంటే కేటాయింపులు తక్కువగావుంటే కాలక్రమంలో వేతన బకాయిలు పెరుగుతాయి. అటువంటి పరిస్థితులలో నికర కేటాయింపులు, నికర వేతన బకాయిలు తగ్గుతాయి. అయితే వాస్తవంలో జరుగుతున్నదేమంటే చేస్తున్న కేటాయింపులలో నిలకడ ఉండటం లేదు. నికర కేటాయింపులు తగ్గటం వలన నికర వేతన బకాయిలు కూడా గణనీయంగా తగ్గాయి. ఉదాహరణకు 2017-18వ సంవత్సరంలో ద్రవ్యోల్బణం సర్దుబాటు చేసిన తరువాత జరిగిన కేటాయింపు 2010-11వ సంవత్సరంలో జరిగిన కేటాయింపుకంటే తక్కువగా ఉంది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2012-13లో కాలయాపనతో జరిగిన వేతన చెల్లింపులు 39శాతం ఉండగా 2016-17వలో కాలయాపనతో జరిగిన వేతన చెల్లింపులు 56శాతంగా ఉండటంలో ఆశ్చర్యం ఏమీలేదు.

వేతన బకాయిలను కూడా లెక్కలోకి తీసుకోకుండా చేసే స్థూల కేటాయింపులో తగ్గుదల స్థూల జాతీయోత్పత్తితో పోల్చి చూసినప్పుడు చాలా తీవ్రంగా ఉంది. ఈ కార్యక్రమం సరియైన రీతిలో నడవాలంటే స్థూల జాతీయోత్పత్తిలో 1.7శాతం కేటాయించాలని ప్రపంచబ్యాంకు కూడా అంచనా వేసింది. అందుకు భిన్నంగా 2017-18వ సంవత్సరంలో జరిగిన కేటాయింపు(వాస్తవంలో చేసిన వ్యయం కాదు) కేవలం 0.28శాతం మాత్రమే. 2010-11వ సంవత్సరంలో 0.58శాతంగాను, 2011-12వ సంవత్సరంలో 0.34శాతంగాను ఉన్న కేటాయింపులకంటే 2017-18వ సంవత్సరంలో చేసిన కేటాయింపు తక్కువగా ఉంది. వాస్తవ వ్యయాలను, అంతకు



ముందటి సంవత్సరాల నికర రుణాలను చూసినప్పుడు స్థూల జాతీయోత్పత్తిలో అటువంటి నికర వ్యయం వాటా 2012-13వ సంవత్సరంలో 0.36శాతం ఉంటే 2016-17వ సంవత్సరంకల్లా అది 0.30శాతంకంటే కిందకు దిగజారింది. కాబట్టి మనం ఏవిధంగా చూసినప్పటికీ స్థూల జాతీయోత్పత్తిలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కోసం కేటాయిస్తున్న నిధుల శాతం సాపేక్షంగా చూసినప్పుడు కాలక్రమంలో తగ్గిపోతున్నది. అయితే వేతనాల చెల్లింపులు సకాలంలో జరగటం లేదనే వాస్తవాన్ని ప్రభుత్వం అంగీకరించటం లేదు. నిజానికి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేసే వేతనాల చెల్లింపులలో 90శాతం 15రోజులలోపు జరుగుతు న్నాయని ప్రభుత్వం అంటోంది. అయితే ఇది పూర్తిగా అబద్ధం. 3500 గ్రామ పంచాయతీలను ఒక శాంపిల్‌గా తీసుకుని ఒక పరిశోధకుల బృందం సవివరంగా చేసిన అధ్యయనాన్ని జనవరి4వ తేదీనాడు కొత్త ఢిల్లీలో ఏర్పాటు చేసిన ఒక పత్రికా సమావేశంలో విడుదల చేశారు. ఈ అధ్యయనం ప్రకారం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జరిగిన పనికి చేయవలసిన వేతన చెల్లింపులు సగటున 50రోజులు ఆలస్యంగా జరుగుతున్నాయి. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనిచేసే కార్మికులకు ఎదురవుతున్న ఇతర ప్రతిబంధకాలకు అదనంగా సకాలంలో అందవలసిన వేతనాలను ఆధార్‌తో లింకు చేయాలని అంటున్నారు. తత్ఫలితంగా ఈ కార్యక్రమం కింద లభిస్తున్న పనికిగల డిమాండ్ మందగిస్తుంది.

వాస్తవంలో డిమాండ్ చేసిన పనిని కూడా ఇవ్వటంలేదు. అటువంటి పరిస్థితిలో చట్ట ప్రకారం చెల్లించవలసిన నిరుద్యోగ భృతి కూడా చెల్లించటం లేదు. నిజానికి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఒక డిమాండ్ ఆధారిత కార్యక్రమంగా పనిచేయటం లేదనేది సుస్పష్టం. అందు కోసం అందుబాటులో ఉంచే వనరులపై దాని విస్తృతి ఆధారపడి ఉంటుంది. ఒక డిమాండ్ ఆధారిత కార్యక్రమానికి వనరులు అందుబాటులో లేకపోవటమనే పరిస్థితిలో వైరుధ్యం ఉంది. అటువంటి కార్యక్రమానికి ముందుగా బడ్జెట్‌లో కేటాయింపులు ఉండాలి. నిధులు అందుబాటులో ఉండటాన్నిబట్టి ప్రజల ఆర్థిక హక్కును ప్రతిబింబించే అటువంటి కార్యక్రమాన్ని నిర్వహించటం జరగకూడదు. ఇటువంటి పథకానికి నిధులను కేటాయించటం కోసం ప్రజల హక్కును ప్రతిబింబించని కార్యక్రమాలపై ప్రభుత్వం చేసే వ్యయాన్ని తగ్గించుకోవాలి. అయితే ఆచరణలో పరిస్థితి ఇందుకు పూర్తి భిన్నంగా ఉందని మనం గమనిస్తాం. అంటే ఇతర వ్యయాలకు ప్రాధాన్యతను ఇచ్చిన తరువాత మిగిలిందే ఈ పథకానికి కేటాయింపులు జరుగుతున్నాయి. పర్యవసానంగా పనికిగల డిమాండ్‌ను అనుసరించి చేయవలసిన వ్యయానికి సరిపడా నిధులు అందుబాటులో ఉండటం లేదు.

పైన పేర్కొన్న అధ్యయనం ప్రకారం పని కోసం వస్తున్న డిమాండ్‌లో భాగంగా(దీనిలో కొంత భాగాన్ని ఏదో ఒక మిషతో రిజిష్టర్ కూడా చేసుకోవటం లేదు) అధికారికంగా రిజిష్టర్ చేసుకున్న వారిలో కూడా 68శాతంకంటే ఎక్కువమందికి వాస్తవంలో పని కల్పించటం లేదు. వేరేమాటల్లో చెప్పాలంటే అధికారికంగా రిజిష్టర్ చేసుకున్న పని డిమాండ్‌లో వాస్తవంలో సగం మంది ప్రజలకు కూడా అందుబాటులోకి రావటం లేదు.

ఈ నిష్పత్తి పెరుగుతూ ఉంది. ఆ విధంగా ప్రజల ఆర్థిక హక్కు రద్దవుతోంది. ఇది ఈ చట్టాన్ని చేసిన పార్లమెంటుపై దాడితో సమానం అవుతుంది. ఈ పథకాన్ని ఉద్యోగితను సృష్టించే సామాన్యమైన కార్యక్రమంగా తీసుకున్నా దీని విస్తృతి కాలక్రమంలో తగ్గిపోయింది. ఇదో విపరీత స్థితి. దేశంలో వేగంగా పెరుగుతున్న నిరుద్యోగితపై చాలా కాలం తరువాత దృష్టిని కేంద్రీకరించారు. అటువంటి నిరుద్యోగంపై అన్ని ప్రభుత్వ వ్యయాలకంటే గుణక ప్రభావంగల మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఒక బ్రహ్మాండమైన ఆయుధంగా పనిచేయగలదు. ఒకవేళ ప్రభుత్వం నిరుద్యోగ సమస్య పరిష్కరించాలని అనుకుంటే అది మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయటానికి బదులుగా దానిపై మరింతగా వ్యయం చేయాలి. అయితే ప్రస్తుత ధోరణి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేదిగానే ఉంది.

అనువాదం: నెల్లూరు నరసింహారావు,
సెల్: 8886396999

మెయిల్ @ నవతెలంగాణ

సైన్యం త్యాగం అజరామరం




కె. సతీష్ రెడ్డి

ఫీల్డు మార్షల్ కేఎం కరియప్ప 1899 జనవరి 28న జన్మిం చారు. భారతీయ సైనికులతో కూడి న మొదటి బ్యాచ్ సైన్యంలో చేరి 1942లో లెఫ్టినెంట్‌కల్నల్ అయినారు. 1949లో కమాండర్ ఇన్ చీఫ్‌గా ఉన్న బ్రిటిష్ దేశస్థుడు సర్. రాయ్ బూచర్ నుంచి కమాండర్ ఇన్ చీఫ్‌గా కరియప్ప బాధ్యతలు స్వీకరించారు. అందుకు గుర్తుగా జనవరి 15న భారతీయ సైనిక దినోత్సవంగా నిర్వహిస్తారు. ఆ రోజున దేశ రాజధానిలో ఆరు ఆర్మీ కమాండ్ ప్రధాన కార్యాలయాలలో పరేడ్లు ఇతర మిలటరీ షోలు నిర్వహిస్తారు. 2010 జనవరి 15న ఢిల్లీలో 62వ ఇండియన్ ఆర్మీ డే నిర్వహించారు. మన దేశ ప్రజల పరిరక్షణ కోసం తమ జీవితాలు త్యాగం చేసిన అమర సైనికులకు ఈ సందర్భంగా నివాళి అర్పిస్తారు. భారతదేశ ప్రజాస్వామ్యం కోసం స్వాతంత్ర్య సమర యోధులు ఎలాంటి పాత్రను పోషించారో సైన్యం కూడా అంతే పాత్ర పోషించింది.

జనరల్ మాదప్ప కరియప్ప స్వదేశీ యులతోనూ బ్రిటిషర్లతోనూ సత్సం బంధాలు కలిగి ఉండి జనరల్ రాయ్ బచ్చర్ నుంచి తొలి కమాండర్ ఇన్ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించిన తరువాత సైన్యం సరిహద్దులలోనూ ప్రకృతి వైపరీ త్యంలోనూ అనేక విధాల పోరాడుతూనే ఉంది.శత్రుదేశాలతో పోరాడడంలో మన భారతీయ సైన్యం అసమాన ధైర్య సహసాలను ప్రదర్శిస్తోంది. నిత్యం అప్రమత్తంగా దేశాన్ని కంటికి రెప్పలాగా కాపాడుతున్న భారతీయ సైనికుల శక్తి ఎనలేనిది. వారిని గౌరవిద్దాం.

జయశంకర్ భూపాలపల్లి జిల్లా.
సెల్ : 9848445134

ఫెయిలయ్యేదెవరు?



నాగటి నారాయణ

విద్యాహక్కు చట్టంలోని ఆయువుపట్టు లాంటి విద్యార్థుల "నో డిటెన్షన్" విధానానికి కేంద్ర ప్రభుత్వం తిలోదకాలిస్తోంది. "బడిలో ప్రవేశం పొందిన బాలలను ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ పూర్తయ్యే వరకు ఏ తరగతిలోనైనా మళ్లీ కొనసాగించకూడదు, బడి నుండి తొలగించ కూడదు"


అనే సెక్షన్ 16 ను క్రింది విధంగా మార్చేసింది.

16. (1) విద్యా సంవత్సరం చివరలో ఐదో తరగతికి, ఎనిమిదో తరగతికి రెగ్యులర్ ఎగ్జామినేషన్ ఉంటుంది. (2) సబ్ సెక్షన్ (1) లోని పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు అదనపు బోధ చేసి రెండు నెలల్లోగా మళ్లీ పరీక్ష రాసే అవకాశం కల్పించాలి. (3) సబ్ సెక్షన్ (2) లోని రీ-ఎగ్జామినేషన్ లో ఫెయిలైన విద్యార్థులను సదరు ఐదో, ఎనిమిదో తరగతిలో లేదా రెండు తరగతుల్లో నిలిపివేయటానికి ఆయా పాఠశాలలను రాష్ట్ర ప్రభుత్వాలు అనుమతించవచ్చు లేదా అనుమతించకపోనూ వచ్చు. (4) ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (8వ తరగతి వరకు) పూర్తయ్యే దాకా విద్యార్థిని పాఠశాల నుండి తొలగించకూడదు. గతేడాది జూలైలో లోక్ సభ ఆమోదించిన ఈ బిల్లును ఈ నెల మూడో తేదీన రాజ్యసభ ఆమోదించింది. ఈ సవరణతో విద్యాహక్కు చట్టానికి విఘాతం కల్గుతుందని రెండు సభల్లోనూ వామపక్షాల సభ్యులు వ్యతిరేకించారు.

ఎందుకీ సవరణ?

నో డిటెన్షన్ పేరుతో పాస్ ఫెయిల్ తో నిమిత్తం లేకుండా పై తరగతులకు ప్రమోట్ చేస్తుం డటం వలన విద్యార్థుల్లో అలసత్వం పెరిగిపోయిందని, అభ్యసన సామర్థ్యాలు పడిపోతు న్నాయని కొంతమంది మంత్రులు, అధికారులు, ఉపాధ్యాయులు అసహనంతో ఉన్నారు. విద్యా ప్రమాణాల కోసం సెక్షన్ 16ను తొలగించాలని 25 రాష్ట్రాలు కోరినట్టు కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి ప్రకాష్ జవదేకర్ చెప్పారు. అభ్యసన సామర్థ్యాలు అసంతృప్తిగా వున్నాయనటానికి యాన్వల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిపోర్ట్స్, నేషనల్ ఎడ్యుకేషన్ సర్వేలను ఉటంకించారు. నిర్దేశిత అభ్యసన సామర్థ్యాలు అనేవి విద్యాహక్కు చట్టంకంటే ముందు కూడా లేవనే విషయాన్ని మాత్రం చెప్పలేదు. కేంద్ర ప్రభుత్వం కోరిక మేరకు ప్రథమ్ అనే సంస్థ 2006 నుండి 2016వరకు ఏటా వార్షిక విద్యా స్థాయి నివేదికలు ప్రకటించింది. విద్యాహక్కు చట్టం అమల్లోకి రావడానికి ముందు ఐదేండ్ల నివేది కల్లో కూడా అభ్యసన సామర్థ్యాలు అరకొరగానే ఉన్నట్టు అహ్మదాబాద్ లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజిమెంట్ లోని రిసర్చ్ స్కాలర్స్ అధ్యయనం తెలిపింది. ఎలిమెంటరీ (8 వ తరగతి) నుండి సెకండరీ (పదోతరగతి) కి ఎంత రిటెన్షన్ ఉందో, సెకండరీ నుండి సీనియర్ సెకండరీ (12 వ తరగతి) కి కూడా దాదాపు అంతే రిటెన్షన్ ఉన్నట్టు 'ది బెటరిండియా.కామ్' సంస్థ పేర్కొంది. నో డిటెన్షన్ పోలసీ అనేది విద్యాహక్కు చట్టంతోనే వచ్చిందని చెప్పటం మరీ అన్యాయం. దాదాపు ఇరవై రాష్ట్రాల్లో 2010 కంటే ముందు నుంచే నో డిటెన్షన్ ఏదో ఒక స్థాయి వరకు అమల్లో ఉన్నట్టు 2015 లో కేంద్ర విద్యా సలహా సంస్థ (కేబ్) సబ్ కమిటీ చెప్పింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1968 (కొఠారి కమిషన్ నేపథ్యం) నుండే 7వతరగతి వరకు నో డిటెన్షన్ అమలవుతున్న విషయం తెలిసిందే. ఇంతకాలం లేని వ్యతిరేకత ఇప్పుడు ఎందుకు వచ్చిందంటే కేంద్రంలో మెజారిటీ రాష్ట్రాల్లోని నేటి పాలకుల సైద్ధాంతిక నేపథ్యమే.

ఇప్పటిదాకా దేశమంతటా పాఠశాలల్లో చేరిన విద్యార్థులు అందరూ ఏడాదికో క్లాస్ చొప్పున ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ వరకు నిరాఘాటంగా చదువుకుంటున్నారు. ఆ తర్వాత 9 వ తరగతిలో 20శాతం మంది, 10 వ తరగతిలో మరో 20శాతం మంది ఫెయిల్ అవుతున్నట్టు ప్రకాష్ జవదేకర్ చెప్పారు. ఈ సవరణ చట్టం అమల్లోకి వస్తే ఐదో తరగతిలో కొంతమంది, మరి కొంతమంది ఎనిమిదో డిటెయిన్ (ఫెయిల్) కావాల్సి వస్తుంది. పరీక్షలు పెడితే కొంతమంది పాస్ అవుతారు



కొంతమంది ఫెయిల్ అవుతారని, ఫెయిల్ అయిన వారిని డిటెయిన్ చేయాలనేది లక్ష్యం. అలా ఫెయిలయ్యేదెవరు అనేదే పరిశీలిం చాల్సిన అసలు విషయం. యు-డైస్ నివేదికల ప్రకారం దేశవ్యాప్తంగా 5 వ తరగతిలో 2.50 కోట్ల మంది 8 వ తరగతిలో 2.30 కోట్ల మంది విద్యార్థులు ఉంటారు. లెర్నింగ్ ఔట్కమ్స్ గురించి ఏఎస్ఈఆర్, ఎన్ఏఎస్ నివేదికల ప్రకారం వారిలో సగంమంది ఫెయిల్ అవుతారు. పాఠశాలలు పలు రకాలుగా ఉన్నందున విద్యార్థులకు అందే చదువులో అనేక అసమానతలున్నాయి. నాణ్యమైన విద్య కొందరికే పరిమితం. అత్యధిక బాలబాలికలు నాసిరకమైన చదువుతో నలిగి పోతున్నారు. ప్రైయివేటు స్కూళ్లలో చదివే విద్యార్థులు ఫెయిలైతే యాజమాన్యాలకు నష్టం గనక అందరినీ పాస్ చేస్తారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న నవోదయ, కేంద్రీయ తదితర విద్యాలయాల్లో ఎవరూ డిటెయిన్ కారు. రాష్ట్ర ప్రభుత్వాల నిర్వహణలోని రెసిడెన్షియల్, మోడల్, కేజీబీవీ పాఠశాలల్లోని విద్యార్థులు కూడా అందరూ పాస్ అవుతారు. కాగా ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లోని విద్యార్థుల్లోనే దాదాపు సగం మంది ఫెయిలయ్యే అవకాశం ఉంటుంది.

ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లోని విద్యార్థులకు సగం చదువే లభిస్తుంది. విద్యాసంవత్సరంలో సగటున 180 రోజుల వరకే ఉపాధ్యాయులు పాఠాలు చెప్పగలరు. ప్రాథమిక పాఠశాలల్లో సగటున ఇద్దరు లేక ముగ్గురు అంటే సగం మంది ఉపాధ్యాయులే పనిచేస్తున్నారు. లక్షా పది వేల పాఠశాలలు సింగిల్ టీచర్ తో నెట్టుకొస్తున్నాయి. రోజుకి ఏడు పీరియడ్స్ లో ఐదు క్లాసుల్లో 21 సబ్జెక్టులకు బోధనాభ్యసన ప్రక్రియ జరగాలి. కానీ సగమే జరుగుతోంది. ఒకరు లేక ఇద్దరు, ముగ్గురు టీచర్లు పనిచేసే పాఠశాలల్లోని విద్యార్థులకు చదువు వస్తుందా? అప్పర్ ప్రైమరీ, హైస్కూళ్లలో కూడా సబ్జెక్ట్ టీచర్ల కొరత తీవ్రంగానే వుంది. ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల లేమి, పుస్తకాల కొరత, పడకేసిన పర్యవేక్షణ మున్నగు సమస్యలు కూడా పిల్లల చదువును దెబ్బతీస్తాయి. చదువుకున్న పేరెంట్స్ అయితే వారే హోమ్ వర్క్ చేయించడం, చదివించడం చేస్తున్నారు. కానీ గ్రామాల్లోని రైతులు, వ్యవసాయ కూలీలు పట్నాల్లోని అసంఘటిత రంగం కార్మికులు, అడ్డా కూలీలు, ఆటో డ్రైవర్లు వంటి వారు తమ బిడ్డల చదువుకు తోడ్పడలేరు. కనుక ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేదల పిల్లలే ... సామాజికంగా చూస్తే దళితులు, గిరిజనులు, బలహీన వర్గాల విద్యార్థుల్లోనే ఎక్కువ మంది ఫెయిలవుతారు. కేంద్ర ప్రభుత్వం విద్యారంగంలో మనువాద సిద్ధాంతాన్ని ఎంత చాకచక్యంగా అమలు చేస్తుందో దీని ద్వారా అర్థం చేసుకోవచ్చు.

ప్రభుత్వాల తప్పుకు పిల్లలు బలి కావాలా?

6 - 14 ఏండ్లు వయస్సున్న బాలబాలికలకు 8వతరగతి వరకు ఉచితంగా నిర్బంధ చదువు చెప్పి పాస్ సర్టిఫికేట్ యివ్వాల్సిన బాధ్యత ప్రభుత్వాలది. రాజ్యాంగం అమల్లోకి వచ్చి 71 ఏండ్లు గడిచినా, విద్యాహక్కు చట్టం వచ్చి పదేళ్ల గడిచినా ఆ బాధ్యత నెరవేర్చలేదు. జీడీపీలో ఆరు శాతం నిధులను వెచ్చిస్తే అందరికీ నాణ్యమైన విద్యను అందించవచ్చనే కొఠారి కమిషన్ సిఫార్సు ఆచరణకు నోచుకోలేదు. ఏడాదికి రు. 43 వేల కోట్లు చొప్పున ఐదేళ్లు వెచ్చిస్తే విద్యాహక్కు చట్టాన్ని సంపూర్ణంగా అమలు చేయవచ్చు అని చెప్పిన మజుందార్ కమిటీ సూచననూ పాటించలేదు. పైగా గడిచిన నాలుగేండ్లలో కేంద్ర బడ్జెటులో విద్యారంగానికి కేటాయింపులు 15శాతం తగ్గిపోయాయి. మోడల్ స్కూల్స్, కంప్యూటర్ ఎడ్యుకేషన్ వంటి కేంద్ర ప్రాయోజిత పథకాలకు కేంద్ర ప్రభుత్వం నిధులు బంద్ చేసింది. దేశవ్యాప్తంగా పదకొండు లక్షల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వి. పాస్ ఫెయిల్ తో నిమిత్తం లేకుండా పాఠశాల విద్యలో నిర్దేశిత అభ్యసన సామర్థ్యాల సాధనకు తోడ్పడే 'నిరంతర సమగ్ర మూల్యాంకనం' విషయంలో చేతులెత్తేశారు. ఇన్ని లోపాలు, వైఫల్యాలను కప్పిపుచ్చుకుంటూ నిర్దోషులైన విద్యార్థులను శిక్షించటానికి డిటెన్షన్ విధానాన్ని తెచ్చిపెట్టింది. ప్రస్తుతం 5,8 తరగతులకే అని చెప్పినా భవిష్యత్తులో అన్ని తరగతులకూ విస్తరించే అవకాశం ఉంది.

తెలుగు రాష్ట్రాల నిబద్ధత కొనసాగాలి

5,8 తరగతుల్లో డిటెన్షన్ విధానాన్ని అమలు చేయాలా లేదా అనే విష యాన్ని రాష్ట్రాలే నిర్ణయించుకోవచ్చని సవరణ బిల్లులో వుంది. విద్య రాజ్యాంగ ఉమ్మడి జాబితాలో ఉన్నందున ఆపాటి వెసులుబాటు ఉంది. బీజేపీ పాలిత రాష్ట్రాలు ఈ పాటికే అమలు చేయడానికి సిద్ధమయ్యాయి. రాష్ట్రాల కోరిక మేరకే సవరణ బిల్లును ప్రతిపాదించినట్టు ప్రకాష్ జవదేకర్ చెప్పారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనను తెలుగు రాష్ట్రాలు వ్యతిరేకిస్తూ నో డిటెన్షన్ పాలసీకే కట్టుబడి వుంటామని ప్రకటించిన విషయం తెలిసిందే. ఉమ్మడి రాష్ట్రం నుంచే అమల్లో ఉండటం వలన, రాజకీయ పార్టీలు, ఉపాధ్యాయ విద్యార్థి సంఘాల సూచనల వలన ప్రభుత్వాల వైఖరి అలా వుంది. అదే నిబద్ధత కొనసాగాలి.

సెల్ : 9490300577

మానవి
నవతెలంగాణ
manavi@navatelangana.com
హైదరాబాద్
మంగళ వారం 15-1-2019

సంక్రాంతి కాంతులు



సంక్రాంతి పండుగ అంటేనే ముగ్గులు. ఆ ముగ్గులను వేస్తూ వాకిళ్లలో... రంగు రంగుల సీతాకోక చిలుకల్లా కళకళలాడే యువతులు. మామూలు రోజుల్లో ఎలా ఉన్నా... పండుగ సీజన్‌లో మాత్రం ఆశ్రయించేది లంగా ఓణీనే! సంప్రదాయ పట్టులో అయినా, స్టయిలిష్ డిజైనర్ అయినా లంగా ఓణీ తెచ్చే అందమే వేరు!

అందంగా తీసేద్దాం..!

అందాన్ని కాపాడుకోవడానికి అమ్మాయిలు చేయని ప్రయత్నమంటూ ఏదీ ఉండదు. పసుపు, చందనం అద్దినా పార్లర్లకి వెళ్లి ప్యాక్‌లమీద ప్యాక్‌లు వేయించుకున్నా అన్నీ అందాన్ని కాపాడుకోవడం కోసమే. కాకపోతే ఇప్పుడున్న ఈ బిజీలైఫ్‌లో గంటలు గంటలు పార్లర్లలో గడపాలంటే కుదరని పని. అలాగని అలసిపోయిన ముఖంతో పార్టీలకు వెళ్లాలంటే కాస్త ఆలోచించాల్సిన విషయమే. అలాంటి వారి కోసం మార్కెట్‌లోకి కొత్తగా వస్తున్నవే ఫేస్ షీట్ మాస్క్‌లు. వీటిని అతికించుకుని కొద్దిసేపు ఆగి తీసేస్తే చాలు, పార్లర్‌కి



వెళ్లాల్సిన పనిలేకుండా ఆ క్రీమూ ఈ క్రీమూ ముఖానికి పూయాల్సిన అవసరమే లేకుండా ఇంట్లోనే అందాన్ని సులువుగా రెట్టింపు చేసుకోవచ్చు. ఎలా వేసుకోవాలంటే.. పల్చటి ఫైబర్ షీట్‌ను ముఖం ఆకృతిలో కత్తిరించి దానికి సిరమ్, ఫ్లోరల్ సెంట్, విటమిన్లు, న్యూట్రియంట్లతో తయారైన జెల్‌ను జతచేస్తారు. పొడిబారిన చర్మం, జిడ్డు చర్మం, సాధారణ చర్మం... ఇలా ఒక్కో రకం చర్మతీరు ఉన్న వాళ్లకు ప్రత్యేకించి తయారు చేసిన షీట్ మాస్కులు కూడా అందుబాటులో ఉన్నాయి. ముఖాన్ని శుభ్రం చేసి దానిమీద ఈ షీట్ మాస్క్‌ని అతికించుకుని పది నుంచి ఇరవై నిమిషాల పాటు ఉంచితే సరిపోతుంది. షీట్‌ను తొలగించిన తర్వాత మళ్లీ తిరిగి ముఖం కడుక్కోవాల్సిన పని కూడా లేకుండా ఎంచక్కా మేకప్ వేసుకుని పార్టీకి రెడీ అయిపోవచ్చు. ఇందులో కీర, కలబంద, కివీ, గులాబీ, నిమ్మ, దానిమ్మ, ఆపిల్.. ఇలా సహజంగా దొరికే పూలూ, పండ్ల వెరైటీలు చాలానే అందుబాటులో ఉన్నాయి. అంతేకాదు ఫేషియళ్ల మాదిరిగానే షీట్ మాస్కుల్లో కూడా పెరల్, గోల్డ్, చార్‌కోల్ లాంటి రకాలూ దొరుకుతాయి. ఎంత ముఖానికి ఫేషియల్ చేసుకున్నా పార్టీలకు వెళ్లినప్పుడు కళ్లు అలసిపోయినట్టూ, పెదాలు పగిలిపోయినట్టూ ఉంటే ఏం బాగుంటుంది? అందుకే కళ్లకూ, పెదవులకూ ప్రత్యేకంగా అండర్ ఐ ప్యాడ్స్, లిప్ మాస్క్‌లు వస్తున్నాయి. ఫేస్ షీట్ మాస్క్‌ల మాదిరిగానే వీటినీ ఆయా ప్రాంతాల్లో స్టిక్కర్‌లా అతికించుకుని, ఆరిన తర్వాత తీసేస్తే సరిపోతుంది. ❄

చలికాలం వచ్చిందంటే అప్పటివరకూ నిశ్శబ్దంగా ఉండిపోయిన నొప్పులన్నీ నిద్ర లేస్తాయి. ఇలా ఎందుకంటే?.. ఈ కాలంలో చర్మం అడుగున రక్తనాళాలు కుంచించుకుపోతాయి. దాంతో కీళ్లకు రక్తప్రసరణ తగ్గుతుంది. ఫలితంగా రక్తం ద్వారా కీళ్లకు అవసరమైన పోషకాలు అందకపోవడం వల్ల, మృదులాస్థి కుంచించుకుపోయి కీళ్లు బిగుసుకుంటాయి. ఆ ప్రదేశంలో నొప్పి మొదలవుతుంది. అయితే సమస్య ఎముకలది కాకపోయినా, అప్పటికే ఉన్న కీళ్ల సమస్య పెరగకపోయినా, చలికాలం వల్ల ఎముకల్లో ఇబ్బందులు ఎక్కువవుతున్నట్టు అనిపిస్తుంది. ఇలాంటి ఇబ్బంది ఆస్టియో ఆర్థ్రయిటిస్, రుమటాయిడ్ ఆర్థ్రయిటిస్ ఉన్నవాళ్లకు మరింత ఎక్కువ. అంతకు ముందు ప్రమదాల్లో కీళ్లు, లిగమెంట్లకు తగిలిన దెబ్బల వల్ల కూడా చలికాలంలో నొప్పులు మొదలవుతాయి. ఈ సమస్యలన్నీ శీతకాలంలో చలి వల్ల ఎక్కువ అవుతాయి కాబట్టి ఈ సమస్యను వైద్య పరిభాషలో 'రేనాడ్స్ ఫినామినా' అని పిలుస్తారు. ఈ నొప్పుల బాధ నుంచి తప్పించుకోవాలంటే కొన్ని ఉపశమన పద్ధతులు పాటించడంతోపాటు, కొన్ని జాగ్రత్తలూ తీసుకోవాలి. అవేంటంటే...

బద్ధకం వదిలేద్దాం.. !



చలికాలం బద్ధకం పెరిగిపోతుంది. మిగతా రోజులతో పోలిస్తే చలి రోజుల్లో ఉదయాన్నే లేవలేం! ఎక్కువ సమయంపాటు వెచ్చగా, ముసుగు తన్ని పడుకోవాలనిపిస్తుంది. వ్యాయామం అలవాటు ఉన్నా ఈ రోజుల్లో కాస్త బద్ధకిస్తాం! ఇలా శరీర కదలికలు తగ్గడం వల్ల శరీరంలో రక్తప్రసరణ తగ్గుతుంది. చేతి వేళ్లు, మోకాళ్లు, మోచేతుల్లోని కీళ్ల దగ్గర తగ్గిన రక్తప్రసరణ ప్రభావం స్పష్టంగా తెలుస్తుంది. కీళ్లు పాక్షికంగా బిగుసుకుపోవడం, కదలికలు కొంత కష్టం కావడం లాంటి లక్షణాలు మొదలవుతాయి. అదే సమయంలో స్వల్పంగా నొప్పులూ పెరుగుతాయి.

ఇలా చేద్దాం...

- ముఖ్యంగా చలికాలంలో ఏసీకి దూరంగా ఉండాలి. ఆఫీసులు, సినిమా హాళ్లు... ఇలా ఎయిర్ కండిషనర్ల చల్లదనాన్ని చలికాలంలోనూ తప్పించుకోలేం! కానీ కీళ్ల నొప్పులు పెరగకుండా ఉండాలంటే ఏసీలకు దూరంగా ఉండాలి.
- పొద్దున్నే శరీరానికి ఎండ తాకాలి. ఆహారం ద్వారా అందే క్యాల్షియం శరీరం శోషించుకోవడానికి సరిపడా విటమిన్ డి అవసరం. ఇందుకోసం రోజు మొత్తంలో కొంతసేపైనా చర్మానికి ఎండ సోకాలి. కాబట్టి చలికాలం పొద్దెక్కేవరకూ నిద్రపోకుండా నడక అలవాటు ఉన్నవాళ్లు ఈ కాలంలోనూ కొనసాగించాలి. ❄

పిల్లల ముందు అలా..!

పిల్లల ముందు తల్లిదండ్రులు తరచూ కోట్లాడుకుంటే దాని ప్రభావం చిన్నారుల మీద అంతో ఇంతో తప్పక ఉంటుంది. ఆ గొడవలు వయసుతో సంబంధం లేకుండా పసిపిల్లల నుంచి టీనేజర్ల వరకూ మానసిక ఆరోగ్యం మీద ప్రభావం చూపిస్తాయి అంటున్నారు ససెక్స్ విశ్వవిద్యాలయ నిపుణులు. ముఖ్యంగా వాళ్లు తోటిపిల్లలతో కలవలేరు. ఆనందంగా ఉండరు. అదే ఆలోచిస్తూ చదువులోనూ వెనకబడతారు. కొన్నిసార్లు పిల్లలు నిద్రపోతున్నారులే అని పెద్దవాళ్లు గట్టిగా అరుచుకుంటుంటారు. కానీ నిద్రపోతున్న స్థితిలో కూడా ఆ అరుపుల్ని పిల్లలు వింటారనీ దానివల్ల వాళ్లలో ఒత్తిడి పెరుగుతుందనీ వివరిస్తున్నారు. నిజానికి విడాకులు తీసుకున్న కేసుల్లోకన్నా తరచూ పోట్లాడుకునే వాతావరణంలో పెరిగే పిల్లల్లోనే మానసిక ఆరోగ్యం ఎక్కువగా దెబ్బతింటుందని అనేక అధ్యయనాలు చెబుతున్నాయి. అంతేకాదు, అలాంటి వాతావరణంలో పెరిగిన పిల్లల్లో రోగనిరోధకశక్తి తగ్గి పెద్దయ్యాక మధుమేహం, గుండెపోటు, ఆస్తమా... వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందనీ చెబుతున్నారు. పైగా వాళ్లు ఎక్కువసమయం ఇంటిబయట గడిపేందుకే ఇష్టపడతారనీ, కఠినంగా వ్యవహరిస్తారనీ చెబుతున్నారు. కొందరు పిల్లల్లో అబద్ధాలు చెప్పడం, దొంగతనం చేయడం, చెడు అలవాట్లకి బానిస కావడం... వంటి నేరపూరిత లక్షణాలన్నీ చోటుచేసుకుంటాయనీ హెచ్చరిస్తున్నారు. ❄



రంగ వల్లులు



15 చుక్కలు
మధ్యచుక్క
8 వచ్చేవరకు

రాధ, మరిపెడ,
మహబూబాబాద్



17 చుక్కలు
3 వరుసలు, చుక్క విడిచి చుక్క
3 వచ్చేవరకు

రమాదేవి,
ఆదిలాబాద్



20 చుక్కలు
4 వరుసలు, చుక్క విడిచి చుక్క
4 వచ్చేవరకు

ఎస్. సంధ్యారాణి,
వెల్లంకి,
యాదాద్రి భువనగిరి



కె. అంజలి,
తాళ్ల వెల్లంల,
నల్గొండ

తొలిరోజు రూ.100 కోట్లకు పైనే

ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరుల్లో కోడి పందేల జోరు

- డింకీ పందేలను ప్రారంభించిన ఎమ్మెల్యేలు
- బరుల వద్ద గుండాట, మూడు ముక్కలాట, మద్యం జోరు
- పత్తాలేని పోలీసులు


కోడి పందేల జోరు

అమరావతి: ఊహించినట్లుగానే కోడిపందేలు ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో యథేచ్ఛగా, మిగిలిన జిల్లాల్లో సోమవారం అక్కడక్కడా కొనసాగాయి. . బైండోవర్ కేసులు, బరుల ధ్వంసమంటూ హడావుడి చేసిన పోలీసులు సోమవారం పత్తా లేరు. మరికొన్ని చోట్ల ఉదయం కన్పించి తీరా పందేలు మొదలయ్యాక అక్కడ నుండి వెళ్లిపోయారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం ప్రాంతం చినగరువు, కాళ్ల మండలం సీసలి, జంగారెడ్డిగూడెం వంటి ప్రాంతాల్లో ఫ్లడ్ లైట్లు అమర్చి మరీ భారీ ఎత్తున కోడిపందేలకు ఏర్పాట్లు చేశారు. చినగరువు బరివద్ద బౌన్సర్లను సైతం ఏర్పాటు చేశారు. కాళ్ల మండలం సీసలిలో ఉండి ఎంఎల్ఏ వేటుకూరి శివరామరాజు రిబ్బన్ కట్ చేసి మరీ పందేల బరిని ప్రారంభించారు. కొద్దిసేపు కత్తులు కట్టకుండా పందేలను వేశారు. టీడీపీ నేత రఘురామకృష్ణంరాజు అదే గ్రామంలో డింకీ పందేల పేరిట కోళ్లను వదిలారు. పోలవరం ఎంఎల్ఏ మొడియం శ్రీనివాసరావు కొయ్యలగూడెం మండలం రామానుజపురంలో బరి వద్దకు వచ్చి కాసేపు పందేలను తిలకించి వెళ్లారు. పెదవేగి మండలం దుగ్గిరాలలో కోడిపందేల్లో దెందులూరు ఎంఎల్ఏ చింతమనేని ప్రభాకర్ పాల్గొన్నట్టు తెలిసింది. పాలకొల్లు మండలం పూలపల్లిలో వైసీపీకి చెందిన మాజీ ఎంఎల్‌సీ మేకా శేషుబాబు తన ఆధీనంలో ప్రత్యేక బరిని ఏర్పాటు చేసి పందేలను ప్రారంభించారు. జిల్లావ్యాప్తంగా 400కుపైగా బరుల్లో పందేలు ప్రారంభమయ్యాయి. ఈ ఒక్కరోజే రూ.30 కోట్లకుపైగా పందేలు సాగినట్టు అంచనా వేస్తున్నారు. పందేల వద్ద గుండాట, మూడుముక్కలాట, మద్యం అమ్మకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. జిల్లావ్యాప్తంగా పందెంరాయుళ్లు ఇచ్చిన మామూళ్లే రూ.కోటికిపైగా ఉన్నట్లు సమాచారం. తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా పోలీసులు సోమవారం ఉదయం బరుల వద్దకు వెళ్లి పందేలు ఆడితే అరెస్టు చేస్తామని హెచ్చరించారు. పోలీసులపై రాజకీయ ఒత్తిళ్లు పనిచేయడంతో కోనసీమ, మెట్ట, ఏజెన్సీ ప్రాంతాల్లో భోగి రోజు మధ్యాహ్నం నుంచి కోడిపందేలు, గుండాట, పేకాట, మద్యం అమ్మకాలు యథేచ్ఛగా సాగాయి. జిల్లాలో భోగి రోజు రూ.30 కోట్ల మేర పందేలు, జూదాలు జరిగాయని అంచనా.జిల్లాలో సుమారు 90కిపైగా బరుల్లో కోడి పందేలు సాగాయి. కోనసీమలోని ఐ.పోలవరం, ముమ్మిడివరం, కాట్రేనికోన, అల్లవరం, ఉప్పలగుప్తం మండలాల్లో పందేలు యథేచ్ఛగా జరిగాయి. కాట్రేనికోన మండలంలో ఉదయం నుంచీ పోలీసులు పికెటింగ్ నిర్వహించి 11.30 గంటల తరువాత వెళ్లిపోయారు. కాట్రేనికోన, ఐ పోలవరం, ఉప్పలగుప్తం, జగ్గపేట, ఆనపర్తి, ఆత్రేయపురం, పిఠాపురం, సామర్లకోట, రంపచోడవరం, రాజవొమ్మంగి, మారేడుమిల్లి, వై.రామవరం, దేవీపట్నం మండలాల్లోనూ, దివాన్‌చెరువు, రాజానగరం, నరేంద్రపురం, పుణ్యక్షేత్రం, కొత్తపేట, కిర్లంపూడి తదితర ప్రాంతాల్లోనూ పందేలు సాగాయి. కృష్ణాజిల్లాలో మొదటిరోజునే సుమారు రూ.10 కోట్లకు పైగానే చేతులు మారినట్లు చెప్పుకుంటున్నారు. జగ్గయ్యపేట మండలం చిల్లకల్లులో టీడీపీకి చెందిన రెండు గ్రూపుల వారు పందేల విషయంలో గొడవ పడి కొట్టుకోవడంతో స్వల్పగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వారిని చెదరగొట్టి బరిని తొలగించారు. నందిగామ, చందర్లపాడు మండలాల్లో టీడీపీ, వైసీపీ నాయకులు వేర్వేరుగా శిబిరాలు ఏర్పాటు చేసి కోడి పందేలు నిర్వహించారు. హనుమాన్‌జంక్షన్ మండలం అంపాపురంలో పెద్ద బరిని ఏర్పాటు చేసి ఫ్లడ్‌లైట్ల వెలుతురులో పందేలను ఏర్పాటు చేశారు. నూజివీడు, ఆగిరిపల్లి, మచిలీపట్నం,కైకలూరు ప్రాంతాల్లో పందేలు ఏర్పాట్లయ్యాయి. కంకిపాడు మండలం ఈడుపుగల్లు, గొడవర్రు, కందలంపాడు గ్రామాల్లో కోడిపందాలు జరిగాయి.

ఈడుపుగల్లులో జాతీయ రహదారి నుంచి బరులు ఉండే ప్రదేశానికి రెండు కిలోమీటర్ల దూరం ఉన్నప్పటికీ వెళ్లటానికి సుమారు గంట నుంచి గంటన్నర సమయం పడుతుంది. బరుల వద్ద ఏర్పాటు చేసుకున్న పలు దుకాణాలకు సైతం రోజుకు నాలుగు వేల నుంచి ఐదు వేల వరకు నిర్వాహకులు అద్దె చెల్లిస్తున్నారు. పది ఎకరాలకు పైగా విస్తీర్ణం ఉన్న పంట పొలాల్లో కోడి పందేలు, పేకాట, లోనా – బయటా, గుండాట, పెద్దబజారు చిన్నబజారు లాంటివి నిర్వహిస్తున్నారు.

గన్నవరం మండలం గోపవరపుగూడెం, తెంపల్లి, మర్లపాలెం, చిన ఆవుటపల్లి, కేసరపల్లి, అంపాపురం, తేలప్రోలు, ఇందుపల్లి, నున్న, రామచంద్రాపురం, అడవి నెక్కలం గ్రామాల్లో కోడి పందేల శిబిరాలు వెలిశాయి. రోజులో మొత్తం 30 కోడి పందేలు వేస్తే 15 వేలు, పేకాట నుండి రూ.10 వేలు, ఇతర జూదాల నుండి రూ.3 వేలు వెరసి నిర్వాహకులకు రోజు ఆదాయం రూ.28 వేలు వస్తుం దని చెబుతున్నారు. గోపవరపుగూడెంలో జరుగుతున్న జూదం నిర్వాహకులు రోజుకు రూ.40 వేలు దాకా వసూలు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఐదు వేల నుండి లక్ష రూపాయల వరకు పందెం కాస్తున్నారు. కోత ముక్కలో కొందరు చేతి వాటం ప్రదర్శిస్తున్నారనే వాదన వినిపిస్తోంది.

యథాతథంగా టోల్ వసూలు

- సాయంత్రానికి తగ్గిన రద్దీ

గుంటూరు: ఏపీలోని గుంటూరు జిల్లా కాజ టోల్ గేట్ వద్ద వాహనదారుల నుంచి సోమవారం కూడా టోల్‌ఫీజులను యథాతథంగా వసూలు చేశారు. పోలీసు అధికారుల హెచ్చరికలను రాష్ట్ర రవాణ శాఖ అధికారులు, డీజీపీ టోల్ ఫీజులను వసూలు చేయొద్దని ఆదేశాలిచ్చినా తమకు జాతీయ రహదారుల విభాగం నుంచి ఆదేశాలు ఏమీ రాలేదని చెబుతూ వారు మూడు రోజులుగా వసూలు కొనసాగిస్తున్నారు. వాహనాల రద్దీని నియంత్రించేందుకు జాతీయ రహదారిపై పోలీసులు పర్యవేక్షిస్తున్నారు. ఉదయం రద్దీ బాగా కన్పించగా సాయంత్రానికి రద్దీ సాధారణ స్థితికి చేరింది. తెలంగాణతో పాటు ఇతర ప్రాంతాల నుంచి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, రాయలసీమ .జిల్లాలకు వెళ్లే వాహనాల సంఖ్య గణనీయంగా తగ్గింది. వరుస సెలవులు కావడంతో లారీల రద్దీ స్వల్పంగా తగ్గింది. దీంతో కాజ టోల్ గేట్ వద్ద ట్రాఫిక్ జామ్ సమస్య ఇంత వరకూ తలెత్తలేదని అధికారులు తెలిపారు. వాహనాల రద్దీ భారీగా లేదని పోలీసులు వాహనాలు జామ్ కాకుండా ఎప్పటికప్పుడు క్లియర్ చేస్తున్నారు. దీని వల్ల గత మూడు రోజుల్లో రద్దీ ఉన్నా ఎక్కువ సేపు వాహనాలు నిలిచిపోలేదని అధికారులు తెలిపారు.

పుట్టగొడుగుల్లా మసాజ్, స్పా సెంటర్లు

- కోడ్ లాంగ్వేజ్‌తో సాగుతున్న అశ్లీలత
- కాలేజీ విద్యార్థులే టార్గెట్‌గా డ్రగ్స్ అమ్మకాలు

విజయవాడ: రాజధాని కేంద్రమైన విజయవాడలో పాశ్చత్య సంస్కృతి తాండవం చేస్తోంది. మసాజ్, స్పా సెంటర్ల చాటున వ్యభిచారం విసృంఖలంగా సాగుతోంది. ఆయా సెంటర్ల నిర్వాహకులు నిరుద్యోగ యువతకు ఉపాధి పేరుతో వల వేసి వారి ఆర్థిక అవసరాలను అడ్డంపెట్టుకుని అమాయక యువతులను వ్యభిచార కూపంలోకి లాగుతున్నారు. గతంలో బందరు రోడ్‌లోని పలు మసాజ్‌సెంటర్లలో ఈ తరహా విపరీత ధోరణులు పోలీసుల దాడుల్లో బయట పడగా సరైన రీతిలో నిర్వాహకులపైచర్యలు తీసుకున్న పరిస్థితి లేదు. తాజాగా బందరు రోడ్‌లోని ఓ మాల్‌లో మసాజ్, స్పా సెంటరులో టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడులలో విదేశీ యువతులు పట్టుబడటం వారంతా కనీసం వర్కింగ్ వీసా కూడా లేకుండా నగరంలో ఉండటంతో పోలీసు వర్గాల్లో అలజడి మొదలైంది. ముంబాయి, ఢిల్లీ వంటి నగరాల నుండే కాకుండా థాయ్‌లాండ్, బంగ్లాదేశ్ వంటి దేశాల నుండి అక్కడి పేద యువతులను తీసుకువచ్చి ఇక్కడ మసాజ్‌సెంటర్లను నడుపుతున్నారనే సమాచారం పోలీసుల వద్ద సైతం ఉంది.బందరు రోడ్, ఏలూరు రోడ్, పటమట, పెనమలూరు తదితర ఏరియాల్లో ఉన్న అనేక మసాజ్, స్పా సెంటర్లలో కోడ్ లాంగ్వేజ్‌లో ఇటువంటి అసాంఘీక కార్యకలాపాలు సాగుతున్నాయని తెలుస్తోంది. ప్రారంభ ధర రూ.2500 నుండి మొదలై రూ.20 వేల వరకు ఉంటుందని సమాచారం.మసాజ్ సెంటర్లపై పూర్తి వేటు వేయడానికి పోలీసులకు సైతం పూర్తి స్థాయి అధికారాలు లేవని సమాచారం. నిబంధనలు మీరినప్పుడే వాటి నిర్వాహకులపై పోలీసులు వేటు వేసే ఆస్కారం ఉంటుందని తెలుస్తోంది. ఆయా సెంటర్లలో బాడీ టూ బాడీ మసాజ్, ఆయిల్ మసాజ్‌లు, మగ వారికి మగ వారు, ఆడవారికి ఆడవారే మసాజ్ చేయాలని, గదిలో తలుపులు తీసే చేయాలన్న నిబంధనలు పాటించడం లేదు.కాలేజీ విద్యార్థులను టార్గెట్‌గా చేసుకుని డ్రగ్స్ అమ్మకాలు సాగిస్తున్నారని, ఇప్పటికైనా నగరపోలీసులు మసాజ్, స్పా సెంటరులపై పూర్తి స్థాయిలో దృష్టిసారించి ఇటువంటి అసాంఘీక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసామని పోలీసులు ప్రకటనలు గుప్పించడం కాదని పలువురు అంటున్నారు, ఆ రీతిలో కార్యాచరణకు దిగకపోతే రానున్న కాలంలో విజయవాడ నగరం మరో ముంబాయి అవుతుందంటున్నారు.

యువతి కిడ్నాప్‌నకు యత్నం

గుంటూరు: ఇంటి ముందు ముగ్గు వేస్తున్న యువతిని కిడ్నాప్ చేయబోయిన ఇద్దరు యువకులకు స్థానికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. సోమవారం గుంటూరు జిల్లా బాపట్లలో కలకలం సృష్టించిన ఘటనపై పోలీసుల వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన కాకుమాను గోపినాథ్, జిలకర కమలాకర్ స్థానిక ఇండియన్ గ్యాస్ ఎజెన్సీలో కంప్యూటర్ ఆపరేటర్లుగా పని చేస్తుంటారు. పట్టణంలోనే కోళ్ళపూడి వారివీధికి చెందిన యువతి ఎంబీఏ పూర్తి చేసి ఉద్యోగ ప్రయత్నాల్లో భాగంగా బెంగుళూరులోని తమ బంధు వుల ఇంట్లో ఉంటోంది. సోమవారం తెల్లవారుజామున ఇంటి ఎదుట ముగ్గు వేస్తుండగా గోపినాథ్, కమలాకర్ అటుగా ద్విచక్ర వాహనంపై వచ్చి యువతిని బలవంతంగా తీసుకెళ్లేందుకు యత్నించారు. గమనించిన స్థానికులు యువకులకు దేహశుద్ధి చేయడంతోపాటు పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

కన్నయ్యపై రాజకీయ కుట్రే!

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ



నవతెలంగాణ - న్యూఢిల్లీబ్యూరో

జేఎన్‌యూ విద్యార్థి సంఘం నాయకుడు కన్నయ్య కుమార్‌పై ఘటన జరిగిన మూడు సంవత్సరాల తర్వాత అభియోగ పత్రం నమోదు చేయడం మోడీ సర్కారు రాజకీయ కుట్రేనని సీపీఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ చెప్పారు. లోక్‌సభ ఎన్నికలు రానున్న తరుణంలో కన్నయ్యపై కావాలనే కేసు నమోదు చేశారని వెల్లడించారు. రాఫెల్ డీల్‌లో జరిగిన అవకతవకలకు భయపడిన కేంద్రం విషయాన్ని పక్కదారి పట్టించేందుకు ఈ చర్యకు పూనుకున్నదని అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ విద్యార్థిపై దేశద్రోహం కేసు పెట్టడం ఏంటని ప్రశ్నించారు. నిజనిర్ధారణ సరైన విధంగా చేయకుండా, విద్యార్థుల భవిష్యత్‌తో ప్రభుత్వం చెలగాటం ఆడుతుందని విమర్శించారు. కేంద్రం దర్యాప్తు సంస్థలను అడ్డంపెట్టుకొని విద్యార్థులు, ప్రత్యర్థులపై అన్యాయంగా కేసులు బనాయిస్తుందన్నారు. ఇది ప్రజాస్వామ్యానికి మంచిది కాదని, వ్యవస్థలపై నమ్మకం రోజురోజూకి సడలుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ చర్యలను తమ పార్టీ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలే ప్రభుత్వ తీరుకు తగిన విధంగా గుణపాఠం చెబుతారని అన్నారు.

నమ్మితే.. నరకమే

బంధుత్వం, స్నేహం అతీతమేమీ కాదు

- మహిళలపై పెరుగుతున్న అఘాయిత్యాలు, వేధింపులు
- షీటీంలకు పెరిగిన ఫిర్యాదుల సంఖ్య


ఫైల్

నవతెలంగాణ-సిటీబ్యూరో

మహిళలపై రోజు రోజుకూ అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయి. పరిచయాలు పెంచుకుంటూ నమ్మించి దారుణాలకు ఒడిగడుతున్నారు. ఇందులో బంధుత్వం, స్నేహం అతీతమేమీ కావడం లేదు. మన వారే కదా అని సన్నిహితంగా మెలిగితే వక్రబుద్ధి చూపిస్తున్నారు. స్నేహం పేరుతో కలిసి దిగిన ఫొటోలతో బ్లాక్‌మెయిలింగ్ చేస్తున్నారు. తల్లిదండ్రులకు చూపిస్తామనీ, సోషల్ మీడియాలో పెడతామంటూ బెదిరించి లొంగదీసుకుంటున్నారు. దుండగుల ఆగడాలను భరించలేక చివరకు బాధితులు ఇంట్లో చెప్పడంతో ఇలాంటి ఘటనలు వెలుగు చూస్తున్నాయి.

హైదరాబాద్ పాతబస్తీ కామాటిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో నివాసముంటున్న ఓ బాలికను సమీప బంధువే కూల్‌డ్రింగ్‌లో మత్తుమందు ఇచ్చి లొంగదీసుకున్నాడు. జరిగిన అఘాయిత్యాన్ని తన సెల్‌ఫోన్‌లో రికార్డు చేశాడు. అంతటితో ఆగకుండా స్నేహితులకూ షేర్ చేశాడు. వారూ బెదిరించి బాలికపై సామూహిక అత్యాచారాని ఒడిగట్టారు. వీడియోను అడ్డం పెట్టుకొని మొత్తం 11 మంది ఈ ఆఘాయిత్యానికి పాల్పడ్డారు.

నారాయణగూడలోని ఓ ప్రయివేటు కళాశాలలో చదుకుంటున్న ఉష, వెంకటేష్ స్నేహితులు. ఆ తర్వాత వెంకటేష్ ప్రేమిస్తున్నానని ఉషకు చెప్పాడు. ఆమె ఆ విషయాన్ని తేలిగ్గా తీసుకుని వెంకటేష్‌ను దూరంగా పెట్టింది. దీంతో కక్ష పెంచుకున్న వెంకటేష్ ఆమెను చంపాలనుకున్నాడు. 2017 ఆగస్టు 8న ఫోన్ చేసి చివరిసారిగా మాట్లాడతానని వేడుకున్నాడు. ఉష సరేననడంతో ఉస్మానియా విశ్వవిద్యాలయానికి రమ్మన్నాడు. దూరవిద్య భవనం వద్దకు రాగానే ఆమెతో వాగ్వాదానికి దిగి, మాట్లాడుతూనే బ్లేడ్‌తో గొంతు కోసి పారిపోయాడు. స్థానికులు ఉషను ఆస్పత్రికి తీసుకెళ్లేలోపు చనిపోయింది. నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు.

షీ టీమ్స్‌ను ఆశ్రయిస్తున్న బాధితులు

నగరంలో మహిళలకు భరోసాగా నిలుస్తున్న షీ బృందాలను బాధితులు ఆశ్రయిస్తున్నారు. హైదరాబాద్‌లో 2014లో షీ బృందాలను రంగంలోకి దించారు. అప్పటి నుంచి 2018 డిసెంబర్ వరకు 5,041 మంది ఫిర్యాదు చేశారు. అందులో నేరుగా వచ్చి ఫిర్యాదు చేసిన వారు 1465 మంది కాగా, ఈమెయిల్, ఫేస్‌బుక్, వాట్సప్ ద్వారా 2,585 మంది ఫిర్యాదు చేశారు. ఇక హాకా ఐ ద్వారా 122 మంది, డయల్ 100 ద్వారా 1537 మంది ఫిర్యాదులు చేశారు. 2018లో 926 ఫిర్యాదులు వచ్చాయి. అందులో 64 మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయగా, 37 నిర్భయ, నాలుగు పోస్కో, వివిధ సెక్షన్ల కింద 17 కేసులు నమోదు చేశారు. 102 పెట్టీ కేసులను నమోదు చేసిన పోలీసులు మిగిలిన వారికి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చారు.

ఫిర్యాదుల్లో ఎక్కువగా.. రోజూ వెంటబడి వేధిస్తున్నారని, కాలేజీకి, ఉద్యోగాని వెళ్లే దారిలో సతాయిస్తున్నారని సమాచారం ఇస్తున్నారు. ఇంకొందరు రోడ్లపై నడవలేక పోతున్నామనీ, కాలేజీ, పనిచేసే వద్ద వేధింపులు ఉంటున్నాయనీ ఫిర్యాదు చేస్తున్నారు. మరికొందరు వెకిలి చేష్టలు, అసభ్యకరంగా మెసేజ్‌లు పంపిస్తున్నారని వివరిస్తున్నారు.

మహాకూటమి ప్రభావం ఉన్నదా?

- నమో యాప్ ద్వారా ప్రధాని మోడీ సర్వే


ఫైల్


న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల భయం ప్రధాని మోడీని వెంటాడుతున్నది. ఇప్పటికే మన్‌కీ బాత్‌లో జనంతో మాట్లాడే మోడీ...ఇపుడు నమో యాప్ ద్వారా సర్వే షురూ చేశారు. ఇందులో ఎనిమిది అంశాలపై ప్రశ్నలు అడిగారు. 'నమో యాప్‌లో చేపట్టిన సర్వే ద్వారా మీ అభిప్రాయాలు నేరుగా నాతో పంచుకోవాలని కోరుకుంటున్నాను. వివిధ అంశాలపై మీరిచ్చే అభిప్రాయం మేం తీసుకోబోయే పలు ముఖ్యమైన నిర్ణయాలకు సహాయం చేసినట్లుగా అవుతోంది' అంటూ మోడీ సామాజిక మాధ్యమాల్లో వీడియో పోస్ట్ చేశారు. 'మీరు ఓటు వేసే ముందు ఏ అంశానికి ప్రాధాన్యతనిస్తారు. నిరుద్యోగం, స్వచ్ఛత, ధరలపెరుగుదుల, న్యాయ సంబంధమైన, అవినీతి, కిసాన్‌కల్యాణ్ ,విద్య అంశాలను ప్రస్తావించారు. లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ముగ్గురు అభిమానించే బీజేపీ లీడర్లు ఎవరని..వారి పేర్లు సూచించాలని కోరారు. దేశభవిష్యత్ గురించి ఏమనుకుంటున్నారు..బీజేపీకి విరాళాలు ఇచ్చారా..? మీకు నమో టీషర్టు,మగ్గులు అందాయా..లేదా వివరించాల'ని కోరారు. మహాకూటమిపై విరుచుకుపడుతున్న మోడీ...నమో యాప్‌లో దాని ప్రభావం గురించి ఓ ప్రశ్న అడగటం చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే గుగూల్ సెర్చ్‌లో మోడీ కన్నా రాహుల్‌కు ఎక్కువ ఆదరణ లభిస్తుండటం..విదేశాల్లోని భారతీయులు రాహుల్ వైపు ఆసక్తిగా చూడటం కూడా బీజేపీ వర్గాలకు మాత్రం మింగుడుపడటంలేదని రాజకీయపరిశీలకులు అంటున్నారు. పైకి మాత్రం దేశంలో ఎన్డీయే పాలన పట్ల ప్రజల అభిప్రాయాలను తెలుసుకునేందుకే ఈ నమో యాప్ అంటున్నా...వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మహాకూటమి ఎక్కడ కొంపముంచుతుందోనన్న టెన్షన్ హస్తినలోని కమలనాథులను నిద్రలేకుండా చేస్తున్నదని ఆ పార్టీ నేతలు చర్చించుకుంటున్నారు.

'మ్యాప్స్'లో పోటీ షురూ!

ఏదైనా రెస్టారెంట్, హాస్పిటల్ లేదా ఆఫీస్ చిరునామాలు తెలుసుకునేందుకు ఈ రోజుల్లో గూగుల్ మ్యాప్స్ ఎంతగా ఉపయోగపడుతున్నాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు సదరు దిగ్గజం కొత్త ఫీచర్‌లను ఎప్పటికప్పుడు జోడిస్తూనే ఉంది. కాగా, ఇప్పుడు, గూగుల్ కి పోటీగా యాపిల్ సంస్థ సరికొత్త నావిగేషన్ 'యాపిల్ మ్యాప్స్' పేరిట తీసుకురావడం విశేషం. ఐతే, 'యాపిల్ మ్యాప్స్' గూగుల్ మ్యాప్స్ ను ధీటుగా ఎదుర్కోగలుగుతుందా? ఇదే నేపథ్యంపై 'నవతెలంగాణ' ప్రత్యేక పరిశీలన చేపట్టింది.

గూగుల్ మ్యాప్స్‌కు పోటీగా 'యాపిల్ మ్యాప్స్'

- ప్రాథమికంగా ఐఫోన్ మొబైల్స్, మ్యాక్ డివైజ్‌లలో అందుబాటులోకి..
- ఎనభై శాతం మొబైల్స్ వాటాను ఇప్పటికే, ఆక్రమించిన గూగుల్ మ్యాప్స్
- 'యాపిల్ మ్యాప్స్'కు అవరోధంగా మారనున్న ఐఓఎస్ యూజర్ల పరిమితి, ఫీచర్లు
- అధునాతన ఫీచర్లు, ఆండ్రాయిడ్ విస్తరణ చేస్తే, గూగుల్ కి పోటీ ఇవ్వొచ్చు: నిపుణులు



కడవేర్గు

ఆండ్రాయిడ్ మొబైల్స్ తో పాటూ ఐవోఎస్ ఫోన్లలోనూ మ్యాప్స్ సొల్యూషన్స్ ఇస్తున్న గూగుల్ సంస్థకు ధీటుగా తమ ఐఫోన్, మ్యాక్ యూజర్లకు సొంత 'యాపిల్ మ్యాప్స్' సేవలను అందించే ఉద్దేశంతో యాపిల్ కొత్త మ్యాప్స్ ను సిద్ధం చేసింది. 'యాపిల్ మ్యాప్స్' పేరుతో ఉన్న ఈ సేవలు గూగుల్ మ్యాప్స్ అందించే ప్రాథమిక సేవల్నే అందిస్తున్నట్టు తెలుస్తోంది. తెలియని ప్రాంతాల రూట్ సమాచారం, క్యాబ్స్ బుకింగ్ వగైరాలు ఇందులో ఉన్నాయి. ఐఫోన్ ఎక్స్ఎస్ మ్యాక్స్, ఐఫోన్ ఎక్స్ఎస్, ఐఫోన్ ఎక్స్ఆర్, మ్యాక్ బుక్ ఎయిర్ (2018) డివైజ్ లలో ప్రస్తుతం యాపిల్ మ్యాప్స్ సేవలు లభ్యం అవుతున్నాయి.

అవరోధాలు లేకపోలేదు

మారుతున్న కాలానికి అనుగుణంగా.. వినియోగదారుల అవసరాన్ని గుర్తిస్తూ గూగుల్ మ్యాప్స్ ఎప్పటికప్పుడూ సేవల నాణ్యతను, కొత్త ఫీచర్ల జోడింపును పెంచుకుంటూ పోతుండటం తెలిసిందే. చిరునామాలను తెలుసుకోవడమే కాదు.. వివిధ రూట్లలో ట్రాఫిక్ లైవ్ అప్డేట్స్, ఆస్పత్రిలో అపాయింట్‌మెంట్ తీసుకోవడం, రెస్టారెంట్‌లో టేబుల్ బుక్ చేసుకోవడం వంటి అధునాతన ఫీచర్‌లను ఆండ్రాయిడ్ ఫోన్లతో పాటూ ఐవోఎస్ ఫోన్లలో కూడా గూగుల్ ఇప్పటికే అందుబాటులోకి తీసుకొచ్చిన సందర్భంలో.. ప్రస్తుతం యాపిల్ సంస్థ 'యాపిల్ మ్యాప్స్' పేరుతో దశాబ్దం క్రితమే గూగుల్ అందించిన సర్వీసులను ఇప్పుడు యాపిల్ అందిస్తే, యూజర్లు ఎలా రిసీవ్ చేసుకుంటారో చూడాలి. గ్లోబల్ మొబైల్ ట్రెండ్స్ 2017 రిపోర్ట్ ప్రకారం.. 2020నాటికి ప్రపంచ జనాభాలో 75శాతం మందికి మొబైల్ కనెక్షన్స్ ఉంటాయని అంచనా. ఇందులో ఎనభై శాతం మంది ఆండ్రాయిడ్ యూజర్లే. అంటే, ఆయా మొబైల్స్ లో గూగుల్ మ్యాప్స్ సేవలే ఉంటాయి. ఆండ్రాయిడ్ ఫోన్లకు మాత్రమే గాక, ఐఫోన్ లకు కూడా గూగుల్ తమ మ్యాప్ సేవలను అందిస్తోంది. అంటే, యాపిల్ యూజర్లు కూడా అధునాతన గూగుల్ మ్యాప్స్ వాడే సందర్భంలో.. ప్రాథమిక దశలో ఉన్న 'యాపిల్ మ్యాప్స్'ను ఎంతవరకు వాడుతారన్నది సందేహమే! ఇక, స్టాట్ కౌంటర్ 2018 రిపోర్ట్ ప్రకారం.. దేశంలో 69.69శాతం మంది ఆండ్రాయిడ్ ఫోన్లను వాడితే, ఐఓఎస్ యూజర్ల వాటా కేవలం 2.18శాతమే!! ఐతే, గూగుల్ మ్యాప్స్ లో లేని ఫీచర్లను పకడ్బందీగా యాపిల్ గనుక తీసుకువచ్చి.. ఆయా ఫీచర్లను ఆండ్రాయిడ్ మొబైల్స్ లో కూడా పనిచేసే విధంగా విస్తరిస్తే, గూగుల్ మ్యాప్స్ కు 'యాపిల్ మ్యాప్స్' గట్టి పోటీ ఇచ్చే అవకాశం లేకపోలేదు అంటున్నారు సదరు రంగ నిపుణులు.

సస్పెన్స్.. సస్పెన్స్...

మంత్రివర్గ విస్తరణపై గోప్యత

- సీనియర్లకు సైతం అంతుచిక్కని వైనం
- సీఎం నిర్ణయం కోసం అధికార పార్టీ నేతల ఎదురు చూపులు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మంత్రివర్గంపై గులాబీ పార్టీలో ఇంకా సస్పెన్స్ కొనసాగుతున్నది. ఈనెల 18న క్యాబినెట్ ఏర్పాటు ఉంటుందనే వార్తలు వెలువడ్డప్పటికీ ఇప్పటి వరకూ ఆ అంశంపై క్లారిటీ రాలేదు. ఒకవేళ ఉంటే ఎవరెవరికి అవకాశం కల్పిస్తారన్న దానిపై కూడా అధికార పార్టీలోని సీనియర్లకు సైతం ఏలాంటి సమాచారం లేదు. దీంతో సామాన్య ప్రజానీకం మాదిరిగానే మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా సీఎం నిర్ణయం కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొన్నది. శాసనసభ సమావేశాల సందర్భంలోనే మంత్రివర్గ ఏర్పాటు కూడా ఉంటుందనే ప్రచారం టీఆర్ఎస్‌లో జోరుగా కొనసాగుతున్నది. సీఎంగా రెండోసారి కేసీఆర్ ప్రమాణ స్వీకారం చేసిన రోజున్నే తనతోపాటు మహమూద్ అలీ కూడా మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనకు హోంశాఖను కేటాయించిన సంగతి విదితమే. ఇది జరిగి నెల దాటినా మంత్రి వర్గాన్ని విస్తరించలేదు. పూర్తి స్థాయి క్యాబినెట్ లేకుండానే ఒకసారి మంత్రివర్గ సమావేశాన్ని కూడా నిర్వహించటం గమనార్హం. ఇదే సమయంలో లోక్‌సభ ఎన్నికల తర్వాతే పూర్తి స్థాయి క్యాబినెట్ ఉంటుందంటూ కేసీఆర్ గతంలో ప్రకటించారు. మొదటి దఫాలో మాత్రం పది మందికి చోటు దక్కుతుందని టీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో మంత్రివర్గ ఏర్పాటుకు ముహూర్తం (ఈనెల 18) దగ్గర పడుతున్నకొద్దీ మాజీ మంత్రులు, సీనియర్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల్లో ఉత్కంఠ పెరుగుతోంది. ఈ దఫా తమకు మంత్రి పదవి దక్కుతుందా..? లేదా..? అని వారు ఆందోళన చెందుతున్నారు. వారి అంచనాలకు అందకుండా కేసీఆర్.. క్యాబినెట్ కూర్పుపై అత్యంత గోప్యతను పాటిస్తున్నారు. మాజీ మంత్రులు, పార్టీ సెక్రటరి జనరల్ కేకేలాంటి సీనియర్లతో సైతం ఆయన ఎలాంటి సంప్రదింపులు జరపక పోవడంతో మూడో కంటికి సైతం విషయాలు తెలియడం లేదు. అత్యంత రహస్యంగా సీఎం కసరత్తులు చేయడమే దీనికి కారణం. జిల్లాలు, సామాజిక వర్గాలను పరిగణనలోకి తీసుకోవటంతోపాటు ఆశావహుల ఉద్యమ చరిత్ర ప్రాతిపదికన మంత్రి పదవులివ్వాలని ముఖ్యమంత్రి భావిస్తున్నారు., అందుకే ముందస్తు సమాచారమేదీ బయటకి పొక్కకుండా జాగ్రత్త పడుతున్నారు. దీంతో పార్టీలో మొదటి నుంచి కేసీఆర్‌తో సాన్నిహిత్యంగా ఉన్న సీనియర్లకు సైతం క్యాబినెట్ కూర్పుపై క్లారిటీ లేకుండా పోయిందని సమాచారం. తమకు పదవి దక్కుతుందో..? లేదో..? చెప్పడం కష్టమంటూ వారు తమ సన్నిహితుల వద్ద వాపోతున్నారని తెలిసింది. మంత్రివర్గ వివరాల గురించి ప్రస్తావిస్తే... 'మాదేముంది...అంతా సార్ దయ...' అంటు వారు నిట్టూర్పులు విడుస్తుండటం గమనార్హం.

కేటీఆర్, హరీశ్ పరిస్థితేమిటి...?

మరోవైపు మంత్రివర్గాన్ని ఏర్పాటు చేస్తే కేటీఆర్, హరీశ్ పరిస్థితి ఎలా ఉంటుందన్న దానిపై ఇంకా స్పష్టత రాలేదని టీఆర్ఎస్ వర్గాల చెబుతున్నాయి. కేటీఆర్‌ను ముఖ్యమంత్రిగా ప్రమోట్ చేసేందుకు కేసీఆర్ యోచిస్తున్న తరుణంలో ఆయనకు తొలి దఫాలో చోటు దక్కకపోవచ్చు. ఇక హరీశ్‌కు కూడా ఇంచుమించుగా అదే పరిస్థితి ఎదురయ్యే అవకాశముందని సమాచారం. ఆయన్ను ఎంపీగా పోటీ చేయించేందుకు వీలుగా మంత్రివర్గంలోకి తీసుకోకుండా పక్కకు పెడతారనే చర్చ జరుగుతున్నది.

ఎన్‌కౌంటర్లు తీవ్రమైన అంశం: సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ : ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ హయాంలో జరిగిన 1,100 పోలీస్ ఎన్‌కౌంటర్‌లపై సిబిఐ దర్యాప్తు కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం పరిశీలించింది. దీనిని తీవ్రమైన అంశంగా సుప్రీం పరిగణించింది. ఈ ఎన్‌కౌంటర్లలో 49 మంది అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోగా, 370 మంది గాయపడ్డారని పిటిషన్ పేర్కొంది. పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్(పీయూసీఎల్) అనే స్వచ్ఛంద సంస్థ ఈ పిటిషన్‌ను దాఖలు చేసింది. దీనిపై విచారణ చేపట్టిన చీఫ్ జస్టిస్ రంజన్‌గొగోయ్‌లతో కూడిన ధర్మాసనం పోలీసుల ఎన్‌కౌంటర్లను 'తీవ్ర అధికార దుర్వినియోగం'గా అభివర్ణించింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 12కు వాయిదా వేసింది. గతేడాది జులైలో దాఖలైన పిటిషన్‌పై తన స్పందనను తెలపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ధర్మాసనం ఆదేశించింది. మానవ హక్కులు, పౌర స్వేచ్ఛను బహిరంగంగా కాలరాసిన ప్రభుత్వం పోలీసు ఎన్‌కౌంటర్లకు ఆమోద ముద్ర వేసిందని పిటిషన్‌లో పేర్కొంది.

అఫ్ఘాన్‌లో కారుబాంబు పేలుడు

- నలుగురు మృతి, 90మంది క్షతగాత్రులు

కాబూల్: అఫ్ఘనిస్థాన్ రాజధాని కాబూల్‌లో భీకర కారుబాంబు పేలుడు సంభవించింది. ఒక్కసారిగా కాబూల్ దద్దరిల్లింది. అఫ్ఘాన్ రాజధాని కాబూల్‌లో సోమవారం చోటుచేసుకున్న ఈ ఘటనలో నలుగురు మృతి చెందగా, సుమారు 90మందికి పైగా గాయాలపాలయ్యారు. క్షతగాత్రుల్లో 23 మంది చిన్నారులున్నట్టు అఫ్ఘనిస్థాన్ ప్రజా ఆరోగ్య శాఖ ప్రతినిధి వాహిదుల్లా మయర్ ట్విట్టర్‌లో వెల్లడించారు. అంతర్జాతీయ కంపెనీలు, చారిటీలుండే హై సెక్యూరిటీ కాంప్లెక్స్ సమీపంలో ఈ పేలుడు సంభవించినట్టు అధికారులు తెలిపారు. కాగా, ఈ భీకర పేలుడుకు బాధ్యతను వహిస్తూ ఎలాంటి ప్రకటనలు రాలేవని పోలీసు అధికారులు వివరించారు. ఒక వాహనం నిండా పేలుడు పదార్థాలతో వచ్చి పేలిపోయిందని తెలిపారు. నిందితులు, దుండగుల కోసం ఆ ప్రాంతంలో కార్డన్ సెర్చ్ ఆపరేషన్ చేపడుతున్నారని చెప్పారు.



కుర్దులపై దాడులకు పాల్పడితే
తీవ్ర పరిణామాలు

టర్కీకి ట్రంప్ హెచ్చరిక

వాషింగ్టన్: అమెరికా-టర్కీ మధ్య ఉన్న విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ టర్కీకి తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. సిరియాలో అమెరికా మద్దతు ఉన్న కుర్దు తిరుగుబాటుదారులపై టర్కీ దాడులకు పాల్పడినట్టయితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఘాటుగా హెచ్చరించారు. తమ ఆదేశాలను బేఖాతర్ చేసినట్టయితే టర్కీపై ఆర్థిక ఆంక్షలు మోపాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇటీవల సిరియా నుంచి అమెరికా బలగాలను ఉపసంహరించుకున్నట్టు ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. సిరియాలోని ఉగ్రసంస్థలపై విజయం సాధించడంతోనే తామీ నిర్ణయం తీసుకున్నామని అన్నారు. అయితే, సిరియా నుంచి యూఎస్ బలగాలు వైదొలగడంతో అక్కడి కుర్దు తిరుగుబాటుదారులపై టర్కీ దాడులకు పాల్పడే అవకాశముందని ట్రంప్ భావిస్తున్నారు. అదే జరిగినట్టయితే తమకు మద్దతుగా నిలిచిన కుర్దు తిరుగుబాటుదారులను రక్షించుకోవాల్సిన బాధ్యత కూడా అమెరికాపైనే ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో కుర్దులను ఉద్దేశించి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఒక ట్వీట్ చేశారు. టర్కీని రెచ్చగొట్టే చర్యలు చేపట్టవద్దని కుర్దులకు హితవు పలికారు. 'ఎప్పటి నుంచో అనుకుంటున్న బలగాల ఉపసంహరణ సిరియాలో మొదలైంది. ఐఎస్ అక్కడ నామమాత్రంగానే మిగిలింది. ఒక వేళ అది మళ్లీ పడగవిప్పితే సమీప స్థావరాల నుంచి ఐఎస్‌పై దాడులకు పాల్పడతాం. కుర్దు తిరుగుబాటుదారులపై టర్కీ దాడులకు తెగబడితే ఆ దేశాన్ని ఆర్థికంగా దెబ్బతీస్తాం. 30 కిలోమీటర్ల మేరకు సురక్షిత జోన్‌ను ఏర్పాటు చేయాలి. అంతేగాకుండా, కుర్దు తిరుగుబాటుదారులు కూడా టర్కీని రెచ్చగొట్టకూడదు. ఐఎస్‌ను నిర్మూలించాలన్న అమెరికా నిర్ణయం నుంచి సిరియా, ఇరాన్, రష్యాలు లబ్దిపొందుతున్నాయి. మేము కూడా లబ్దిపొందాము. కానీ అంతం లేని ఈ యుద్ధానికి ఒక ముగింపు పలికేందుకు ఇప్పుడు బలగాలను వెనక్కి పిలిపిస్తున్నాం' అని ట్రంప్ వరుస ట్వీట్లలో పేర్కొన్నారు.

శుక్రవారం నుంచి అమెరికా బలగాలు సిరియా నుంచి వైదొలగడం ప్రారంభించాయి. కేవలం 2వేల మంది సైనికులు మినహా మిగిలిన వారు తిరుగు ప్రయాణమయ్యారు. ఈ బలగాల ఉపసంహరణ కొన్ని వారాలపాటు కొనసాగవచ్చు. ఈ నేపథ్యంలో ఐఎస్‌పై అమెరికా ఒత్తిడి కొనసాగుతుందని వైట్‌హౌస్ పేర్కొంది. కాగా, సిరియాలోని ఉగ్రసంస్థలపై పోరాడుతున్న కుర్దు తిరుగుబాటుదారులపై టర్కీ ఉగ్రవాద ముద్ర వేసింది. వీరి కారణంగానే స్వదేశంలో చొరబాట్లు పెరిగిపోయాయని ఆరోపిస్తున్నది. కుర్దు తిరుగుబాటుదారులకు మద్దతును ఉపసంహరించుకోవాలని పలుమార్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను కోరింది. అయితే, ట్రంప్ మాత్రం టర్కీ అధ్యక్షుడు ఎర్డోగన్ అభ్యర్థనను తోసిపుచ్చారు.

జింబాబ్వేలో నిరసనలు

- పెరిగిన చమురు ధరలను తక్షణమే తగ్గించాలని నిరసనకారుల డిమాండ్



హరారే : జింబాబ్వేలో నిరసనలు వెల్లువెత్తాయి. చమురు ధరలు మిన్నంటడంతో నిరసనకారులు ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలు చేపట్టారు. ప్లకార్డులు, బ్యానర్లు చేబూని ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. రహదారులను దిగ్బంధించారు. దీంతో, వాహనాల రాకపోకలు కొన్ని గంటలపాటు స్తంభించాయి. ఆందోళకారులు పలు దుకాణాల్లోకి చొరబడి బీభత్సం సృష్టించారు. దుకాణాల్లోని వస్తువులను ధ్వంసం చేశారు. చమురు ధరల పెంపును నిరసిస్తూ అల్లర్లు సృష్టించారు. అధ్యక్షుడు ఎమ్మెర్సన్ మాంగాగ్వా పెరిగిన ధరలను తక్షణమే తగ్గించాలంటూ నిరసనకారులు డిమాండ్ చేశారు. బులావాయో నగరంలో ఆందోళలు ఉధృతమయ్యాయి. ఆందోళనకారులు రోడ్లపై టైర్లకు నిప్పంటించారు. ఈ క్రమంలో నిరసనకారులకు, పోలీసులకు మధ్య వాగ్వాదం ఏర్పడి క్రమంగా ఘర్షణ వాతావరణానికి దారి తీసింది. నిరసనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు బాష్పవాయుగోళాలు ప్రయోగించారు. 'చమురు ధరలు ఒకేసారి 150శాతం పెరిగాయి. అధ్యక్షుడు నైతికంగా తన పదవికి రాజీనామా చేయాలి. ఇలాంటి పాలకుల చేతుల్లో మేం నలిగిపోతున్నాం. సామాన్య ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అందుకే తప్పనిసరి పరిస్థితుల్లో ఆందోళనకు దిగాం' అని గ్లెన్ క్యూబ్ అనే నిరసనకారుడు అన్నాడు. కాగా, అధ్యక్ష ఎన్నికల్లో మాంగాగ్వా చేతిలో ఘోర పరాజయం చవిచూసిన కారణంగానే ప్రతిపక్ష నేత నెల్సన్ చమీసా ఆందోళనకారులను ఉసిగొల్పుతున్నారని జింబాబ్వే అధ్యక్ష కార్యాలయం ఓ ప్రకటనలో పేర్కొంది. ఆందోళకారుల డిమాండ్లను పరిశీలిస్తామని తెలిపింది.

ఇండోనేషియా
విమాన ప్రమాద దర్యాప్తులో పురోగతి

- బ్లాకు బాక్సులు లభ్యం

జకార్తా : ఇండోనేషియా విమాన ప్రమాద దర్యాప్తులో పురోగతి కనిపిస్తున్నది. గతేడాది అక్టోబర్29న జకార్తా విమానాశ్రయం నుంచి టేకాఫ్ అయిన కొద్ది నిమిషాల్లోనే బోయింగ్-737 జెట్ విమానం జావా సముద్రంలో కూలిపోయిన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంలో 189 మంది మృతిచెందారు. అయితే, కాక్‌పిట్ వాయిస్ రికార్డర్లు లభ్యం కాకపోవడంతో దర్యాప్తు నత్తనడకన సాగింది. ప్రత్యేక బృందాలు బ్లాక్‌బాక్సుల కోసం మూడు నెలల నుంచి గాలిస్తున్నాయి. తాజాగా, ఘటనాస్థలి నుంచి కొన్ని కిలోమీటర్ల దూరంలో బ్లాక్‌బాక్సులు లభ్యమయ్యాయని విమానాశ్రయ అధికారులు తెలిపారు. విమానం ప్రమాదానికి గురైన సమయంలో పైలట్ల మధ్య జరిగిన సంభాషణ, ట్రాఫిక్ కంట్రోల్‌రూమ్ నుంచి ఎప్పుడు సంబంధాలు తెగిపోయాయి, ప్రమాదానికి గల కారణాలను అన్వేషించేందుకు కాక్‌పిట్ వాయిస్ రికార్డర్లు సహకరిస్తాయని అన్నారు. బ్లాక్‌బాక్సుల కోసం గాలింపు చర్యలు చేపట్టిన నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీకమిటి సభ్యులను అధికారులు ఈసందర్భంగా అభినందించారు. విమాన ప్రమాదాల కారణాలను తెలుసుకునేందుకు బ్లాక్‌బాక్సులు 90శాతం సహకరిస్తాయని అన్నారు.

పోలాండ్ మేయర్‌పై కత్తితో దుండగుడి దాడి



వార్సా : పోలాండ్‌లోని దాన్స్ నగర మేయర్ పావెల్ ఆదమోవిజ్‌పై(53) ఓ దుండగుడు కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఓ స్వచ్ఛంద సంస్థ కోసం విరాళాల సేకరణ కార్యక్రమం నిర్వహిస్తున్న క్రమంలో ఈ దాడి జరిగింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పావెల్ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. పోలీస్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం...దాన్స్ నగరంలో నిర్వహించిన ఓ ఛారిటీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పావెల్ హాజరయ్యారు. కార్యక్రమం జరుగుతున్న సమయంలో ఓ దుండగుడు పోడియం వద్దకు దూసుకువచ్చాడు. అతన్ని ఆపేందుకు భద్రతా సిబ్బంది విఫలయత్నం చేశారు. సభికులకు అభివాదం చేస్తున్న మేయర్‌పై దుండగుడు కత్తితో దాడికి పాల్పడ్డాడు.

పరారయ్యేందుకు ప్రయత్నించిన అతన్ని భద్రతా సిబ్బంది వెంబడించి పట్టుకొని పోలీసులకు అప్పగించారు. అరెస్టయిన నిందితుడు పాతనేరస్థుడని దాన్స్ డీఎస్పీ తెలిపారు. నిందితుడిపై గతంలో పలు కేసులు నమోదై ఉన్నాయని చెప్పారు. పలు హత్య కేసుల్లో, బ్యాంకు చోరీ కేసుల్లో దుండగుడి శిక్ష అనుభవించాడని అన్నారు. మేయర్‌పై దాడికి పాల్పడ్డ కారణం తెలియరాలేదన్నారు. కాగా, ఈ ఘటనపై పోలాండ్ అధ్యక్షుడు ఆండ్రెస్ డూడా తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆదమోవిజ్ పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. పొట్ట, ఛాతిభాగంపై బలమైన 10 కత్తిపోట్లు ఉన్నాయని అన్నారు. పావెల్‌ను రక్షించేందుకు వైద్యులు ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఆదమోవిజ్‌పై జరిగిన దాడిని ప్రధాని మాట్యూజ్ మోరవీకి, అంతర్గత వ్యవహారాల మంత్రి జోచిమ్ బ్రడ్‌జింకీ ఖండించారు.

ఇరాన్‌లో కూలిన సైనిక విమానం


15 మంది మృతి



టెహ్రాన్: ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో సైన్యానికి చెందిన ఓ కార్గో విమానం కుప్పకూలింది. ఈ ప్రమాదంలో 15 మంది మృతిచెందగా, మరో వ్యక్తి ప్రాణాలతో బయటపడ్డాడు. విమానం ల్యాండ్ అవుతున్న క్రమంలో ఒక్కసారిగా కూలిపోయింది. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. ఇరాన్ ఏవియేషన్ ఆర్గనైజేషన్ ప్రతినిధి రీజా జాఫర్జాదేహ్ తెలిపిన వివరాల ప్రకారం... మాంసం సరఫరా చేసేందుకు కిర్గిస్థాన్ రాజధాని బిషెక్ నుంచి బోయింగ్-707 కార్గో విమానం బయల్దేరింది. అయితే వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో పైలెట్ విమానాన్ని కరాజ్ ప్రాంతంలోని ఫాత్ ఎయిర్‌పోర్ట్‌కు సమీపంలో అత్యవసరంగా ల్యాండింగ్ చేసేందుకు ప్రయత్నిస్తుండగా పక్కనే ఉన్న భవనాన్ని ఢీకొట్టి కుప్పకూలిపోయింది. విషయం తెలుసుకున్న వెంటనే సహాయక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. విమానం కూలిన ప్రదేశంలో భారీ ఎత్తున పొగ వ్యాపించింది. దీనికి సంబంధించిన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. హెలికాప్టర్, అంబులెన్స్‌తో సిబ్బంది సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు. ఘటనా స్థలం నుంచి ఇప్పటికే పలు మృతదేహాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విమాన ఇంజినీర్ మాత్రమే ప్రాణాలతో బయటపడినట్టు తెలుస్తోంది. ఈ ఘటనపై అధికారులు విచారణ చేపట్టారు.

పార్శిల్స్ తెచ్చే రోబో డాగ్స్

బెర్లిన్ : పార్శిల్స్‌ను సులభంగా ఇంటి డోర్ వద్దకు తెచ్చే రోబో డాగ్స్ రానున్నాయి. డ్రైవర్లు లేని వ్యాన్లలో ఇవి ప్రయాణించి..కచ్చితంగా గమ్యానికి చేరుకోవడమే కాకుండా సదరు ప్యాకేజీని చిరునామాదారునికి అందజేస్తాయి. జర్మనీలోని కాంటినెంటల్ అనే రోబోటిక్స్ సంస్థ వీటిని సృష్టించింది. క్యూబ్ అని వ్యవహరించే రోబో కుక్కలు తమ ఎదుట ఏదైనా అవరోధం ఉన్నా దాన్ని దాటుకుని వెళ్ళగలవు. పైగా సునాయాసంగా మెట్లు కూడా ఎక్కగలవట. అక్కడి కన్స్యూమర్ ఎలక్ట్రానిక్ షో సందర్భంగా ప్రయోగాత్మకంగా వీటిని ప్రదర్శించారు. వీటిని తీసుకువచ్చే వ్యాన్లలో డ్రైవర్లు ఉండరని, అవి కూడా దాదాపు రోబో టెక్నాలజీతోనే ప్రయాణిస్తాయని కాంటినెంటల్ అధికారులు చెబుతున్నారు. ఈ రోబో డాగ్స్ తెలివిని చూసి ఈ షో కు వచ్చినవారంతా ఆశ్చర్యపోయారు.



ధృవ కల్లోలం

గతం కంటే ఎంతో వేగంగా కదులుతున్న ధృవాలు

ఏడాదికి 50కి. మీ వేగం.. 2000 సంవత్సరం నుంచే పెను మార్పులు

- నావిగేషన్, పక్షులు ఎగిరే దిశ, ఉపగ్రహాలు, విద్యుత్ సరఫరా గ్రిడ్‌లపై తీవ్ర ప్రభావం
- కరిగిపోతున్న ధృవాల్లోని గడ్డకట్టుకుపోయిన మంచు
- గ్రీన్ హౌజ్ గ్యాసుల మూలంగా వేడెక్కుతున్న సముద్ర జలాలు.. పెరుగుతోన్న నీటిమట్టం



జై

ఉత్తర, దక్షిణ ధృవాలు మారుతున్నాయి. ఇప్పటి వరకు శాస్త్రవేత్తలు అంచనా వేసిన దానికంటే అత్యంత వేగంగా అవి మారుతున్నాయి. ఈ మార్పు ధృవాల స్థానభ్రంశం, స్థితిపై ఆధారపడి ఉండి.. యావత్తు ప్రాణికోటిని దుర్భర పరిస్థితుల్లోకి తీసుకెళ్ళేలా ఉన్నాయి.

ధృవాల స్థానం ఎటో..?

భూమి లోపలి పొరల్లో జరిగే పరిస్థితులకు అనుగుణంగా సుమారు మూడు లక్షల ఏండ్లకోసారి స్థానాల్ని మార్చుకునే ఆర్కిటిక్, అంటార్కిటికా ధృవాలు గతంతో పోలిస్తే, వాటి స్థానాల్ని మార్చుకొనుటకు మరింత వేగిరంగా కదులుతున్నట్టు కొలరాడో యూనివర్సిటీ, నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్ఫియరిక్ అడ్మినిస్ట్రేషన్ సైంటిస్టులు గుర్తించారు. అయస్కాంత ధృవాలు సాధారణంగా ఐదేండ్ల కాలంలో కదిలే దూరాన్ని ప్రస్తుతం మూడేండ్లలోనే అధిగమించినట్టు.. అయస్కాంత ఉత్తర ధృవం ఏడాదికి యాభై కిలోమీటర్ల చొప్పున సైబీరియా ప్రాంతంవైపు కదులుతుండగా.. దక్షిణ ధృవం మాత్రం ఏడాదికి పది కిలోమీటర్ల మేర మాత్రమే కదులుతున్నదని.. ఈ మార్పు 2000 సంవత్సరం నుంచి జరుగుతున్నట్టు పరిశోధనలో భాగస్తుడైన అర్నాడ్ చుల్లియట్ అనే శాస్త్రవేత్త వివరించారు. ఐతే, ఈ మార్పులు సంభవించడానికి గల కారణాలు ఇప్పటికిప్పుడు చెప్పలేమని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.

కాగా, ధృవాల కదలికల్లో ఇలాంటి అనుకోని మార్పులు జరుగడం వల్ల నావిగేషన్ వ్యవస్థలకు ఇబ్బంది ఏర్పడవచ్చు. గూగుల్ రూట్ మ్యాప్స్ మొదలు.. విమానాలు, నౌకలు తమ ప్రయాణానికి ఉపయోగించే దిక్సూచీలు సరైన ఫలితాలు చూపకపోవచ్చు. పక్షుల గమనం అగమ్యగోచరంగా మారొచ్చు. ధృ వాల ఈ మార్పు మూలంగా బలహీన అయస్కాంత క్షేత్రం ఏర్పడి సూర్యుడి నుంచి వస్తున్న రేడియోధార్మిక కిరణాలు కృత్రిమ ఉపగ్రహాలు, విద్యుత్ సరఫరా గ్రిడ్‌లపై తీవ్ర ప్రభావం చూపే అవకాశమున్నట్టు అధ్యయనకారులు హెచ్చరిస్తున్నారు.

మంచు కరిగే సమయాన..

గ్లోబల్ వార్మింగ్ మూలంగా 2100 నాటికి ప్రపంచ వ్యాప్తంగా సముద్ర మట్టం కనిష్టంగా 28 సెంటీమీటర్ల నుంచి గరిష్టంగా 98 సెంటీమీటర్ల వరకూ పెరగవచ్చన్న ఐపీసీసీ హెచ్చరికల నేపథ్యంలో.. ఉత్తర, దక్షిణ ధృవాల్లో గడ్డకట్టుకుపోయి ఉన్న మంచు సైతం ఇటీవలి కాలంలో అసాధారణమైన రీతిలో కరిగిపోతున్నట్టు తేలడం ఆందోళన కలిగిస్తోంది. ఈ మంచు అంతా నీటిగా మారితే సముద్ర మట్టాలు అనూహ్యంగా పెరుగుతాయి. ఫలితంగా తీర ప్రాంతాల్లో ఉన్న నగరాలు, పలు ద్వీపదేశాలు నీటిలో మునిగిపోతాయి. మరికొన్ని దశాబ్దాలలో మాల్దీవులు, తువాలు వంటి ద్వీపాలు నీటిలో కలిసిపోయే ప్రమాదమున్నదని ఇప్పటికే సైంటిస్టులు హెచ్చరించారు. ఇక, చైనీస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ తాజాగా చేసిన అధ్యయనం ప్రకారం.. సముద్ర ఉష్ణోగ్రతలు గతంతో పోలిస్తే, ప్రస్తుతం ఎంతో ఎక్కువగా పెరిగిపోతున్నాయని.. శిలాజ ఇంధనాలను మండించడం మూలంగా వెలువడుతున్న గ్రీన్ హౌజ్ గ్యాసులు వల్లే ఈ పరిస్థితి దాపురించినట్టు తేలింది. ఇది ఇలాగే జరిగితే, సముద్రంలోని మత్స్య సంపద, ఇతర జీవజాలం ప్రమాదం అంచున చేరే పరిస్థితి తలెత్తవచ్చని, సముద్ర మట్టాలు సైతం పెరిగి తీరప్రాంత నగరాలకు తీరని నష్టం వాటిల్లవచ్చని అధ్యయనం తేల్చింది. గ్రీన్ హౌజ్ ఉద్గారాల స్థాయిని తగ్గించుకోగలిగితే పరిస్థితిని అదుపులోకి తీసుకురావచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

15 ఏండ్ల కిందట అదృశ్యమైన యువకుడు

- పండుగ పూట ప్రత్యక్షం
- ఆనందంలో కుటుంబీకులు

నవతెలంగాణ-తానూర్



ఇంటి నుంచి వెళ్లిపోయిన యువకుడు 15ఏండ్ల తరు వాత సంక్రాంతి పండుగ పూట ఇంటికి చేరుకున్నాడు. కొడుకుని చూసిన సంతోషంలో తల్లిదండ్రులు, సోదరుడి కండ్లు చెమర్చాయి. ఈ ఘటన నిర్మల్ జిల్లా తానూర్ మండలం కోలూర్‌లో సోమవారం జరిగింది. కోలూర్ గ్రామానికి చెందిన కొండేవార్ రాజు(35) పుట్టు మూగవాడు. 15 ఏండ్ల కిందట చెప్పాపెట్టకుండా ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబీకులు, స్నేహితులు ఎంత వెతికినా ఆచూకీ దొరకలేదు. ఇంటి నుంచి వెళ్లిపోయిన రాజు ఇంత కాలం ఎక్కడున్నాడో..ఏం చేశాడో తెలియదు. సోమవారం ముధోల్ బస్టాండ్‌లో బేల చూపులు చూస్తూ కూర్చున్న రాజును ముధోల్‌కు చెందిన శంకర్ మానవత్వంతో అన్నం పెట్టించడానికి ఇంటికి తీసుకెళ్లాడు. శంకర్ ఇంటికెళ్లిన రాజును ఆయన భార్య గుర్తు పట్టింది. రాజుది శంకర్ భార్యది ఒకే ఊరు కావడంతో ఆమె గుర్తు పట్టగల్గింది. రాజును తీసుకొని కోలూర్ గ్రామానికెళ్లారు. 15 ఏండ్ల కిందట కనిపించకుండా పోయిన రాజు అకస్మాత్తుగా కనిపించడంతో కుటుంబ సభ్యులు ఆనందంలో మునిగిపోయారు. అతడిని చూసి తల్లిదండ్రులు, సోదరుడు మోహన్, వదిన రుక్మాబాయి ఉద్వేగానికి గురయ్యారు. అయితే, రాజు పుట్టు మూగవాడు కావడంతో ఇన్నేండ్లు ఎక్కడున్నాడో చెప్పలేకపోతున్నాడు.

'చిట్టీ' మోసంతో యువకుడి ఆత్మహత్య


- చిట్టీ డబ్బులు రాక.. చెల్లి పెండ్లి కాలేదని మనస్తాపం
- పరారీలో నిర్వాహకుడు

నవతెలంగాణ - మంచిర్యాల

చిట్టీ పాడుకుని ఆ డబ్బులతో చెల్లి పెండ్లి చేయాలనుకున్న యువకునికి చిట్టి వ్యాపారి చెయ్యిచ్చాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన యువకుడు సూసైడ్‌నోట్ రాసి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మంచిర్యాల జిల్లా కేంద్రంలో సోమవారం సాయంత్రం జరిగింది. చిట్టీ నిర్వాహకుడు పరారీలో ఉన్నాడు. హెడ్‌కానిస్టేబుల్ నరసింహారావు, మృతుని వద్ద లభించిన సూసైడ్ నోట్‌లో ఉన్న వివరాల ప్రకారం.. మంచిర్యాల పట్టణంలోని చింతపండువాడకు చెందిన కౌటిక్ ప్రవీణ్ కిరాణ దుకాణం నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. దగ్గరి బంధువు అయిన రాపాక వెంకటేశ్వర్లు దగ్గర రూ.ఐదు లక్షల చిట్టీ వేశాడు. ప్రతి నెలా రూ.10వేల చొప్పున మొత్తం 50 నెలలపాటు కట్టాలి. ప్రవీణ్ చెల్లెలి పెండ్లి కోసం 29వ నెలలో చిట్టీ పాడాడు. అప్పటికీ ప్రవీణ్‌కు రూ.4లక్షలు రావాల్సి ఉండగా, రూ. లక్షా 50వేలు మాత్రమే నిర్వాహకుడు వెంటేశ్వర్లు ఇచ్చాడు. మిగతా డబ్బుల కోసం అడిగితే రేపు.. మాపు.. అంటూ కాలం గడుపుతూ వచ్చాడు. దాంతో పెండ్లి చేయలేకపోయాడు. చిట్టీ పూర్తయి కూడా 8 నెలలు గడుస్తోంది. అయినప్పటికీ ప్రవీణ్‌కు రావాల్సిన డబ్బులు ఇవ్వలేదు. ఆ డబ్బులు వస్తే తన చిన్న చెల్లి పెండ్లి చేద్దామని భావించిన ప్రమీణ్.. చిట్టీ కట్టి మోసపోయానని తరచూ బాధపడేవాడు. అటు చెల్లి పెండ్లి చేయలేక, ఇటు చిట్టీ డబ్బులు రాక మనస్తాపానికి గురైన ప్రవీణ్(30) పట్టణ శివారులో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని జేబులో దొరికిన సూసైడ్ నోట్ ప్రకారం మరో 36 మంది చిట్టీ బాధితులు ఉన్నట్టు తెలుస్తోంది. 'నాకు అన్యాయం జరిగింది. మిగతా వారికి ఎలాగైనా న్యాయం చేయండి. నా పరిస్థితి మరొకరికి రావొద్దు. వెంకటేశ్వర్‌ను కఠినంగా శిక్షించండి' అంటూ సూసైడ్ నోట్‌లో రాశాడు. నిందితుడు వెంకటేశర్లు పరారీలో ఉన్నాడు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆ ఓట్లను తిరిగిచ్చేయాలి...

- పౌరసత్వ బిల్లుపై అసోం గాయకుడు జుబీన్ ఆగ్రహం



న్యూఢిల్లీ : పౌరసత్వ బిల్లు పట్ల అసోం గాయకుడు జుబీన్ గార్గ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ బిల్లును తిరస్కరించాలంటూ అసోం సీఎం సోనోవాల్‌ను కోరారు. అలా చేయలేకపోతే 2016లో తన పాటలను వాడుకుని గెలిచిన ఓట్లను తిరిగిచ్చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయాలన్నీ జుబీన్ గార్గ్ తన ఫేస్‌బుక్ పోస్ట్‌లో తాజాగా పేర్కొన్నారు. ఇందులో ఏముందంటే..

"డియర్ సర్బానంద సోనోవాల్ కొన్ని రోజుల క్రితం పౌరసత్వ బిల్లును ఉద్దేశిస్తూ మీకు లేఖ రాశాను. కానీ మీరు దీనిని పట్టించుకోలేదు. 2016లో నా పాటలతో గెలిచిన ఓట్లను తిరిగిచ్చేస్తారా? కావాలంటే మీరు నాకు ఇచ్చిన పారితోషికాన్ని వెనెక్కి ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నా"నని పేర్కొన్నారు. జుబీన్ పెట్టిన ఈ ఫేస్‌బుక్ సందేశం సామాజిక మాధ్యమంలో సంచలనమైంది. పౌరసత్వ బిల్లును తిరస్కరించకపోతే దేశవ్యాప్త ఆందోళనలు చేపడతామని జనవరి 8న అసో సీఎం సోనోవాల్‌కు జుబీన్ లేఖ రాశారు.

నీరా, తాటి ఉత్పత్తుల పరిశ్రమలు నెలకొల్పాలి

- కల్లుగీత కార్మిక సంఘం-2019 క్యాలెండర్ ఆవిష్కరణలో వక్తలు

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్



కల్లుగీత కార్మికులను ఆదుకునేందుకు నీరా, తాటి ఉత్పత్తుల పరిశ్రమలను రాష్ట్ర ప్రభుత్వం నెలకొల్పాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కల్లుగీత కార్మిక సంఘం-2019 క్యాలెండర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నీరా, పలిమెర సొసైటీ రాష్ట్ర కార్యదర్శి మద్దెల రమేష్‌బాబు గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం నీరా ప్రాజెక్టుకు అనుమతి ఇవ్వాలని కోరారు. తాటి, ఈత చెట్ల ద్వారా నీరాతో పాటు బెల్లం, చాక్లెట్లు, షుగర్, జామ్‌లాంటి అనేక రకాల వస్తువులు తయారు చేయవచ్చునని, దీని వలన యువకులకు, గీత కార్మికులకు ఉపాధి అవకాశాలు కలుగుతాయని అన్నారు. కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎమ్‌వి.రమణ మాట్లాడుతూ..ప్రతి గ్రామంలో తాటి, ఈత వనాల పెంపకానికి పదెకరాలను ఇవ్వాలని, కొత్త జిల్లాల వారీగా గీతకార్మికులకు గుర్తింపు కార్డులివ్వాలని డిమాండ్ చేశారు. తాటి చెట్లను ఎక్కేందుకు యంత్రాలను అందజేయాలని కోరారు. కేరళ, తమిళనాడు మాదిరిగా కల్లు ఆధారితంగా 16 ఉత్పత్తులను తెలంగాణలోనూ తయారు చేసేలా గౌడ్‌లను రాష్ట్ర సర్కారు ప్రోత్సహించాలన్నారు. మత్స్యకార్మికులు, మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ మాట్లాడుతూ..బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు తగ్గించినా...బీసీలు పోరుబాట పట్టకపోవడం అనైక్యతను ఎత్తిచూపుతోందన్నారు. మరోవైపు అగ్రకులాల వారికి పది శాతం రిజర్వేషన్లు ఇవ్వడం దారుణమన్నారు. ఇప్పటికైనా బీసీలంతా ఐక్యమై హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మోదుగుపూలు ఎడిటర్ భూపతి వెంకటేశ్వర్లు, కల్లుగీత కార్మిక సంఘాల ఐక్యకార్యాచరణ కమిటీ కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్, మన గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గడ్డమీది విజయకుమార్ గౌడ్, గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు అంబాల నారాయణ గౌడ్, శారదాగౌడ్, నిమ్మల ఇందిర, కల్లుగీత కార్మిక సంఘం హైదరాబాద్, మేడ్చల్ జిల్లాల కార్యదర్శులు జనార్ధన్, స్వామిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

నవచిత్రం

సరికొత్త ప్రేమ కథ మిస్టర్ మజ్ను


అఖిల్

అఖిల్ అక్కినేని, నిధి అగర్వాల్ జంటగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'మిస్టర్ మజ్ను'. శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర ఎల్ఎల్పి పతాకంపై బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తాజాగా సోమవారం చిత్ర పాటల జ్యూక్ బాక్స్‌ని విడుదల చేశారు. 'ఇప్పటికే విడుదలైన పాటలకు యూ ట్యూబ్‌లో ట్రెమండస్ రెస్పాన్స్ వస్తోంది. సరికొత్త ప్రేమ కథతో రూపొందుతున్న చిత్రమిది. వెంకీ అట్లూరి అత్యద్భుతంగా తీర్చిదిద్దారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధంగా ఉంది. రిపబ్లిక్ డేని పురస్కరించుకుని ఈ నెల 25న గ్రాండ్‌గా రిలీజ్ చేస్తున్నాం' అని చిత్ర యూనిట్ తెలిపింది. నాగబాబు, ప్రియదర్శి, జయప్రకాష్, హైపర్ ఆది ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: థమన్, సినిమాటోగ్రఫీ: జార్జ్ సి.విలియమ్స్, ఎడిటింగ్: నవీన్ నూలి, ఆర్ట్: అవినాష్.

వాస్తవిక సంఘటనలతో ముద్ర


లావణ్య త్రిపాఠి
నిఖిల్ సిద్ధార్థ్

నిఖిల్ సిద్ధార్థ్, లావణ్య త్రిపాఠి హీరోహీరోయిన్లుగా టీఎన్ సంతోష్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'నిఖిల్ ముద్ర'. బి.మధు సమర్పణలో ఔరా సినిమాస్ పీవీటీ, మూవీ డైనమిక్స్ ఎల్ఎల్పీ పతాకంపై కావ్య వేణుగోపాల్, రాజు కుమార్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. చిత్రీకరణ చివరి దశకు చేరుకున్న ఈ చిత్రం గురించి దర్శక, నిర్మాతలు మాట్లాడుతూ, 'వాస్తవిక సంఘటనల ఆధారంగా జర్నలిజం నేపథ్యంలో తెరకెక్కుతున్న చిత్రమిది. షూటింగ్ చివరి దశలో ఉంది. ఐదు రోజుల టాకీ, ఓ పాటని ఈ నెలలో పూర్తి చేస్తాం. డబ్బింగ్ వర్క్, పోస్ట్ ప్రొడక్షన్ పనులు ఏకకాలంలో పూర్తి చేయనున్నాం. అద్భుతమైన ఔట్‌పుట్ ఇవ్వడానికి చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. సినిమాలో గ్రాఫిక్స్ సీన్స్‌తోపాటు భారీ యాక్షన్ సీక్వెన్స్ ఉన్నాయి. అందుకే టైమ్ పడుతుంది. జర్నలిస్ట్ పాత్రలో నిఖిల్ నటిస్తున్నారు. ఫస్ట్‌లుక్‌కి కూడా అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. త్వరలోనే టీజర్‌ని విడుదల చేయనున్నాం. స్యామ్ సీఎస్ సంగీతం అందిస్తున్నారు. త్వరలోనే సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం' అని అన్నారు. వెన్నెల కిశోర్, కృష్ణ మురళి, నాగినీడు, ప్రగతి, సత్య, తరుణ్ అరోరా, రాజా రవీంద్ర ఇతర తారాగణంగా నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సూర్య, ఆర్ట్: సాహి సురేష్.

అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే ఏబీసీడీ


అల్లు శిరీష్

అల్లు శిరీష్ హీరోగా సంజీవ్‌రెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'ఏబీసీడీ' (అమెరికన్ బోర్న్ కన్‌ఫ్యూజ్డ్ దేశీ). రుక్సార్ థిల్లాన్ హీరోయిన్. డి.సురేష్‌బాబు సమర్పణలో మధుర ఎంటర్‌టైన్ మెంట్, బిగ్‌బెన్ సినిమాస్ పతాకాలపై మధుర శ్రీధర్‌రెడ్డి, యష్ రంగినేని సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమాని మార్చి 1న విడుదల చేయబోతున్నారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ, 'మలయాళంలో సక్సెస్ సాధించిన 'ఏబీసీడీ' చిత్రానికి రీమేక్. మలయాళంలో దుల్కర్ సల్మాన్ పోషించిన పాత్రను ఇందులో అల్లు శిరీష్ పోషిస్తున్నారు. ఇటీవల విడుదల చేసిన ఫస్ట్‌లుక్‌కి విశేషమైన స్పందన లభించింది. మెగా బ్రదర్ నాగబాబు కీలక పాత్రలో హీరోకి తండ్రిగా ఈ చిత్రంలో నటిస్తున్నారు. మాస్టర్ భరత్ అల్లు శిరీష్‌కి స్నేహితుడిగా కనిపించనున్నారు. తెలుగు ఆడియెన్స్ హ్యాపీగా ఎంజాయ్ చేసేలా ఈ సినిమా ఉంటుంది. తెలుగు నేటివిటీకి తగ్గట్టుగా స్క్రిప్ట్ వర్క్ జరిగింది. దర్శకుడు సంజీవ్‌రెడ్డి తెలుగు ప్రేక్షకులు మెచ్చే విధంగా కథను తీర్చిదిద్దారు. కన్నడ టాప్ మ్యూజిక్ డైరెక్టర్ జుధా సాంధీ ఈ చిత్రానికి సంగీతం అందిస్తుండటం విశేషం. 2.5 కోట్లకు ఈ చిత్రానికి సంబంధించిన హిందీ డిజిటల్, శాటిలైట్ హక్కులను గోల్డ్ మైన్ ఫిల్మ్స్ దక్కించుకోవడం విశేషం. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ సినిమా అన్ని వర్గాలను అలరించేలా ఉంటుంది' అని అన్నారు.

థ్రిల్ చేసే అద్భుతమైన కథ..


అశ్విని, ధ్రువ

ధ్రువ, అశ్విని హీరోహీరోయిన్లుగా జైరామ్ వర్మ దర్శకత్వంలో 'ఎం 6' చిత్రం రూపొందుతుంది. విశ్వనాథ్ ఫిల్మ్ ఫ్యాక్టరీ, శ్రీలక్ష్మి వెంకటాద్రి క్రియేషన్స్ పతాకంపై విశ్వనాథ్ తన్నీరు నిర్మిస్తున్న ఈ సినిమా ఫిబ్రవరి మొదటి వారంలో విడుదల కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ, 'సస్పెన్స్ థ్రిల్లర్‌గా సినిమాని రూపొందించాం. ప్రేక్షకుల్ని థ్రిల్ చేసే ఒక అద్భుతమైన కథని అంతే అద్భుతంగా తెరకెక్కించా. సెన్సార్ పూర్తి చేసుకుని 'యు/ఎ' సర్టిఫికేట్ పొందింది. నిర్మాతలు రాజీపడకుండా చాలా క్వాలిటీగా నిర్మించారు. ఎలాంటి హంగులు, ఆర్భాటాలు లేకుండా సినిమా చాలా నేచురల్‌గా సాగుతుంది. ప్రత్యేకంగా పోరాట దృశ్యాలు మన కళ్ళ ముందు జరుగుతున్నట్టు అనిపిస్తాయి. ఇలాంటి సినిమాలు తమిళం, కన్నడలో వచ్చేవి. ఇప్పుడు తెలుగు ప్రేక్షకులు కూడా ఇలాంటి సినిమాలని ఆదరిస్తున్నారు. చూసి ఎంజాయ్ చేస్తున్నారు' అని అన్నారు. 'ఈ సినిమా ద్వారా హీరోగా పరిచయం అవుతున్నందుకు హ్యాపీగా ఉంది' అని హీరో ధ్రువ తెలిపారు. శ్రావణి, తిలక్, సాధన, అప్పలరాజు, హరిత, వంశీ, ఇంద్రతేజ నటించిన ఈ చిత్రానికి సంగీతం: విజయ్ బాలాజీ, సినిమాటోగ్రఫీ: మహ్మద్ రియాజ్.

సమ్మర్ స్పెషల్‌గా మజిలీ


దివ్యాంశ కౌశిక్, నాగచైతన్య

నాగచైతన్య, సమంత జంటగా దివ్యాంశ కౌశిక్ మరో కథానాయికగా నటిస్తున్న చిత్రం 'మజిలీ'. శివ నిర్వాణ దర్శకత్వంలో షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి, హరీష్ పెద్ది సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సమ్మర్ స్పెషల్‌గా సినిమా విడుదల కాబోతుంది. సంక్రాంతి సందర్భంగా చిత్ర రెండో లుక్‌ని విడుదల చేశారు.
ఈ సందర్భంగా చిత్ర నిర్మాతలు మాట్లాడుతూ, 'నాగచైతన్య సరసన రెండో కథానాయికగా నటిస్తున్న దివ్యాంశ కౌశిక్ లుక్‌ని తాజాగా రిలీజ్ చేశాం. ఈ లుక్ ఆడియెన్స్‌ని ఆకట్టుకుంటోంది. ఫస్ట్‌లుక్‌లో గెడ్డంతో కనిపించిన నాగచైతన్య ఇందులో క్లీన్ షేవ్‌తో క్రికెట్ ఆటగాడిగా కనిపిస్తున్నాడు. ఆయన లుక్ స్టయిలీష్‌గా ఉంది. 'దేర్ ఈజ్ లవ్.. దేర్ ఈజ్ పెయిన్' అనే ట్యాగ్‌లైన్‌తో వస్తున్న ఈ చిత్రం వైజాగ్ నేపథ్యంలో రూపొందుతుంది. రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా శివ ఈ చిత్రాన్ని తీర్చిదిద్దుతున్నారు. 80శాతం షూటింగ్ పూర్తయ్యింది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి సమ్మర్ స్పెషల్‌గా ఏప్రిల్ 5న రిలీజ్ చేయనున్నాం' అని అన్నారు. రావు రమేష్, పోసాని, సుబ్బరాజ్ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: గోపీసుందర్, కెమెరా: విష్ణు వర్మ.


కీర్తి సురేష్

హర్రర్ థ్రిల్లర్‌గా అనుష్క నయా సినిమా


అనుష్క, మాధవన్, అంజలి, షాలిని పాండే

మాధవన్, అనుష్క శెట్టి, అంజలి, షాలిని పాండే ప్రధాన పాత్రధారులుగా ఓ సినిమా రూపొందబోతుంది. హేమంత్ మధుకర్ దర్శకత్వం వహించనున్న ఈ సినిమాని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, కోన ఫిల్మ్ కార్పొరేషన్ పతాకాలపై టి.జి.విశ్వప్రసాద్, కోన వెంకట్‌లు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. త్వరలో ప్రారంభం కానున్న ఈ సినిమా గురించి తెలియజేస్తూ, చిత్ర బృందం సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపింది. 'తెలుగు, తమిళం, హాలీవుడ్ నటీనటులు, సాంకేతిక నిపుణులతో నిర్మితమవుతున్న తొలి క్రాస్ ఓవర్ చిత్రమిది. హర్రర్ థ్రిల్లర్‌గా తెరకెక్కించబోతున్నాం. కోన వెంకట్, గోపీ సుందర్, షనీల్ డియో, గోపి మోహన్, నీరజ కోన సినిమాకి సాంకేతిక నిపుణులుగా పనిచేస్తున్నారు. మార్చిలో చిత్ర షూటింగ్‌ని అమెరికాలో ప్రారంభిస్తాం. ఈ ఏడాది ద్వితీయార్థంలో సినిమాని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం. ఇతర తారాగణం, సాంకేతిక నిపుణుల వివరాలు ప్రకటిస్తాం' అని చిత్రబృందం తెలిపింది.

ఎఫ్3కి కూడా గ్రీన్‌సిగ్నల్ వచ్చేసింది

'ఆరోగ్యకరమైన కామెడీని పండించడంలో జంధ్యాల, ఈవీవీ, ఎస్వీ కృష్ణారెడ్డి వంటి దర్శకులే నాకు స్ఫూర్తి' అని దర్శకుడు అనిల్ రావిపూడి అన్నారు. వినోద ప్రధానమైన సినిమాలు రూపొందించి వరుస విజయాలను అందుకుంటున్నారు అనిల్. తాజాగా ఆయన వెంకటేష్, వరుణ్‌తేజ్ హీరోలుగా 'ఎఫ్2' (ఫన్ అండ్ ఫ్రస్టేషన్) చిత్రాన్ని రూపొందించారు. సంక్రాంతి సందర్భంగా విడుదలైన ఈ సినిమాకి పాజిటివ్ టాక్ వస్తున్న నేపథ్యంలో దర్శకుడు అనిల్ రావిపూడి మీడియాతో ముచ్చటించారు. ఆ విశేషాలు ఆయన మాటల్లోనే..


అనిల్ రావిపూడి

"రాజా ది గ్రేట్' సినిమా టైమ్‌లో ఈ ఆలోచన వచ్చింది. అప్పటికే వరుసగా మూడు యాక్షన్ సినిమాలు చేశాను. తదుపరి సినిమా ఫైట్స్ లేకుండా పూర్తి వినోదాత్మకంగా రూపొందించాలనుకున్నా. 'పెళ్ళాం చెబితే వినాలి', 'క్షేమంగా వెళ్ళి లాభంగా రండి' తరహాలో భార్యాభర్తల నేపథ్యంలో కథ అయితే బాగుండూ అనిపించింది. పైగా నాకు 'గుండమ్మ కథ' సినిమా అంటే ఇష్టం. ఎప్పటికైనా అలాంటి మల్టీస్టారర్ సినిమా చేయాలనే కోరిక ఉండేది. ఆ ప్రభావం ఈ సినిమాలోని పాత్రల్లో కనిపిస్తుంది. దీంతో 'గుండమ్మ కథ' లాంటి సినిమా తీయాలనే కోరిక తీరింది. వెంకటేష్, వరుణ్‌తేజ్‌లని దృష్టిలో పెట్టుకుని ఈ కథ రాసుకున్నా. వెంకటేష్ మాత్రమే ఆ పాత్రలో నటించాలి. వరణ్ తేజ్ బోరబండ బస్తీ కుర్రాడిగా బాగా సూట్ అవుతాడు. ఈ కథకి ఇద్దరూ ఓకే చెప్పారు. తన ఏజ్‌కి తగ్గట్టు సన్నివేశాలు రాయమని వెంకటేష్ చెప్పారు. ఇద్దరు నాకు పూర్తి స్వేచ్ఛనిచ్చారు. అందుకే ఎంటర్‌టైన్‌మెంట్ బాగా వర్కౌట్ అయ్యింది. సినిమా చూసిన ప్రతి ఒక్కరు 'అంతేగా అంతేగా' అంటూ సరదాగా మాట్లాడుకుంటున్నారు. థియేటర్ల నుంచి వెంకీ ఆసనాలు వేస్తూ బయటకొస్తున్నారు. ఇప్పుడు ఎక్కడ చూసినా మా సినిమా సందడే కనిపిస్తుంది. అయితే సినిమాకి కమర్షియల్ ఎలిమెంట్స్ ముఖ్యం అనుకున్నప్పుడు ఎక్కడో ఓ చోట కథ బౌండరీలు దాటాలి. కేవలం కథ మీదే దృష్టి పెడితే అదొక రకమైన సినిమా అవుతుంది. 'మాతృదేవోభవ' ఒక నావెల్ స్టోరీ. అలాంటి సినిమా చేస్తున్నప్పుడైతే కథ గురించి మాట్లాడొచ్చు. నా సినిమాల్లో కథ కంటే ట్రీట్‌మెంట్‌కే ఎక్కువ ప్రాధాన్యమనే విషయాన్ని నేను కూడా ఒప్పుకుంటా. నా సినిమాల్లో వినోదం పండుతుందంటే నేను చూసిన సినిమాలే కారణం. ఇతర సినిమాలని చూసే అన్నీ నేర్చుకుంటా. కొన్నిసార్లు రియల్ లైఫ్‌లో ఎదురైన, మనం చూసిన సన్నివేశాలు ఉపయోగపడతాయి. సందర్భానుసారంగా కామెడీ పండించడం అంత ఈజీ కాదు. స్క్రిప్ట్ దశలో చాలా వరకు గ్రౌండ్ వర్క్ చేయాలి. కొత్తగా ఇంకా ఏం అనుకోలేదు. 'గోల్‌మాల్' తరహాలో 'ఎఫ్2'కి సీక్వెల్‌గా సినిమాలు చేయాలనే ఆలోచన ఉంది. 'ఎఫ్3' సినిమా చేద్దామని చెబితే వెంకీ, వరుణ్ ఓకే చెప్పారు. అందులో ముగ్గురు హీరోలుంటారు. స్పోర్ట్స్ నేపథ్యంలో బయోపిక్ చేయాలనుంది. బాలీవుడ్‌లో అవకాశాలు వస్తే చేస్తా. 'పటాస్' సినిమాని లేడీ ఓరియెంటెడ్‌గా మార్చి బాలీవుడ్‌లో తెరకెక్కించాలనుంది' అని తెలిపారు.

ఆ తర్వాతే పెళ్ళి గురించి ఆలోచిస్తా..

'ఇప్పుడు పెళ్లి చేసుకునే ఆలోచన లేదు. అద్భుతమైన చిత్రాలు, అత్యద్భుతమైన పాత్రలు మరిన్ని చేయాలని ఉంది. ఆ తర్వాతే పెళ్ళి గురించి మాట్లాడతాను' అని అంటోంది కీర్తి సురేష్. గతేడాది 'మహానటి'తో అందరి దృష్టిని ఆకర్షించిన కీర్తికి ఈ చిత్రంతో మరింత పేరు, కీర్తి పెరిగింది. ప్రస్తుతం లేడీ ఓరియెంటెడ్ చిత్రాలకు క్రేజీ కథానాయికగా మారిన కీర్తి తన సినీ ప్రయాణం గురించి చెబుతూ, 'నేను హీరోయిన్ అవుతానని ఎప్పుడూ అనుకోలేదు. స్టడీస్ పూర్తయ్యాక మోడలింగ్ చేశా. అప్పుడే ఓ మలయాళ చిత్రంలో నటించే అవకాశం వచ్చింది. కానీ సినిమా చేయాలా వద్దా అన్న సందిగ్ధంలో పడ్డాను. నా సహచరులు, ఫ్రెండ్స్ సలహా మేరకు నటించా. ఆ సినిమా నాకు మంచి గుర్తింపు తెచ్చిపెట్టింది. దీంతో వరుసగా తమిళం, అట్నుంచి తెలుగులో నటించే అవకాశాలు క్యూ కట్టాయి. తమిళంలో మంచి ప్రతిభావంతులున్నారు. నేను ప్రారంభం నుంచి బాగా శ్రమించినందు వల్లే ఈ స్థాయిలో ఉన్నా. ఇంకా మంచి గుర్తింపు తెచ్చుకోవాల్సిన అవసరం ఎంతో ఉంది. ప్రస్తుతం పలు సినిమాల్లో నటిస్తూ బిజీగా ఉన్నా. అయితే పెళ్ళి ఎప్పుడు చేసుకుంటారని అందరూ అడుగుతున్నారు. ఇప్పుడే పెళ్ళి చేసుకునే ఆలోచన లేదు. ముున్ముందు మరిన్ని భిన్నమైన పాత్రలు పోషించాలనుకుంటున్నా. నా కలలన్నీ నెరవేరాకే పెళ్ళి గురించి ఆలోచిస్తా' అని తెలిపింది. ప్రస్తుతం మలయాళంలో 'మరక్కర్: అరబికడలింటే సింహామ్', తెలుగులో ఓ లేడీ ఓరియెంటెడ్ చిత్రంలో కీర్తి నటిస్తోంది.

ప్రభాస్‌ని చూసినట్టే ఉందన్నారు

జాన్ హీరోగా రవి ప్రకాష్ దర్శకత్వంలో వైష్ణవి ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రవిప్రకాష్ కృష్ణంశెట్టి నిర్మించిన చిత్రం 'అదృశ్యం'. ఈ చిత్ర ట్రైలర్ విడుదల కార్యక్రమం ఇటీవల జరిగింది. ఈ సందర్భంగా దర్శకుడు రవిప్రకాష్ మాట్లాడుతూ, 'కె.విశ్వనాథ్ వద్ద కో డైరెక్టర్‌గా పనిచేశాను. సింగీతం శ్రీనివాస్ వద్ద 14 సినిమాలకి పనిచేశా. అలాంటి లెజెండరీ దర్శకుల వద్ద పనిచేసే అవకాశం రావడం నా అదృష్టం. హీరో జాన్ గతంలో నా పిల్లల సినిమా చేశాడు. నేను రూపొందించిన 'బంటీ ది బ్యాడ్ బాయ్'కి ఎన్నో అవార్డులు వచ్చాయి. ఒక రికార్డు వచ్చే సినిమా చేయాలని ఈ చిత్రాన్ని రూపొందించా. సినిమా బాగుంటే చాలు, బడ్జెట్‌తో పనిలేదు. నా హీరోకి నేను ముందుగా కృతజ్ఞతలు చెప్పుకోవాలి. ఇందులో నలుగురు హీరోయిన్లు ఉన్నారు. జయవాణి ఓ మాంత్రికురాలిగా ప్రత్యేక పాత్రలో నటించారు. టెక్నీషియన్లంతా సినిమా కోసం చాలా కష్టపడ్డారు. సినిమా చాలా బాగా వచ్చింది. హర్రర్, థ్రిల్లర్, కామెడీ ప్రధానంగా రూపొందిన ఈ చిత్రం అన్ని కార్యక్రమాలు పూర్తయ్యాయి. ఫిబ్రవరిలో రిలీజ్‌కి ప్లాన్ చేస్తున్నాం' అని అన్నారు. "అదే నువ్వు అదే నేను', 'బంటీ ది బ్యాడ్ బాయ్' తర్వాత నేను నటించిన మూడవ చిత్రమిది. నాకు ఛాన్స్ ఇచ్చిన దర్శకుడికి థ్యాంక్స్. లెజెండరీ దర్శకుడు కె.విశ్వనాథ్‌ని కలిసి మా ఆడియోని విడుదల చేశాం. ఆయన నన్ను ప్రభాస్‌లా ఉన్నావ్ అని ప్రశంసించడం మరిచిపోలేను. అంత పెద్ద దర్శకుడు నన్ను పొగడ్డమంటే మామూలు విషయం కాదు. సినిమాని ఆదరించాలని కోరుకుంటున్నా' అని కథానాయకుడు జాన్ తెలిపారు.


'అదృశ్యం' చిత్రంలో ఒక దృశ్యం

అక్షర వినూత్న పోరాటం


నందితా శ్వేత

నందితా శ్వేత ప్రధాన పాత్రధారిణిగా 'అక్షర' చిత్రం రూపొందుతుంది. బి.చిన్నికృష్ణ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సినిమా హాల్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సురేష్ వర్మ అల్లూరి, అహితేజ బెల్లంకొండ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. భోగి పండుగని పురస్కరించుకుని సోమవారం ఈ చిత్ర మోషన్ పోస్టర్‌ని విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు బి.చిన్నికృష్ణ మాట్లాడుతూ,'ప్రస్తుత సమాజంలో విద్యకి మించిన వ్యాపారం లేదు. కానీ సమాజాన్ని మార్చే ఆయుధం విద్యే. ఈ నేపథ్యంలో 'అక్షర' ప్రయాణం ఎలా ఉండబోతుందనే ఆలోచనకు ప్రతిరూపమే ఈ సినిమా. అక్షర పోరాటం వినూత్నంగా ఉంటుంది. నందిత శ్వేత తన పాత్రకు ప్రాణం పోశారు. ఆమె కెరీర్‌లో బెస్ట్‌గా ఈ పాత్ర నిలుస్తుంది. బొబ్బిలి అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ హైలైట్‌గా నిలుస్తుంది. ప్రస్తుతం ఫస్ట్ షెడ్యూల్ పూర్తయింది. సమ్మర్‌లో విడుదలకి ప్లాన్ చేస్తున్నాం' అని అన్నారు. 'సినిమా కాన్సెప్ట్‌ని టీజర్‌గా రిలీజ్ చేశాం. దీనికి మంచి స్పందన లభించింది. మోషన్ పోస్టర్‌ని కూడా కాన్సెప్ట్‌ని ఎలివేట్ చేసే విధంగా ప్లాన్ చేశాం. ఎడ్యూకేషన్ వ్యవస్థలోని లోపాలని బోల్డ్‌గా తెరమీదకి తీసుకురాబోతున్నాం' అని నిర్మాత అహితేజ్ బెల్లంకొండ తెలిపారు. 'ప్రేక్షకుల ఆలోచనల్లో మార్పు తెచ్చే విధంగా ఈ సినిమా రూపుదిద్దుకుంటోంది. విద్యకి వ్యాపారం పర్యాయపదం అయ్యింది. అలాంటి ఆలోచనలు మార్చేందుకు ఈ ప్రయత్నం చేస్తున్నాం' అని మరో నిర్మాత సురేష్ వర్మ చెప్పారు.

ఆధునిక ద్రోణాచార్యుడి కథ


సందీప్ కిషన్

సందీప్ కిషన్ ఇప్పుడు వరుసగా విభిన్న కథా చిత్రాలు చేస్తున్నారు. అందులో భాగంగా ప్రస్తుతం 'సుబ్రహ్మణ్యపురం' వంటి విజయవంతమైన సినిమాని రూపొందించిన దర్శకుడు సంతోష్ జాగర్లపూడితో ఓ సినిమా చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. 'కార్తికేయ' వంటి హిట్ చిత్రాన్ని తెరకెక్కించిన వెంకట శ్రీనివాస్ ఈ సినిమాని నిర్మిస్తున్నారు. 'క్రీడా నేపథ్యంలో ఈ సినిమాని తెరకెక్కిస్తున్నాం. భారతంలో తన బొమ్మని గురువుగా భావించి విద్య నేర్చుకున్న ఏకలవ్యుడి నుంచి బొటనవేలు తీసుకున్నాడు ద్రోణాచార్యులు. ఈ ఆధునిక కాలంలో అలాంటి ఓ గురువు ఎలాంటి గురు దక్షిణ అడిగాడు అనే ఉత్సుకత రేకెత్తించే కథాంశంతో ఈ సినిమాని రూపొందిస్తున్నాం. మిగిలిన నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో వెల్లడిస్తాం' అని నిర్మాత వెంకట శ్రీనివాస్ అన్నారు.

అంతా ఆదివాసీలదే



కొండూరి రమేశ్‌బాబు

రాజ్యాంగంలోని ఐదవ షెడ్యూల్‌లో ఉన్న ఏజెన్సీ ప్రాంతంలో పీసా చట్టం అమల్లో ఉన్నది. రాష్ట్రంలోని పూర్వపు ఆదిలాబాద్, ఖమ్మం, వరంగల్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో గతంలో ఉన్న 631 గ్రామపంచాయితీలతో పాటూ ఇటీవల ఏర్పాటు చేసిన మరో 400 గ్రామపంచాయితీలకు ఎన్నికలు జరుగుతున్నాయి. ఆదివాసీ తెగల ఆచార వ్యవహారాలు, సాంప్రదాయాల్లో భాగంగా ఉన్న స్వయం నిర్ణయాధికారం, సమస్యలను తగవులను పరిష్కరించుకునే ఆచారాన్ని దృష్టిలో పెట్టుకుని 1996లో కేంద్ర ప్రభుత్వం 'పీసా' చట్టం అమల్లోకి తెచ్చింది. ఈ చట్టం ప్రకారం కీలక నిర్ణయాలన్నీ గ్రామసభల్లోనే జరగాలి. గ్రామ పెద్దల సమక్షంలో జరిగే గ్రామసభల నిర్వహణకు సంబంధించిన మార్గదర్శక సూత్రాలను ఉమ్మడి రాష్ట్రంలో 2011 లో జీఓ నంబర్ 66 ద్వారా రాష్ట్ర ప్రభుత్వం జారీ చేయగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇవే నిబంధనలు కొనసాగుతున్నాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాలను ఆమోదించటం లేదా తిరస్కరించే అధికారం ఏజెన్సీ గ్రామ సభలకు ఉన్నది.

గ్రామసభల అధికారాలు...

ప్రజావసరాల కోసం కానీ ప్రయివేటు సంస్థల కోసం కానీ భూసేకరణ జరపాలంటే ఏజెన్సీ ప్రాంతంలో గ్రామసభల అనుమతి తీసుకోవాల్సి ఉన్నది. 'పీసా' చట్టం ప్రకారం ఇసుక, గ్రావెల్ తదితర చిన్న తరహా ఖనిజ సంపదకు ఆదివాసీలే యజమానులు. ఖనిజ సంపదను ప్రభుత్వ రంగ సంస్థలకి కానీ ప్రయివేటు వ్యక్తులకు కానీ అప్పగించాలంటే గ్రామసభల ఆమోదం అవసరం. ఏజెన్సీ ప్రాంతంలో గ్రామసభలు ఆమోదిస్తేనే మద్యం దుకాణాలకు లైసెన్సులు ఇవ్వాల్సి ఉన్నది. ఈ లైసెన్సులు కూడా ఆదివాసీల పేరుతోనే జారీ చేయాల్సి

ఉన్నది. చిన్న తరహా అటవీ ఉత్పత్తుల సేకరణ, సంతల నిర్వహణ, చిన్న తరహా నీటి వనరుల నిర్వహణ గ్రామసభల ఆమోదంతోనే జరగాలి. వ్యవసాయ ప్రణాళికలు కూడా గ్రామసభ ఆమోదం తర్వాతే అమలు చేయాలి. పంచాయితీ పరిధిలో ఉండే పాఠశాలలు, వైద్యశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను పర్యవేక్షించే బాధ్యత కూడా గ్రామసభలకే కట్టబెట్టారు. తెలంగాణ సహా అన్ని రాష్ట్రాల్లో పీసా చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వాలే నీరు కార్చాయనే విమర్శలు పెల్లుబుకుతున్నాయి. ఇసుక తవ్వకాలు గ్రామపంచాయితీలకే అప్పగించాల్సి

ఉండగా చట్ట విర్ధుంగా రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ దక్కించుకుని ప్రయివేటు కాంట్రాక్టర్లకు అప్పగించటంతో గ్రామసంచాయితీలకు ఆదాయం రాకుండా పోయింది. పర్యావరణ విధ్వంసం జరుగుతున్నా నష్ట నివారణ చర్యల కోసం ప్రభుత్వం నిధులు విడుదల చేయటం లేదు. ప్రస్తుతం జరుగుతున్న గ్రామసంచాయితీ ఎన్నికల తర్వాత పంచాయితీరాజ్ వ్యవస్థలో కీలక మార్పులు తీసుకు వస్తామని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తున్నది. ఆదివాసీల స్వయం పాలన కోసం జరిగే గ్రామసభల విషయంలో కూడా ప్రభుత్వ వైఖరిలో మార్పు రావాలని ఆదివాసీలు కోరుతున్నారు.

సర్పంచ్ లేక పోయినా గ్రామసభ...

చట్ట ప్రకారం గ్రామసభను సమావేశపరచిన తర్వాత దీనికి అధ్యక్షత వహించే అధికారం సర్పంచ్‌కి ఉన్నప్పటికీ సర్పంచ్ రాక పోయినా గ్రామసభకు అధ్యక్షత వహించటానికి సర్పంచ్ అంగీకరించక పోయినా ఆదివాసీ తెగకు చెందిన పెద్దను గ్రామసభ అధ్యక్షుడిగా ఎన్నుకునే అధికారం ఆదివాసీలకు ఉన్నది. ఒక గ్రామపంచాయితీ పరిధిలో ఒకటి కన్నా ఎక్కువ ఆవాసాలు ఉంటే ప్రతి ఆవాసంలో ఒక గ్రామసభ నిర్వహించుకునే అధికారం ఉన్నది. అక్కడి నివసించే ఆదివాసీ తెగ లేదా గుంపు గ్రామసభ ద్వారా నిర్ణయాలను ప్రకటించే అధికారం

సంక్రమించింది. గ్రామసభ తీర్మానాలకు పూర్తి స్థాయి చట్టబద్ధత ఉన్నది. గ్రామసభ వ్యవహారాల్లో తాము కూడా జోక్యం చేసుకోలేమని సుప్రీం కోర్టు కూడా పలుమార్లు స్పష్టం చేసింది.

వేదాంతను తిప్పికొట్టిన గ్రామసభలు...

ఒడిషాలోని బాక్సైట్ గనులను వేదాంతకు అప్పగించటానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన ప్రయత్నాలను గ్రామసభల తీర్మానాల ద్వారా అక్కడి ఆదివాసీలు తిప్పికొట్టారు. గ్రామసభల నిర్వహణలో అధికార యంత్రాంగం మితిమీరిన జోక్యాన్ని కూడా ఈ సందర్భంగా సుప్రీం కోర్టు తప్పుపట్టింది. అధికారులకు సంబంధం లేకుండా జిల్లా న్యాయమూర్తి పర్యవేక్షణలో నిర్వహించిన 13 గ్రామపంచాయితీలకు సంబంధించిన గ్రామసభలు బాక్సైట్ తవ్వకాలను వ్యతిరేకిస్తూ ఏకగ్రీవ తీర్మానాలు చేశాయి.

ప్రభాస్ ఎవరో నాకు తెలియదు

(మొదటిపేజీ తరువాయి)

అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ షర్మిల భర్త అనిల్ కుమార్, పార్టీ సీనియర్ నాయకులు వైవీ సుబ్బారెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి, వాసిరెడ్డి పద్మతో కలిసి సోమవారం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని పోలీస్ కమిషనరేట్‌లో సీపీ అంజనీకుమార్‌కు ఫిర్యాదు చేశారు.

అనంతరం షర్మిల మీడియాతో మాట్లాడుతూ.. ఐదేండ్లుగా సోషల్ మీడియాలో తనపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. కొందరు కావాలనే 2014 ఎన్నికలకు ముందు తనపై దుష్ప్రచారం మొదలు పెట్టారనీ, తనకు సినీ హీరో ప్రభాస్‌కు సంబంధం ఉందంటూ ఆన్‌లైన్‌లో ప్రచారం చేశారనీ గుర్తు చేశారు. సినీ హీరో ప్రభాస్ ఎవరో తనకు తెలియదన్నారు. తాను ఇప్పటి వరకూ ఆయన్ను కలవలేదనీ, ఫోన్లో సైతం మాట్లాడలేదనీ అన్నారు. తప్పుడు ప్రచారాలు చేస్తున్న వారు ప్రభాస్‌ను కలిసినట్టుగా, మాట్లాడినట్టుగా ఆధారాలు చూపించగలరా అని ప్రశ్నించారు. తాము పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కొంత కాలం ఈ దుష్ప్రచారం ఆగిందన్నారు. అయితే తిరిగి ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో ఆ దుష్ప్రచారాన్ని మొదలు పెట్టారన్నారు. తన వ్యక్తిగత జీవితంపై తప్పుడు ప్రచారాలను సృష్టిస్తున్న వారిపై, వారి వెనకున్న వారిపై చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరామని తెలిపారు. నన్ను ప్రేమించే నా భర్తతో పాటు నా పిల్లలు, కుటుంబ సభ్యులు, మిత్రులందర్నీ ఎంతో బాధపెట్టే విషయం కావడంతో ధైర్యంగా ముందుకొచ్చి ఫిర్యాదు చేస్తున్నట్టు తెలిపారు. ఈ దుష్ప్రచారం వెనుక టీడీపీ హస్తం ఉన్నట్టు భావిస్తున్నామన్నారు. ఆ పార్టీకి పుకార్లు పుట్టించడం కొత్తేమీ కాదన్నారు. తనపై వస్తున్న ఆరోపణలను టీడీపీ నాయకులు ఖండించకపోవడాన్ని ఆమె తప్పుబట్టారు.

ఎంతో మంది మహిళల మీద కూడా ఇలాంటి దుష్ప్రచారాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియా, వెబ్‌సైట్లలో ఈ ప్రచారాలకు వీలు లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్న ఫిర్యాదుకు ప్రజాస్వామ్య వాదులు, నైతికత ఉన్న రాజకీయనాయకులు, జర్నలిస్టులు, మహిళలు మద్దతు పలకాలన్నారు.

సీసీఎస్‌కు కేసు బదలాయింపు


వైఎస్ షర్మిల ఫిర్యాదుకు స్పందించిన నగర పోలీస్ కమిషనర్ అంజనీకుమార్ కేసును సైబర్‌క్రైం పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు అదనపు డీసీపీ రఘువీర్ నేతృత్వంలో ప్రత్యేక బృందాలను రంగంలోకి దించి విచారణ చేపడుతున్నారు.

పని ప్రదేశాల్లో రైట్ టు సిట్

(మొదటిపేజీ తరువాయి)

స్వాంతన లభించింది. కొన్ని రోజులుగా అక్కడి మహిళా కార్మికులు తాము పనిచేస్తున్న చోట కనీస సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. దీంతో, కేరళ సర్కారు వీరి సమస్యలను నిపుణులతో అధ్యయనం చేయించింది. ఇందులో భాగంగానే గతేడాది డిసెంబర్‌లో 'కేరళ షాప్స్ అండ్ కమర్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ (సవరణలు) చట్టం, 2018' ను ఆమోదించింది. దీని ప్రకారం ప్రయివేటు దుకాణ సముదాయాలు, కమర్షియల్ కాంప్లెక్స్‌లలో పనిచేస్తున్న మహిళా కార్మికులకు పని ప్రదేశాలలో కూర్చునే హక్కును కల్పించారు. దీంతో, మహిళలకు గంటల తరబడి నిల్చునే తిప్పలు తప్పాయని ఏఎంటీయూ నాయకురాలు పలిథోడి అన్నారు. ఇదే అంశంపై కేరళ మత్స్య శాఖ మంత్రి జె. మెర్సీకుట్టీ అమ్మ మాట్లాడుతూ.. మహిళల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. ఈ చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత వస్త్ర దుకాణాల, ఇతర కమర్షియల్ కాంప్లెక్స్ యజమానులు.. తమ వద్ద పనిచేసే మహిళలకు కూర్చోవడానికి వీలుగా కుర్చీలను ఏర్పాటుచేయడం గమనార్హం.

నీరు గారుతున్న ఉపాధి





(మొదటిపేజీ తరువాయి)

ఆర్థిక సంవత్సరం ముగిసే మూడు నెలల ముందే ఖర్చయ్యాయి. అలాగే 11 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ఇప్పటికే నెగెటివ్ బ్యాలెన్స్ స్థితిలో ఉన్నాయి. ఎంఎన్‌ఆర్‌ఈజీఏపై ఆధారపడిన కార్మికుల గురించి ఆందోళన వ్యక్తం చేస్తూ దేశంలోని 90 మంది ఎంపీలతో పాటు మాజీ ఉన్నతాధికారులు, ప్రముఖ ఆర్థికవేత్తలు, కార్యకర్తలు, రైతు ఉద్యమాల నాయకులు వంటి 160 మంది ప్రధాని మోడీకి తమ సంతకాలతో కూడిన బహిరంగ లేఖను రాశారు.

'దేశంలోని ఉపాధి కల్పిస్తున్న ఈ ఏకైక చట్టం క్రమక్రమంగా నిర్లక్ష్యానికి గురవుతున్నది. పథకం బడ్జెట్ కేటాయింపుల్లో అక్రమ నిబంధనలు, చెల్లింపుల్లో తీవ్రజాప్యం, తక్కువ కూలీలు వంటి కారణాలతో ఇది అనుకున్న విధంగా ముందుకు వెళ్లడంలేదు' అంటూ ఆ లేఖలో వారు పేర్కొన్నారు. 'తక్షణ ప్రాధాన్యంగా ఎంఎన్‌ఆర్‌ఈజీఏ పథకాన్ని పటిష్టంగా తయారు చేయండి. ప్రస్తుత గ్రామీణ, వ్యవసాయ విపత్తులను పరిష్కరించడానికి తీసుకుంటున్న చర్యల్లో భాగంగా దీనిని కూడా అధికారికంగా గుర్తించాలి' అంటూ అందులో ప్రస్తావించారు. జనవరి 3 నుంచి రూ. 7000ల కోట్లను కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ విడుదల చేసింది. దేశవ్యాప్తంగా లక్షలాది గ్రామీణ ఉపాధి కార్మికుల జీవన స్థితిగతులను మెరుగుపరచడానికి భద్రత, బలాన్నిచ్చే విధంగా ఎంజీఎన్‌ఆర్‌ఈజీని రాజకీయ నిబద్ధతతో కృషి చేయాలని లేఖలో వారు పేర్కొన్నారు. ఈ లేఖపై సంతకాలు చేసినవారిలో పృధ్వీరాజ్ చౌహాన్, దిగ్విజయ్‌సింగ్, జిగ్నేశ్ మేవానీ, యోగేంద్ర యాదవ్, జయా బచ్చన్, హర్ష్ మందర్, స్వామి అగ్నివేశ్, అరుంధతీరాయ్, వాజాహత్ హబీబుల్లా, తీస్తా సెతల్వాడ్‌లు ఉన్నారు. లేఖలో ప్రధానంగా తొమ్మిది అంశాలను వారు లేవనెత్తారు. వాటిలో

- తేదీలతో కూడిన రసీదులను , తగిన బహిరంగ ఉపాధి పనులు కల్పించాలి.
- సకాలంలో తగిన నిధులు కేటాయిస్తే పేదలకు ఉన్న పని డిమాండ్ పరిష్కారమవుతుంది.
- రాష్ట్రాల చట్టబద్ధమైన కనీస వేతనలకు తక్కువ కాకుండా ఎంజీఎన్‌ఆర్‌ఈసీఏ కూలీలు కల్పించాలి.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేర్వేరుగా లెక్కింపులు చేయడంతో కార్మికుల వేతన చెల్లింపులు 15 రోజులు ఆలస్యంగా అవుతున్నాయి. అని ఆర్థిక సంస్థలను, చెల్లింపుల ఏజెన్సీలను జవాబుదారీగా చేస్తూ చట్టం కిందకు తీసుకురావాలి.
- ఆలస్యానికి చెల్లించే పరిహారపు రేటు చెల్లింపుల వేతన చట్టానికి అనుగుణంగా ఉండాలి.
- పనికి వేతన చెల్లింపుల్లో అన్ని ఆర్థిక, సాంకేతిక, పాలక అవరోధాలను నిరోధించాలి.
- ప్రతి గ్రామ పంచాయతీ అన్ని వేళల తప్పనిసరిగా ఒక లేబర్ ఇంటెన్సివ్ పబ్లిక్ వర్క్‌ను కలిగి ఉండాలి.
- ఉపాధి అమలుకు సంబంధించిన మొత్తం సమాచారాన్ని వెబ్‌సైట్, ఆఫ్‌లైన్‌లో బహిరంగపరచాలి. చట్టం నిబంధనలకు అనుగుణంగా ఎంఐఎస్ తప్పనిసరిగా ఉండాలి.
- ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ చట్టబద్ధమైన హక్కును గుర్తించిన అన్ని కరువుపీడిత జిల్లాల్లో 200ల రోజులకు పెంచాలి.

పల్లెకు చేరిన పట్నవాసం



(మొదటిపేజీ తరువాయి)

రోజులుగా నగరంలోని బస్సులు, రైళ్లన్నీ జనసంద్రంతో కిక్కిరిసిపోయాయి. సాధారణ రోజుల్లో హైదరాబాద్ రహదారులు నిత్యం వాహనాలతో సందడిగా కనిపించేవి. ప్రజలు తమ రోజువారీ పనుల్లో బిజీబిజీగా కనిపించేవారు. అలాంటిది నగర వాసులంతా పల్లెలకు తరలిపోవడంతో రెండు రోజులుగా రహదారులన్నీ బోసిపోతున్నాయి. దాదాపు హైదరాబాద్ ఖాళీ అవడంతో ప్రధాన రహదారులతో పాటు వీధులన్నీ నిర్మానుష్యంగా మారాయి. కోటికి పైగా జనాభా కలిగిన హైదరాబాద్ మహానగరంలో ప్రస్తుతం జనసందడి కొరవడింది. నగరంలో జీవించే వారంతా దాదాపుగా పల్లె ప్రాంతాల వారే కావడంతో పండుగకు తమ సొంతూళ్లకు వెళ్లారు.

విలీన 'కాటు'!

నవతెలంగాణ-మొఫిసిల్

పల్లెల్లో పంచాయతీ ఎన్నికల సందడి కనబడుతుండగా విలీన గ్రామాల్లో మాత్రం నిరాశ నిస్పృహలు వ్యక్తమవుతున్నాయి. ఒకవైపు పన్నుల భారం.. మరోవైపు ఉపాధి వెతలు వెరసి రెంటికీ చెడ్డ రేవడిలా మారింది వాటి పరిస్థితి. పర్యవేక్షించాల్సిన అధికారులూ అటువైపు కాలుమోపిన దాఖలాల్లేవు. దీంతో ఆ పంచాయతీల నిర్వహణ అస్తవ్యస్తంగా మారడమేగాక అభివృద్ధీ నిలిచిపోయింది. అయితే, కోర్టుల చుట్టూ తిరిగి స్టే తెచ్చుకున్న ప్రజలు ఈ నెల 21న కీలకం కానున్న హైకోర్టు తీర్పు పట్ల ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా నూతన మున్సిపాలిటీలు ఏర్పాటు చేసిన నేపథ్యంలో సమీపంలోని కొన్ని గ్రామాలను విలీనం చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ విలీనాన్ని అనేక గ్రామాలు వ్యతిరేకిస్తూ కోర్టు నుంచి స్టే కూడా తెచ్చుకున్నాయి. దీనిపై త్వరలో హైకోర్టు తుది తీర్పు కూడా రానుంది. అప్పటికే గ్రామపంచాయతీ ఎన్నికలకూ విలీన గ్రామాలు దూరమయ్యాయి. ఇంతవరకు బాగానే ఉన్నా.. ఆ గ్రామాల్లో పన్నుల భారం, ఉపాధి పనులు కొరవడి ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. పంచాయతీల నిర్వాహణా అస్తవ్యస్తంగా తయారైంది. యాదాద్రి మోత్కూరు మున్సిపాలిటీలో విలీనమైన బుజ్జిలాపురం గ్రామమే అందుకు ప్రత్యక్ష ఉదాహరణ. గ్రామాన్ని 'నవతెలంగాణ' సందర్శించగా పారిశుధ్యం, మంచినీటి సమస్య కొట్టొచ్చినట్టు కనిపించింది. వీధిలైట్ల ఏర్పాటూ అంతంత మాత్రంగానే ఉన్నది. మరోవైపు ఇంటి నిర్మాణ అనుమతులు మున్సిపాలిటీలుగా మారిన గ్రామాల్లో సుమారు 50 శాతం పెరిగాయి. హెచ్‌ఎండీఏ, వైటీడీఏ పరిధిలో ఉన్న చౌటుప్పల్, యాదగిరిగుట్టలో ఎల్‌ఆర్‌ఎస్, నాలా అనుమతుల భారం ఎక్కువైంది. గతంలో మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో వంద చదరపు గజాల స్థలంలో ఇల్లు నిర్మించేవారికి సుమారు రూ.30 వేల లోపు మాత్రమే ఖర్చయ్యేది. ఇప్పుడు మున్సిపాల్టీలోకి వచ్చిన తర్వాత రూ.లక్షకు మించి ఖర్చు అవుతోందని ఇండ్ల నిర్వాహకులు గగ్గోలు పెడుతున్నారు. 'పన్నులు గట్టిగానే వసూలు చేస్తున్నారు. కానీ అంతర్గత రోడ్లు, తాగునీరు, రహదారులు, సైడ్‌డ్రైన్లు, వీధిలైట్లు తదితర మౌలిక సౌకర్యాల్లో ఏ మాత్రమూ మార్పులు రాలేదు' అని ఖమ్మం జిల్లావాసులు వాపోతున్నారు.

జిల్లా	విలీన గ్రామాల సంఖ్య
రంగారెడ్డి	46
యాదాద్రిభువనగిరి	17
సూర్యాపేట	25
నల్లగొండ	04
మహబూబాబాద్	06
ఖమ్మం	17
నిజామాబాద్	12
కామారెడ్డి	14
సంగారెడ్డి	17
మెదక్	06
సిద్దిపేట	03
కరీంనగర్	14
రాజన్నసిరిసిల్ల	12
జగిత్యాల	02
పెద్దపల్లి	07
ఆదిలాబాద్	05
నిర్మల్	02
మంచిర్యాల	08
మహబూబ్‌నగర్	04
నాగర్‌కర్నూల్	20
జోగులాంబ గద్వాల	08
వనపర్తి	06
వికారాబాద్	09

వేలాది మంది ఉపాధికి దూరం..

మున్సిపాల్టీల్లో విలీనమైన ఒక్కో గ్రామంలో వేలాది మంది జాబ్ కార్డుదారులు ఉపాధి పనుల్లేక భవన నిర్మాణ, హమాలీ పనులకు వెళ్తున్నారు. ఇంకొందరు పట్టణాలూ, పక్కూళ్లవైపు చూస్తున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో ఉపాధి హామీ పనులు నిలిచిపోయాయి. 17 గ్రామాల్లో 12వేల మందికిపైగా కూలీలు పనులు కోల్పోయారు. పోచంపల్లి మండలం ముక్తాపురంలో కూలీలు ఆందోళనకు దిగితే కొంతమందికి హరితహారం మొక్కలకు నీళ్లుపోసే పని అప్పగించారు. వాటికి సంబంధించి 45 రోజుల పనిదినాల కూలీ డబ్బులు రావాల్సి ఉన్నది. సూర్యాపేటలో సుమారు 14 వేలు, ఖమ్మంరూరల్ మండలంలోని ఐదు పంచాయతీల్లో దాదాపు 11600, అర్బన్ మండల విలీన పంచాయతీల్లో 10,815 మంది జాబ్‌కార్డుదారులు పనుల్లేక దిక్కులు చూస్తున్నారు. వరంగల్ అర్బన్ జిల్లా వర్ధన్నపేట డిసి తండా పంచాయతీ పరిధిలో ఎనిమిది తండాల గిరిజనులు ఉపాధి హామీ పనులకు దూరమయ్యారు. దిక్కుతోచని స్థితిలో ప్రస్తుతం బజారు కూలీలుగా కొనసాగుతున్నారు. రంగారెడ్డి జిల్లాలో 46 గ్రామాల్లో ఉపాధి కరువై.. సుమారు 50 వేల వ్యవసాయ కార్మికులు వీధిన పడ్డారు.

జాబ్‌కార్డులు తొలగించారు.. : మోత్రిమేకల మాధవరావు (అల్లీపురం)

గతంలో జాబ్‌కార్డుల ద్వారాగా అనేక విధాలుగా పనులుండేవి. కానీ కార్పొరేషన్‌లో కలిపిన తరువాత ఉపాధి పనుల్లేకుండా పోయాయి. గ్రామంలో ఎవరికి పనులు కావాలన్నా అడ్డాల్లోకి వెళ్లి తాపీ పనులకు, భవననిర్మాణ పనులకు వెళ్లాల్సిందే. సౌకర్యాల్లేవు. తాగునీరు సక్రమంగా ఉండదు. పట్టించుకునే వారే లేరు.

రూ.200లకు రూ.2వేలు చెల్లిస్తున్నాం... : రావులపాటి వెంకటేశ్వర్లు (అల్లీపురం)

గతంలో రూ.రెండు వందలు మాత్రమే ఉన్న ఇంటిపన్ను ఇప్పుడు రూ. రెండు వేలకు పెరిగింది. పన్నులు పెంచారే తప్ప ఎక్కడా సౌకర్యాలు పెంచలేదు. ప్రజలకు అవసరం లేని విలీనం ఎందుకని అప్పుడే వద్దన్నా అధికారులు వినలేదు. పట్టుబట్టి విలీనం చేసి తఇబ్బందులకు గురిచేస్తున్నారు.

మున్సిపాలిటీలో కలపొద్దు : పెరుమండ్ల రాములు, అడ్లూర్ మాజీ సర్పంచి (కామారెడ్డి)

మా గ్రామాలను మున్సిపల్ పరిధిలో విలీనం చేయొద్దు. విలీనం చేస్తే ప్రజలపై అధిక పన్నుల భారం పడుతుంది. మా గ్రామంలో మెజార్టీ ప్రజానీకం పేదవారు. వారంతా ఉపాధికి దూరమయ్యే ప్రమాదముంది. ప్రభుత్వం విలీన ప్రతిపాదనలు విరమించుకోవాలి.

వెలివాడ ధ్వంసం అన్యాయం

- హెచ్‌సీయూ వీసీ అప్పారావును తొలగించాలి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని వెలివాడను ధ్వంసం చేయడం అన్యాయమని, ఈ చర్యలో పాలుపంచుకున్న వర్సిటీ అధికారులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసి వీసీ అప్పారావును విధుల నుంచి తొలగించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లిలో గల సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో రోహిత్ వేముల న్యాయ పోరాట సంఘీభావ కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. విరసం నేత ప్రొఫెసర్ కాశీం మాట్లాడుతూ..దళిత, బహుజనుల ఉద్యమాలకు ప్రేరణగా నిలుస్తున్న వెలివాడను కుట్రపూరితంగా తొలగించారని విమర్శించారు. జనవరి 17న రోహిత్ వేములను తలుచుకోకుండా ఉండేందుగానూ అతను ఏర్పాటు చేసిన వెలివాడను వర్సిటీ అధికారులు అబద్ధపు ఆరోపణలతో తొలగించారన్నారు. విద్యారులంతా ఐక్యమై వీసీ దుర్మార్గాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. టీవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మద్దిలేటి మాట్లాడుతూ..హెచ్‌సీయూలో దళిత విద్యార్థులపై అక్రమంగా కేసులు బనాయిస్తున్నారని విమర్శించారు. దళిత విద్యార్థులు స్వేచ్ఛగా చదువుకోకుండా, ఉన్నత స్థానాలకు అధిరోహించకుండా మనువు నిర్దేశించిన నియమాలను వీసీ అప్పారావు అమలు చేస్తున్నారని ఆరోపించారు. వీసీ అప్పారావును తొలగించినప్పుడే దళిత విద్యార్థులకు స్వేచ్ఛా, సమానత్వం దొరుకుతాయని, అందుకోసం పోరాటాన్ని ప్రారంభిస్తున్నామని తెలిపారు. ప్రొఫెసర్ విజయ్ మాట్లాడుతూ.. వెలివాడ ధ్వంసాన్ని వ్యతిరేకిస్తూ దళిత, ప్రజా సంఘాల వాళ్లు, మేధావులంతా దళిత విద్యార్థులకు మద్దతు తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో కెఎన్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు బండారు లక్ష్మయ్య, సీఎల్‌సీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.నారాయణరావు, ఓపీడీఆర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.నరసింహ్మయ్య, డీటీఎఫ్ రాష్ట్ర నాయకులు ఎమ్ఎన్ కిష్టప్ప, ఏఎస్‌ఏ నాయకులు డి.ప్రశాంత్, మున్నా, ప్రొఫెసర్ కేవై రత్నం, జనార్ధన్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు : లక్ష్మణ్


నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రజలకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కె లక్ష్మణ్ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈమేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ సోదరభావంతో జీవించాలని, అప్పుడే మనకు కూడా ఇతరులు మంచి చేసేలా ఆలోచిస్తారని పేర్కొన్నారు.


ఫ్రాన్స్‌లో ఆందోళనలు

- ఆర్థిక సంస్కరణలకు వ్యతిరేకంగా..

పారిస్ : ఫ్రాన్స్‌లో 'పసుపు జాకెట్' ఉద్యమం మళ్లీ ఉవ్వెత్తున లేచింది. నిరసనకారుల్ని అడ్డుకోవటం కోసం భద్రతాబలగాలు వాటర్ కెనాన్‌లను, భాష్పవాయువును ప్రయోగించారు. దీంతో ఉత్తర పారిస్‌లో పలుచోట్ల ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. ఆ దేశ అధ్యక్షుడు మేక్రాన్ అమలుజేస్తున్న ఆర్థిక సంస్కరణలకు వ్యతిరేకంగా ఆందోళనకారులు శని, ఆదివారాల్లో నిరసనలకు పిలుపిచ్చారు. ఉత్తర పారిస్‌లోని అనేక కూడళ్లలో భారీ బ్యానర్లు, ప్లకార్డులతో నిరసనలు చోటుచేసుకున్నాయి. ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనడమేగాక, శాంతియుతంగా తమ ఆందోళన వ్యక్తం చేశారు. నిరసనకారుల్ని అదుపుచేయటం కోసం మేక్రాన్ ప్రభుత్వం భారీ సంఖ్యలో భద్రతా బలగాల్ని రంగంలోకి దించింది. నిరసనల నేపథ్యంలో ఉత్తర పారిస్‌లోని చారిత్రాత్మక ప్రదేశాల్లో ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది.



రక్షణ మార్కెట్లో.. డస్సాల్ట్ కన్నా హెచ్‌ఏఎల్‌దే పైచేయి



న్యూఢిల్లీ: మేకిన్ ఇండియా అంటున్న మోడీ సర్కారు రక్షణ రంగంలో ఎన్నో సేవలనందించిన హెచ్‌ఏఎల్‌ను కాదని ఈ రంగంలో అనుభవమేలేని అనిల్ అంబానీ డిఫెన్స్ కంపెనీకి రాఫెల్ ఆఫ్‌సెట్ ఒప్పందాన్ని మోడీ సర్కారు కుదిర్చింది. ఆయారంగాల్లో ఎంతో అనుభవం గడించిన పలు ప్రభుత్వసంస్థలను నిర్వీర్యం చేయడం.. మేకిన్ ఇండియా లక్ష్యమా అనే అనుమానాలు తలెత్తుతున్నాయి. ఆశ్రితపెట్టుబడిదారులతో చేతులు కలిపి ప్రభుత్వసంస్థలను నష్టాల్లోకి నెట్టేసి అటుతర్వాత మూసివేతకు దారితీసే పరిస్థితులను సృష్టించేందుకు సర్కారు తెరతీస్తున్నదనే చర్చ నడుస్తున్నది. రాఫెల్ యుద్ధ విమానాల తయారీదారు ఫ్రెంచ్ కంపెనీ డస్సాల్ట్ ఏవియేషన్స్ ఘనమైనదని మోడీ సర్కారు చెబుతోంది. కానీ వాస్తవంలో డస్సాల్ట్ కన్నా హెచ్‌ఏఎల్ మెరుగైందని అమెరికా అధ్యయనం వెల్లడిస్తున్నది. ఈ అధ్యయనం పై అనుమానాలను బలపరుస్తున్నది.

రాఫెల్ యుద్ధ విమానాల కోసం ఒప్పందం కుదుర్చుకున్న ఫ్రెంచ్ కంపెనీ డస్సాల్ట్ కన్నా భారత ప్రభుత్వరంగ సంస్థ హిందుస్థాన్ ఎరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్‌ఏఎల్-హాల్) రక్షణరంగ మార్కెట్‌లో మెరుగైన స్థానంలో ఉన్నది. 2017లో అంతర్జాతీయ మార్కెట్లో యుద్ధ విమానాల తయారీ కంపెనీల స్థితి, డిఫెన్స్ లాభార్జనల గురించి చేసిన ఓ సర్వేలో ఈ మేరకు వెల్లడైంది. అమెరికాకు చెందిన డిఫెన్స్ న్యూస్ అనే సంస్థ చేపట్టిన ఈ సర్వేలో 2018లో ప్రపంచంలో 100 అత్యుత్తమ డిఫెన్స్ కంపెనీలలో హెచ్‌ఏఎల్ 38 స్థానాన్ని దక్కించుకోగా, ఫ్రెంచ్ విమానాల తయారీ కంపెనీ డస్సాల్ట్ 44 స్థానంలో నిలిచింది. హెచ్‌ఏఎల్ అంతకు క్రితం ఏడాది మూడు స్థానాలు(35వ ర్యాంక్) మెరుగ్గా ఉండగా, డస్సాల్ట్ ఏడుస్థానాలను మెరుగుపరుచుకోవడం గమనార్హం. కాగా, ప్రస్తుతం హెచ్‌ఏఎల్ సంస్థ ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటున్నది. మోడీ సర్కారు తీసుకుంటున్న నిర్ణయాల వల్లే సంస్థ ఆర్థికంగా వెనుకబడుతున్నదని సంస్థ ఉద్యోగులు సహా పలువురు నిపుణులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా, డస్సాల్ట్ ఏవియేషన్ ఆర్థికంగా మెరుగుపడటంలో రాఫెల్ ఒప్పందం ప్రధాన పాత్ర పోషించినట్టు తెలుస్తున్నది.

మోడీ.. రాఫెల్ ఆర్డర్:

2017లో హెచ్‌ఏఎల్ డిఫెన్స్ రాబడి సుమారు రూ. 19.24వేల కోట్లు ఉండగా, 2016లో రూ. 17.81వేల కోట్లు. హెచ్‌ఏఎల్ ఆర్జించిన రాబడిలో 96శాతం రక్షణ రంగం నుంచి సంపాదించినవే. డస్సాల్ట్ కంపెనీ డిఫెన్స్ పరికరాలు, విమానాలతోపాటు పౌర విమానాలనూ తయారుచేస్తుంటుంది. 2017లో ఈ కంపెనీ ఆర్జించిన మొత్తం సుమారు రూ. 38.44వేల కోట్లలో డిఫెన్స్ సంబంధిత ఆదాయం (39శాతం) సుమారు 15వేల కోట్లు. కాగా, 2016లో ఒక్క ఏడాదిలోనే డిఫెన్స్ ఆదాయంలో 57శాతం పెరిగింది. 2016లో యుద్ధ విమానాల ఒప్పందాలే ఈ కంపెనీని ఆర్థిక సమస్యలనుంచి ఒడ్డునపడేశాయి. 2016లోనే 36 రాఫెల్ యుద్ధ విమానాల కోసం రూ. 58వేల కోట్ల ఆర్డరును మోడీ సర్కారు ఇవ్వడం గమనార్హం. కాగా, 2016 చివరి వరకు సుమారు రూ. 20వేల కోట్లు డస్సాల్ట్‌కు భారత్ ప్రభుత్వం చెల్లించినట్టు రక్షణ శాఖ వర్గాలు తెలిపాయి.



హెచ్‌ఏఎల్ పై బీజేపీ సర్కారు సవతి తల్లి ప్రేమ:

కాగా, రాఫెల్ ఒప్పందంలో.. ప్రభుత్వ రంగ సంస్థ హెచ్‌ఏఎల్‌ను పక్కన పెట్టి అనుభవమేలేని అనిల్ అంబానీ కంపెనీకి ఆఫ్‌సెట్ కాంట్రాక్టు కుదర్చడంపై విపక్షాలు పెద్దఎత్తున విమర్శలు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై ప్రధాని మోడీ ఇప్పటివరకూ నిర్దిష్టమైన కారణం చూపకపోవడంతో ఒప్పందంలో అవినీతి చోటుచేసుకున్నదా? అనే అనుమానాలను బలపరుస్తున్నాయి. మోడీ సర్కారు ప్రభుత్వ సంస్థలను నిర్వీర్యం చేసే కుట్ర చేస్తున్నదనీ, అదే సమయంలో అంబానీలాంటి ఆశ్రిత కార్పొరేట్ మిత్రులకు లబ్ధి చేకూర్చేలా నిర్ణయాలు తీసుకుంటోందని విమర్శిస్తున్నాయి.

డిఫెన్స్ ఆర్జనలో ఘనమైన రికార్డు ఉన్న హెచ్‌ఏఎల్ ప్రస్తుతం ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. సొంత ఉద్యోగులకు వేతనాలు చెల్లించేందుకూ తిప్పలుపడుతోంది. ప్రభుత్వ సంస్థల వృద్ధికి పాటుపడకుండా ఇట్లాంటి గడ్డు పరిస్థితుల్లో హెచ్‌ఏఎల్‌కు చెల్లించాల్సిన రూ. 14వేల కోట్లను అందించడంలోనూ జాప్యం వహించడం.. సంస్థపై మోడీ సర్కారుకు ఉన్న సవతి తల్లి ప్రేమను వెల్లడిస్తున్నది. అంతేకాదు, షేర్ బైబ్యాక్‌లాంటి విధానాలతో హెచ్‌ఏఎల్ నుంచి క్యాష్‌ను ఖాళీ చేస్తున్నది. 2015 నుంచి షేర్‌బైబ్యాక్ ద్వారా రూ. 6,393 కోట్లను హెచ్‌ఏఎల్ ప్రభుత్వానికి చెల్లించింది. 2003-04 నుంచి 2017-18 మధ్య డివిడెండ్ రూపంలో రూ. 9వేల కోట్లను చెల్లించింది.

సెన్సెక్స్ ▼156	నిఫ్టీ ▼ 57	డాలరుకు రూపాయి విలువ	బంగారం(10.గ్రా)	వెండి (కేజీ)	కోడిగుడ్లు (వందకి)			
35,853	10,737	70.93	రూ. 32,110	రూ. 39,259	హైదరాబాద్	433	విజయవాడ	441
					ఒక్కగుడ్డుకు	4.70	చెన్నై	455
					వరంగల్	433	ముంబయి	484






బుల్లితెర వీక్షకులకు ట్రాయ్ భారీ ఊరట!

- ఏవైనా వంద ఛానెళ్లు రూ.153.40 లకే..
- ఒక్కో చానెల్ గరిష్ట ధర 19కి పరిమితం



న్యూఢిల్లీ: ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత నేపథ్యంలో పెయిడ్ కేబుల్ టీవీ ప్రసారాల విషయంలో టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) దిగి వచ్చింది. ఇబ్బడి ముబ్బడిగా పెరిగిన కేబుల్ ఛానెళ్ల ధరలను నియంత్రిస్తూ తాజాగా ప్రకటన చేసింది. దీనికి తోడు బుల్లితెర ప్రేక్షకులకు శుభవార్త తెలిపింది. వీక్షకులు 100 పే లేదా ఫ్రీ ఛానళ్లను రూ.153.40కే పొందవచ్చని ఉత్తర్వులు జారీ చేసింది. జీఎస్‌టీతో కలిపి ఈ మొత్తాన్ని చెల్లించాలని సూచించింది. కేబుల్/డీటీహెచ్‌లలో 100 ఛానళ్లను వీక్షించవచ్చన్న ట్రాయ్.. జనవరి 31లోపు వీక్షకులు 100 ఛానళ్లను ఎంపిక చేసుకోవాలని తెలిపింది. ఫిబ్రవరి 1 నుంచి కొత్త విధానం అమల్లోకి వస్తుందని, ఈ ప్యాక్‌లో హెచ్‌డీ ఛానళ్లు లభించవని స్పష్టం చేసింది. అయితే, రెండు సాధారణ ఛానళ్లకు బదులు ఒక హెచ్‌డీ ఛానల్‌ను ఎంపిక చేసుకోవచ్చని కొన్ని సంస్థలు ప్రకటిస్తున్నాయి. తమ సర్వీసు ప్రొవైడర్ల నుంచి వినియోగదారులు మరింత సమాచారాన్ని తెలుసుకోవాలని ట్రాయ్ సూచించింది. కాగా, ఒక ఛానల్ గరిష్ట ధరను రూ.19గా నిర్ణయించింది. దీనికి సంబంధించి ఏవైనా సమాచారం కావాల్సిన వారు ట్రాయ్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సెల్‌కు ఫోన్ చేసి కనుక్కోవాలని ఆ సంస్థ సూచించింది.

త్వరలోనే విప్రో బోనస్ ప్రకటన




న్యూఢిల్లీ: విప్రో సంస్థ నుంచి త్వరలోనే బోనస్ ప్రకటన వెలువడనుంది. ఇందుకు గాను విప్రో బోర్డు గురు, శుక్రవారాల్లో (17, 18 తేదీల్లో) సమావేశం కానుంది. దీనికి సంబంధించి విప్రో సంస్థ మార్కెట్లకు సమర్పించిన సమాచారంలో వెల్లడించింది. డిసెంబరుతో ముగిసిన త్రైమాసికానికి సంబంధించిన ఏకీకృత, స్టాండ్ ఎలోన్ ఫలితాలను సమీక్షించి వెల్లడించడంతో పాటు, మధ్యంతర డివిడెండ్ ఎంత మేరకు చెల్లించాలన్న విషయాన్ని విప్రో బోర్డు సమీక్షించనుందని సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. దీనికి అదనంగా బోనస్ షేర్లను జారీ చేసే విషయమై కూడా బోర్డు ఒక నిర్ణయం తీసుకొని అధికారికంగా వెల్లడించే అవకావం ఉన్నట్టుగా విప్రో వెల్లడించింది. ప్రధానంగా ఐటీ వ్యాపారం నుంచి అధాయాన్ని ఆర్జించే విప్రో సంస్థకు ఫలితాలపై సర్వత్రా ఆసక్తి నెలకొని ఉంది. ఈ సంస్థ ప్రధాన పోటీ సంస్థలైన ఇన్ఫోసిస్ శుక్రవారం తన ఆర్థిక ఫలితాలను వెల్లడిస్తూ తమ నికర లాభం దాదాపు 30 శాతం మేర కుంగి రూ.3,610 కోట్లకు పడిపోయినట్టుగా వెల్లడించింది. మరోవైపు ఇంకో ఐటీ దిగ్గజ సంస్థ టాటా కన్సెల్టెన్సీ సర్వీసెస్ 24.1 శాతం వృద్ధితో రూ.8,105 కోట్ల లాభాన్ని ప్రకటించింది. ఈ నేపథ్యంలో విప్రో ఎలాంటి ఫలితాలను అందిస్తుందోనని మార్కెట్ వర్గాలు ఆశగా ఎదురు చూస్తున్నాయి.

పీఎస్‌బీల్లో ప్రభుత్వ వాటాకు ఎసరు!

52 శాతానికి తగ్గించాలని సర్కారు సూచన

- 'కార్పొరేట్' విధానాల్లో భాగమేనని వివరణ..
- విక్రయంపై పూర్తి అధికారాలు బ్యాంక్‌లకు..
- చాలా బ్యాంకుల్లో తగ్గిపోనున్న కేంద్రం వాటా..
- మార్కెట్ల మార్గంలో ప్రయివేటు చేతుల్లోకి..
- ఖజానాకు తగ్గిపోనున్న డివిడెండ్ ఆదాయం
- ఇక ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల విలీనాలు



న్యూఢిల్లీ: దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్న ప్రభుత్వ రంగ బ్యాంక్‌లను (పీఎస్‌బీ) నిర్వీర్యం చేసేలా ప్రభుత్వం అడుగులు వేస్తున్నట్టుగా కనిపిస్తోంది. దేశ వ్యాప్తంగా ఎంతటి వ్యతిరేకత ఎదురైనప్పటికీ బ్యాంకుల విలీనాన్ని వేగంగా ముందుకు తీసుకుపోతున్న సర్కారు.. తాజాగా ఈ దిశగా మరో ఎత్తుగడ వేస్తున్నట్టుగా కనిపిస్తోంది. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఉన్న సర్కారు వాటాను క్రమంగా తగ్గించాలని కేంద్రం బ్యాంకులకు సూచించింది. మేటి కార్పొరేట్ విధానాలను అమలు చేసే క్రమంలో భాగంగానే ప్రభుత్వపు ఈక్విటీని 52 శాతానికి తగ్గించుకోవాలని కోరింది. పీఎస్‌బీలో ప్రభుత్వం ప్రధాన వాటాదారుగా ఉండాలని తాము కోరుకుంటున్నామని.. అయితే కార్పొరేట్ విధానాలు చెబుతున్నట్టుగా ఆయా సంస్థలో సర్కారు వాటా తొలిదశలో 52 శాతానికి తగ్గించుకోవాలని తాము బ్యాంకులకు సూచించినట్టుగా ఆర్థిక సేవల శాఖ కార్యదర్శి రాజీవ్ కుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించి బ్యాంకులకు పూర్తి అనుమతులను, అధికారాలను జారీ చేసినట్టుగా ఆయన వివరించారు. మార్కెట్లో పరిస్థితులు ఎప్పుడు అనువుగా ఉంటే అప్పుడు.. ఈ దిశగా తగిన చర్యలు తీసుకోవాలని తాము పీఎస్బీలకు సూచించినట్టుగా ఆయన తెలిపారు. దీంతో చాలా బ్యాంకుల్లో ప్రస్తుతం ప్రభుత్వం ఆధీనంలో ఉన్న వాటా.. క్రమంగా మార్కెట్ల ద్వారా ప్రయివేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోనుంది. ప్రభుత్వ వాటా విక్రయం వల్ల మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ సూచిస్తున్నట్టుగా పీఎస్‌బీల్లో దాదాపు 25% వాటా మార్కెట్ శక్తుల ఆధీనంలోకి రానుందని రాజీవ్ కుమార్ తెలిపారు. గణాంకాల ప్రకారం కొన్ని ప్రభుత్వ రంగ బ్యాంకులలో సర్కారు దాదాపు 75 శాతం వాటాను కలిగి ఉంది. ప్రభుత్వ వాటాను తగ్గించుకోవడం వల్ల బ్యాంకులు ప్రూడెన్షియల్ లెండింగ్ నిబంధనల మేరకు విరివిగా రుణాల వితరణ జరిపేందుకు వీలు పడుతుందని ప్రభుత్వం కొత్త ఈక్వేషన్ చెబుతోంది. బ్యాంకుల్లో వాటా తగ్గించుకోవడం వల్ల ప్రభుత్వానికి బ్యాంకింగ్ రంగం నుంచి రావాల్సిన డివిడెండ్ ఆదాయం గణనీయంగా తగ్గిపోయి అభివృద్ధి పథకాలకు విఘాతం కలిగే ప్రమాదం కనిపిస్తోంది.

ఎస్‌బీఐ తొలి అడుగు..

సర్కారు అదేశాల మేరకు దేశంలో అతిపెద్ద బ్యాంకింగ్ సంస్థ భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ) ఇప్పటికే ఈ దిశగా కార్యాచరణను మొదలు పెట్టింది. అర్హత కలిగిన సంస్థాగత ప్లేస్‌మెంట్ (క్విప్) ద్వారా దాదాపు రూ.20000 కోట్ల విలువైన షేర్లను విక్రయించేందుకు గాను ఎస్‌బీఐ చర్యలను ప్రారంభించింది. దీంతో ఎస్‌బీఐలో ప్రభుత్వపు వాటా 58.53 శాతానికి దిగిరానుంది. క్విప్ ద్వారా నిధులను సమీకరించి వ్యాపారాభివృద్ధిని చేపట్టేందుకు గాను గత నెలలో వాటాదారులు ఎస్‌బీఐ ప్రతిపాదనకు పచ్చజెండా ఊపారు. మిగతా బ్యాంకులు కూడా మార్కెట్‌లోని పరిస్థితుల మేరకు వివిధ మార్గాల ద్వారా ప్రభుత్వ వాటాను విక్రయించేందుకు గాను ఇప్పటికే సన్నద్ధమవతున్నట్టుగా సమాచారం. దీనికి కొనసాగింపుగా సిండికేట్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, ఓరియెంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ తదితర బ్యాంకులు ఎంప్లాయిస్ షేర్ పర్చేజ్ స్కీమ్‌ను (ఈఎస్‌పీఎస్) బాటను ఎంచుకున్నాయి.

ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల విలీనం షురూ..!

ప్రభుత్వ రంగ వాణిజ్య బ్యాంకుల విలీనంతో పాటు మోడీ సర్కారు ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులను (ఆర్‌ఆర్‌బీ) కూడా విలీనం చేసే ప్రక్రియను మొదలు పెట్టినట్టు ఆర్థిక సేవల శాఖ కార్యదర్శి రాజీవ్ కుమార్ తెలిపారు. గ్రామీణ భారతావనికి మెరుగైన సేవలను అందించే ఉద్దేశంతోనే తాము ఈ ప్రక్రియలో దూకుడుగా ముందుకు సాగుతున్నట్టుగా రాజీవ్ కుమార్ తెలిపారు. తాజాగా మోడీ ప్రభుత్వం పంజాబ్ గ్రామీణ్ బ్యాంక్, మాల్వా గ్రామీణ్ బ్యాంక్, సట్లేజ్ గ్రామీణ్ బ్యాంక్‌ల విలీనం చేసింది. జనవరి నుంచి విలీనం చేసిన బ్యాంక్ సేవలను మొదలు పెట్టినట్టుగా ఆయన తెలిపారు. గ్రామీణ బ్యాంకుల స్పాన్సర్డ్ బ్యాంక్‌లతో చర్చలు జరిపిన తరువాతే ఆయా బ్యాంకులు అందిస్తున్న ప్రాంతాలు వాటి ఆసక్తి మేరకే ఈ విలీనం ప్రక్రియను చేపట్టినట్టగా ఆయన వివరించారు. వీటితో పాటు కొన్నిచోట్ల పంజాబ్ గ్రామీణ్ బ్యాంక్ (పీఎన్‌బీ), ఉత్తర్ బీహార్ బ్యాంక్ (యూకో బ్యాంక్) రెంటిని మధ్య బిహార్ గ్రామీణ్ బ్యాంక్‌లో (పీఎన్‌బీ) విలీనం జరిపినట్టుగా ఆయన తెలిపారు. ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల్లో కేంద్ర ప్రభుత్వ 50 శాతం వాటాను, ప్రయోజిత బ్యాంకులు 35 శాతం వాటాను, 15 శాతం వాటాను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు కలిగి ఉంటాయి. గ్రామీణ ప్రాంతాల వారికి సేవలందించేందుకు పని చేస్తున్న ఆర్‌ఆర్‌బీల విలీనం కారణంగా.. చాలా ప్రాంతాల్లో బ్యాంకు శాఖలు మూతపడి.. బ్యాంకింగ్ సేవలకు విఘాతం కలిగే ప్రమాదం ఉంది. ఈ ప్రక్రియను సర్కారు మరింత ముందుకు తీసుకుపోతే పేద గ్రామీణ ప్రజలకు విరివిగా రుణాలు లభించడం కూడా భారంగా మారే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు.

జెట్‌ను ఆదుకోనున్న ఎతిహాద్



లండన్: దేశంలోని రెండో అతిపెద్ద విమానయాన సంస్థ జెట్ ఎయిర్‌వేస్‌ను ఆర్థికంగా నిలబెట్టేందుకు గాను ఆ సంస్థ ప్రధాన భాగస్వామి ఎతిహాద్ ముందుకు వచ్చింది. కష్టాల్లో ఉన్న జెట్ ఎయిర్‌వేస్‌ను ఆదుకునేందుకు ఎతిహాద్ కీలక చర్యలు చేపట్టింది. జెట్ ఎయిర్‌వేస్‌లో తన వాటాను 49 శాతానికి పెంచుకోవాలని ఎతిహాద్ ఎయిర్‌వేస్ పీజేఎస్‌సీ నిర్ణయించినట్టుగా సమాచారం. ప్రస్తుతం ఎతిహాద్‌కు మొత్తం 24 శాతం వాటాలు ఉన్నాయి. ఇందుకు గాను సంస్థ చైర్మెన్ నరేష్ గోయెల్ సంస్థలో తన కీలక వాటాలను విక్రయించనున్నారని తెలుస్తోంది. ప్రస్తుతం జెట్ ఎయిర్‌వేస్‌లో నరేష్ గోయెల్‌కు 51 శాతం మేర వాటా ఉంది. తాజా డీల్ అనంతరం సంస్థలో గోయెల్ ఆయన వాటా 20 శాతం కంటే దిగువకు చేరనుంది. దీంతోపాటు ఆయనకు 10 శాతం ఓటింగ్ హక్కులు లభించనున్నాయని అభిజ్ఞవర్గాలు వెల్లడించిన సమాచారం మేరకు మీడియా రిపోర్ట్ ద్వారా తెలుస్తోంది. ఈ పరిణామంపై ఇరువర్గాల నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెల్లడి కాలేదు. ఈ వార్తల నేపథ్యంలో మరోపక్క మార్కెట్లో జెట్ ఎయిర్‌వేస్ షేర్లు దాదాపు 19 శాతం లాభపడ్డాయి. నవంబర్ 15 నుంచి ఇప్పటి వరకు ఈ షేర్ కౌంటర్‌లో ఇదే అతిపెద్ద లాభం కావడం గమనార్హం. దేశంలో రెండో అతిపెద్ద ఎయిర్‌లైనర్‌గా పేరొందిన జెట్ ఎయిర్‌వేస్ గత 11ఏళ్లలో 9 సంవత్సరాలు నష్టాలనే చవిచూసింది. భారత్‌కు చెందిన ఎయిర్‌లైన్స్ సంస్థలో విదేశీ సంస్థలు 49 శాతం మాత్రమే పెట్టుబడి పెట్టే అవకాశం ఉంది. దీంతో ఎతిహాద్ ఆమేరకు వాటాలను కొనుగోలు చేయాలని నిర్ణయించినట్టుగా సమాచారం.

ఓలాలో సచిన్ బన్సాల్ పెట్టుబడులు..



బెంగళూరు: ఫ్లిప్‌కార్ట్ సహ వ్యవస్థాపకుడు సచిన్ బన్సాల్ 21 మిలియన్ డాలర్లను (దాదాపు రూ.650 కోట్లు) వెచ్చించి క్యాబ్ సర్వీసుల దిగ్గజ సంస్థ ఓలాలో వాటాలను కొనుగోలు చేశారు. ఫ్లిప్‌కార్టులోని తన వాటాలను వాల్‌మార్ట్‌కు విక్రయించి సంస్థ నుంచి బయటకు వచ్చాక సచిన్ బన్సాల్ పెట్టిన తొలి పెట్టుబడి ఇదే కావడం విశేషం. ఒక్కో షేరుకు రూ.21,250ల చొప్పున చెల్లించి ఓలాలో సచిన్ దాదాపు 70,588 జే ప్రిఫరెన్షియల్ షేర్లను కొనుగోలు చేసినట్టుగా సమాచారం. రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ వద్ద సమర్పించిన పత్రాల్లో ఈ విషయాన్ని ఆయన వెల్లడించారు. బన్సల్ మొత్తం 150 మిలియన్ డాలర్లు ఓలాలో పెట్టుబడి పెట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇప్పటి వరకు ఓలా మార్కెట్ విలువ 5.7 బిలియన్ డాలర్లుగా అంచనా వేశారు.

దొంగలున్నారు జాగ్రత్త

- ఈ మూడు రోజులు గస్తీని విస్తృతం చేయండి
- కాలనీలు, అపార్ట్‌మెంట్‌ల వద్ద నిఘా పెంచండి: సీపీలు, జిల్లాల ఎస్పీలకు డీజీపీ ఆదేశాలు

నవ తెలంగాణ- ప్రత్యేక ప్రతినిధి

'సంక్రాంతి పండుగ సెలవుల్లో అనేక మంది తమ ఇండ్లకు తాళాలు వేసి ఊర్లకు వెళ్లారు. దీనిని ఆసరాగా చేసుకుని దొంగతనాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. జాగ్రత్తగా ఉండాలంటూ' నగర కమిషనర్లు, జిల్లాల ఎస్పీలను డీజీపీ హెడ్‌క్వార్టర్స్ నుంచి ఆదేశాలు వెళ్లాయి. పండుగకు వరుసబెట్టి సెలవులు రావడంతో శనివారం నుంచే హైదరాబాద్‌తో పాటు పలు పట్టణాల ప్రజలు తమ గ్రామాలకు బయలుదేరి వెళ్లారు. ఈ నేపథ్యంలో పలు కాలనీలు, బస్తీలు, అపార్ట్‌మెంట్‌లలో అనేక ఇండ్లకు తాళాలు వేసి ఉండటంతో దీనిని ఆసరగా చేసుకుని దొంగలు రెచ్చిపోయే ప్రమాదం ఉన్నదని పోలీసు ఉన్నతాధికారులు అనుమానిస్తున్నారు. ముఖ్యంగా దూరంగా విసిరేసినట్టు ఉన్న ఇండ్లు, అపార్ట్‌మెంట్‌లు, పగటి వేళ సైతం నిర్మానుష్యంగా ఉండే కాలనీలను దొంగలు టార్గెట్ చేసే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు. ఇలాంటి వాతావరణాన్ని ఎక్కువగా సద్వినియోగం చేసుకునే చెడ్డీ గ్యాంగ్‌తో పాటు ఇతర అంతర్‌రాష్ట్ర, అంతర్ జిల్లా దొంగలు కార్యకలాపాలు పెరిగే అవకాశాలు ఉన్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు. గతంలో ఇలాంటి ఘటనలు అనేకం చోటు చేసుకున్న కారణంగా ఈ మారు వాటికి అవకాశాలు ఇవ్వకుండా తగిన ముందస్తు చర్యలు తీసుకోవాలని నగర సీపీలు, జిల్లాల ఎస్పీలకు డీజీపీ హెడ్‌క్వార్టర్స్ నుంచి ఆదేశాలు వెళ్లినట్టు తెలిసింది. రాత్రివేళతో పాటు పగలు సమయంలోనూ పోలీసులు తమ గస్తీని విస్తృతం చేయాలని ఆదేశించినట్టు సమాచారం. అలాగే విసిరేసినట్టుగా ఉండే ఇండ్ల వద్ద స్థానికంగా గుర్ఖాలు అప్రమత్తంగా ఉండేలా అలర్ట్ చేయాలని కోరినట్టు తెలిసింది. ఈ మేరకు సంబంధిత నగర సీపీలు, జిల్లాల ఎస్పీలు తమ పరిధిలోని పోలీసు స్టేషన్‌లను అలర్ట్ చేశారు. ముఖ్యంగా క్రైమ్ విభాగానికి చెందిన పోలీసులు ఈ మూడు రోజుల పాటు మరింత అప్రమత్తంగా ఉండాలని, అంతర్‌రాష్ట్ర, అంతర్ జిల్లా దొంగల ముఠాల కదలికలపై కన్నేసి ఉంచాలని ఆదేశించారు. రాత్రి వేళ అనుమానితులు ఎవరైనా కనిపిస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని ఈ సందర్భంగా ఆయా కాలనీలు, అపార్ట్‌మెంట్‌ల వాసులకు సైతం స్థానిక పోలీసులు కలిసి విజ్ఞప్తి చేస్తున్నారు.

చాంగె-4 చంద్రగ్రహ యాత్ర గ్రాండ్ సక్సెస్

- చంద్రశిలలపై చైనా రోవర్ దృష్టి

బీజింగ్: చంద్రగ్రహంపైకి తాము ప్రయోగించిన చాంగె-4 రోదసీ నౌక చంద్రునికి ఆవలివైపు పరిశోధనలకు తెరతీయటం ద్వారా ఈ ప్రయోగం సంపూర్ణ విజయం సాధించిందని చైనా ప్రకటించింది. ఈ ఏడాది చివరిలో ప్రయోగించనున్న చాంగె-5 రోదసీ నౌక ద్వారా చంద్ర శిలలను సేకరించి అక్కడి వాతావరణ పరిస్థితులపై పరిశోధనలు కొనసాగిస్తామని చైనా నేషనల్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ వెల్లడించింది. చాంగే-4 రోదసీనౌక చంద్రుని ఆవలివైపు ఈ నెల 3వ తేదీన లాండింగ్ కావటంతో పాటు చంద్రుడి అవతలి వైపు సన్నిహిత ఛాయాచిత్రాలను కూడా భూమికి పంపింది. ఈ ప్రయోగం సంపూర్ణ విజయం సాధించటం పట్ల హర్షం వ్యక్తం చేసిన చైనా నేషనల్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ రోదసికి సంబంధించిన గొప్ప రహస్యాన్ని ఛేదించామని, చంద్రునికి ఆవలివైపు పరిశోధనలకు ప్రపంచంలోనే తొలిసారిగా తెరతీయటం దేశ రోదసీ పరిశోధనల్లో తాము సాధించిన ప్రధాన విజయమని ఒక ప్రకటనలో పేర్కొంది. రోదసీ పరిశోధనలతో పాటు చంద్రగ్రహ ఉపరితలంపై ఖనిజవనరుల అన్వేషణ, న్యూట్రాన్, ఇతర తటస్త అణువుల రేడియేషన్ లెక్కింపు, చంద్రగ్రహ ఆవలివైపు వాతావరణ రహస్యాల ఛేదన వంటి అంశాలను చాంగె-4 ప్రయోగ లక్ష్యాలుగా నిర్ణయించారు. ఇక ఈ ఏడాది ప్రయోగించనున చాంగె-5 రోదసీ నౌక ద్వారా చంద్రుని ఆవలివైపు ఉపరితలం నుండి చంద్రశిలలను సేకరిస్తామని స్పేస్ అడ్మినిస్ట్రేషన్ డిప్యూటీ హెడ్ వు యాన్‌హువా మీడియాకు చెప్పారు. చాంగె-5 ప్రయోగం ఈ ఏడాది చివరిలో జరగవచ్చని ఆయన వివరించారు. ఈ ప్రయోగం ద్వారా చంద్రుని దక్షిణ ధ్రువ పరిశోధనలకు మరిన్ని రోదసీ నౌకలను పంపుతామని, ఇవన్నీ చంద్రుని ఆవలివైపు సేకరించిన చంద్రశిలలతో తిరిగి వస్తాయని వు చెప్పారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ సీటు చాలా హాటు

- పీఆర్టీయూ, టీఎస్‌యూటీఎఫ్, టీపీటీఎఫ్, ఎస్టీయూ, టీపీఆర్టీయూ, టీపీటీయూ, టీటీఎఫ్ అభ్యర్థుల మధ్యే పోటీ
- ఊపందుకున్న ఎన్నికల ప్రచారం
- ఫిబ్రవరిలో నోటిఫికేషన్ విడుదల

బరిలోకి దిగుతున్న సిట్టింగ్‌లు








నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు రంగం సిద్ధమవుతున్నది. రాష్ట్రంలో కరీంనగర్-నిజామాబాద్-మెదక్-ఆదిలాబాద్ ఉపాధ్యాయ నియోజకవర్గం, నల్లగొండ-వరంగల్-ఖమ్మం ఉపాధ్యాయ నియోజకవర్గం రెండు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ సీట్లు మార్చిలో ఖాళీ అవుతున్నాయి. ఫిబ్రవరిలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశమున్నది. దీంతో ఇప్పుడు అందరి దృష్టి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలపై పడింది. కరీంనగర్ ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి శాసనమండలి చీఫ్‌విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గం ఎమ్మెల్సీగా పూల రవీందర్ ఉన్నారు. ఆయా నియోజకవర్గాల నుంచి వారిద్దరూ మళ్లీ బరిలో నిలుస్తున్నారు. ఇప్పటికే పీఆర్టీయూటీఎస్ నుంచి నల్లగొండ నుంచి పూల రవీందర్, కరీంనగర్ నుంచి రఘోత్తంరెడ్డి పోటీ చేస్తారని ప్రకటించింది. ఇంకోవైపు పీఆర్టీయూ తెలంగాణ నుంచి కరీంనగర్ ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి పాతూరి సుధాకర్‌రెడ్డి పోటీ చేస్తారని అనధికారికంగా వెల్లడించింది. ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు నుంచి గ్రీన్‌సిగ్నల్ రావాల్సి ఉందనీ, వచ్చాకే అధికారికంగా ప్రకటిస్తామనీ పీఆర్టీయూ తెలంగాణ నాయకులు చెబుతున్నారు. నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గంలో పోటీపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని అంటున్నారు. అయితే ముఖ్యమంత్రి కేసీఆర్ నల్లగొండలో పూల రవీందర్‌కు, కరీంనగర్‌లో పాతూరి సుధాకర్‌రెడ్డికి మద్దతు ఇవ్వాలని కోరితే తాము పూల రవీందర్‌ను బలపరుస్తామని చెప్తున్నారు. ఇదే జరిగితే పీఆర్టీయూ నుంచి కరీంనగర్ నుంచి పోటీ చేస్తారని ప్రకటించిన రఘోత్తంరెడ్డి బరి నుంచి తప్పుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

ప్రచారంలో ముందుకెళ్తున్న అభ్యర్థులు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా టీఎస్‌యూటీఎఫ్, టీపీటీఎఫ్, ఎస్టీయూ, టీపీటీయూ, టీటీఎఫ్ తరఫున పోటీ చేసే అభ్యర్థులను ప్రకటించాయి. నల్లగొండ-వరంగల్-ఖమ్మం ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి టీఎస్‌యూటీఎఫ్ అభ్యర్థిగా అలుగుబెల్లి నర్సిరెడ్డి పోటీ చేస్తున్నారు. టీఎస్‌యూటీఎఫ్ అభ్యర్థి నర్సిరెడ్డికి ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ)లో భాగస్వామ్య సంఘాలైన టీపీటీఎఫ్‌తోపాటు ఇతర ఉపాధ్యాయ సంఘాలు మద్దతు ప్రకటించాయి. నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి టీపీటీయూ నుంచి గురుప్రసాద్, టీటీఎఫ్ నుంచి ఈ రఘునందన్ పోటీ చేస్తున్నారు. కరీంనగర్-నిజామాబాద్-మెదక్-ఆదిలాబాద్ ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి టీపీటీఎఫ్ అభ్యర్థిగా బి కొండల్‌రెడ్డి బరిలో ఉన్నారు. కొండల్‌రెడ్డికి టీఎస్‌యూటీఎఫ్, ఇతర యూఎస్‌పీసీలో ఉన్న భాగస్వామ్య సంఘాలు బలపరిచాయి. ఇదే నియోజకవర్గం నుంచి ఎస్టీయూ నుంచి మామిడి సుధాకర్‌రెడ్డి, టీపీటీయూ నుంచి జి వేణుగోపాలస్వామి, టీటీఎఫ్ నుంచి రాములు బరిలో ఉన్నారు. కరీంనగర్ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్సీ బి మోహన్‌రెడ్డి పోటీ చేస్తున్నారు. ఇప్పటికే అభ్యర్థులను ఆయా సంఘాలు ప్రకటించడంతో తమదైన శైలిలో ప్రచారంలో ముందుకెళ్తున్నారు. పాఠశాలల వారీగా ఉపాధ్యాయ ఓటర్ల వద్దకు వెళ్లి సమస్యలను తెలుసుకుంటున్నారు.

సిట్టింగ్‌లపై వ్యతిరేకత ఉన్నా...

నల్లగొండ నుంచి పూల రవీందర్, కరీంనగర్ నుంచి పాతూరి సుధాకర్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నా ఉపాధ్యాయుల్లో వారిపై వ్యతిరేకత ఉన్నది. టీఆర్‌ఎస్ ప్రభుత్వంలో భాగంగా వారు ఉన్నప్పటికీ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం కావడం లేదన్న అసంతృప్తి గూడు కట్టుకున్నది. ఏకీకృత సర్వీసు రూల్స్ అమలు చేయకపోవడంతో పదోన్నతులు రాకపోవడం, పీఈటీలు, పండితుల అప్‌గ్రెడేషన్ కాకపోవడం, రూ.398 స్పెషల్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్ ఇవ్వకపోవడం వంటి ప్రధాన సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదు. ప్రధానంగా పీఆర్సీ ప్రకటించకపోవడం, కనీసం మధ్యంతర భృతి (ఐఆర్) ఇవ్వకపోవడంపైనా ఉపాధ్యాయులు అసంతృప్తితో ఉన్నారు. ఇవి సిట్టింగ్ ఎమ్మెల్సీలకు కొంత ఇబ్బందిగానే ఉన్నది. అయితే టీఆర్‌ఎస్ పార్టీ రెండో సారి అధికారంలోకి రావడం వారికి అనుకూలం కానుంది. ప్రధానంగా నల్లగొండలో పీఆర్టీయూ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్సీ పూల రవీందర్, టీఎస్‌యూటీఎఫ్ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి మధ్యే పోటీ ఉండే అవకాశమున్నది. ఇక కరీంనగర్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డి, టీపీటీఎఫ్ అభ్యర్థి బి కొండల్‌రెడ్డి, ఎస్టీయూ అభ్యర్థి మామిడి సుధాకర్‌రెడ్డి, స్వతంత్ర అభ్యర్థి మోహన్‌రెడ్డి మధ్య పోటీ జరగనుంది.

కరీంనగర్ పట్టభద్రుల బరిలో దేవీప్రసాదరావు?

ఇక కరీంనగర్-నిజామాబాద్-మెదక్- ఆదిలాబాద్ పట్టభద్రుల నియోజకవర్గంలోనూ మార్చిలో ఎన్నికలు జరగనున్నాయి. కరీంనగర్ పట్టభద్రుల నుంచి ప్రస్తుతం శాసనమండలి చైర్మెన్ స్వామిగౌడ్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. రానున్న ఎన్నికల్లో టీఆర్‌ఎస్ పార్టీ నుంచి బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మెన్ జి దేవీప్రసాదరావు పోటీ చేసే అవకాశమున్నట్టు ప్రచారం జరుగుతున్నది. అధికార టీఆర్‌ఎస్ పార్టీ నుంచి పోటీ చేసేందుకు గ్రూప్-1 అధికారుల సంఘం అధ్యక్షులు చంద్రశేఖర్‌గౌడ్ పోటీ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. సీటు ఎవరికి దక్కుతుందో తెలియాల్సి ఉంది. ఇక కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పింఛన్ స్కీం ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్‌సీపీఎస్‌ఈయూ) పోటీ చేయాలని నిర్ణయించింది. ఇంకా అభ్యర్థిని ప్రకటించలేదు.

సీబీఐని కలవరపెడుతున్న ఖాళీలు

కీలకమైన అధికారులు లేకపోవడంతో దర్యాప్తు సంస్థపై పెరిగిన భారం

కేంద్రాన్ని తప్పుబట్టిన పార్లమెంటరీ కమిటీ

- డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ నియమకానికి ప్రభుత్వం చర్యలు
- వివిధ మంత్రిత్వ శాఖల నుంచి ప్రతిపాదనలను కోరిన కేంద్రం



న్యూఢిల్లీ: సీబీఐని ఖాళీలు కలవర పెడుతున్నాయి. అలోక్‌వర్మ తొలగింపు అనంతరం సీబీఐలో రెగ్యులర్ డైరెక్టర్ లేరు. దీంతో ఈ పదవి ఖాళీగా ఉన్నది. అలాగే సీబీఐలో కీలకమైన పదవులైన డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్, ప్రత్యేక డైరెక్టర్‌లు ఖాళీగా ఉన్నాయి. ఈ ఖాళీలపై సీబీఐ అధికారి ఒకరు మాట్లాడుతూ... సీబీఐ ప్రధాన నాలుగు పోస్టుల్లో ప్రస్తుతం మూడు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈ కీలక పోస్టులు ఖాళీగా ఉండటంతో కేసుల దర్యాప్తు మందగించిందన్నారు. దీనితో సీబీఐపై భారం పడుతోందన్నారు. వీటిలో డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ అనేది చాలా కీలకమైన పదవని వెల్లడించారు. ఈ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వివిధ కేసుల్లో న్యాయసలహాలను సేకరిస్తారనీ తెలిపారు. దర్యాప్తు సంస్థలో కీలక పదవులు ఖాళీగా ఉండటం ఇదే తొలిసారి అని వెల్లడించారు. డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్‌గా పనిచేసిన ఓపి వర్మ పదవికాలం గతేడాది డిసెంబర్23తో ముగిసిందన్నారు. అప్పటి నుంచి ఆ పదవి ఖాళీగా ఉన్నదన్నారు.

కాగా ఈ పోస్టులు ఖాళీగా ఉండటంపై కేంద్రాన్ని పార్లమెంటరీ కమిటీ ఇటీవల తప్పుబట్టింది. ఇటువంటి కీలక పదవులను ప్రభుత్వం త్వరగా భర్తీ చేయాలనీ తెలిపింది. సీబీఐలో పోస్టులను ఖాళీగా ఉంచడం సరికాదనీ తెలిపింది. ఏ శాఖలోనైనా ఖాళీలు ఏర్పడతాయనీ, కానీ అటువంటి పరిస్థితి రాకముందే నియమకాలను చేపట్టాలన్నారు. కానీ సీబీఐ ఈ విషయంలో విఫలమైందనీ తెలిపిన విషయం తెలిసిందే. దీంతో సీబీఐలోని డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ పోస్టును భర్తీ చేసేందుకు కేంద్రం సన్నాహాలు చేస్తోంది. అందుకోసం వివిధ మంత్రిత్వ శాఖల నుంచి ప్రతిపాదనలను కోరింది. ఈ పదవి కోసం సమర్థులైన అభ్యర్థుల పేర్లను పంపాలని అన్ని ప్రభుత్వశాఖల కార్యదర్శులకు కేంద్రం ఆదేశాలు జారీచేసింది. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమించబడాటానికి సరిపోయే అర్హతలు ఉన్న అధికారుల పేర్లను మాత్రమే పంపాలని తెలిపింది. వారి ర్యాంకు సంయుక్త కార్యదర్శి కన్నా తక్కువ కాకుండా ఉండాలనీ తెలిపింది. అభ్యర్థుల పేర్లను ఈ నెల 25లోగా పంపాలనీ తెలిపింది. కేంద్ర విజిలెన్స్ కమిషన్ సూచనల మేరకు ఈ పదవిని భర్తీ చేస్తారు.



మహిళలను ఆదిశక్తిగా పూజించే దేశం మనది. పురాణాలు ఇతిహాసాలన్నింటిలోను మహిళలకు అత్యున్నత స్థానమే. కాని నిజ జీవితంలో మాత్రం అందుకు విరుద్ధంగా ప్రవర్తించే సమాజంగా కొనసాగుతున్నది మన భారతీయ సమాజం. స్త్రీలను బానిసలుగా చూడటం, కనీస హక్కులను నిరాకరించి అమానవీయంగా ప్రవర్తించడం పరిపాటయిన సమాజంలో ఉన్నాం. ఆధిపత్య కులాల స్త్రీలతో పోల్చినప్పుడు దళిత బహుజన వర్గాల స్త్రీల పరిస్థితి మరింత దారుణంగా ఉన్నది. ఆచారాలు, సంప్రదాయ్లాలు, సంస్కృతి పేరుతోవారిపై జరుగుతున్న అకృత్యాలకు నిలువెత్తు సాక్ష్యం జోగిని వ్యవస్థ. మధ్యయుగాల్లో దేవాలయం కేంద్రంగా లేదా గ్రామదేవత కేంద్రంగా అణగారిన వర్గాలకు సంబంధించిన స్త్రీని పూజా విధానంలో జుగుప్సాకరమైన రీతిలో భాగస్వామిని చేశారు. ఆ వ్యవస్థని ఈ ఆధునిక కాలంలోనూ ఇంకా కొనసాగించడం మనం ఎటు పయనిస్తున్నామన్న ప్రశ్నను రేకెత్తిస్తుంది. జోగిని వ్యవస్థలో బంధీ అయిన స్త్రీ ప్రభుత్వ ఉద్యోగి అయినా జోగినిగా తన విధులు నిర్వర్తించాల్సిరావడం చూస్తే మన చట్టాలు ఎవరికి చుట్టాలో అర్థమవుతుంది. 'నవతెలంగాణ' ప్రతినిధి అందిస్తున్న ఈ వ్యాసం ప్రభుత్వం, తోటి మనుషుల కండ్లు తెరిపిస్తుందనే ఉద్దేశంతో 'జాతర' పాఠకులకు ప్రత్యేకంగా...

మళ్లీ ఊపందుకుంటున్న జోగిని ఆచారం

జోగిని అనే మాట వింటేనే ఫ్రీగా దొరికే ఆటబొమ్మరా అంటు కొంతమంది చేసే ఎగతాళి మాటలు గుర్తుకు వచ్చి మనసు బాధతో నిండిపోతుంది. దేవుడి పేరుతో దళిత స్త్రీని జోగినిగా మారుస్తూ, వారి జీవితాన్ని దుర్భరం చేస్తున్నారు. తమ జీవితాలపై తమకే హక్కులేని దౌర్భాగ్య స్థితిలో జోగినులు ఇంకా జీవిస్తున్నారు. క్రీ.శ.1350 సంవత్సరం నుండి ఆ దేవదాసి వ్యవస్థ కొనసాగుతున్నట్లు చరిత్ర కథనం. జోగిని, దేవదాసి పేర్లతో పిలిచే వీరిని "నడి వీధిలో నాట్యమాడుతారని, ఊరి ఉమ్మడి ఆస్తి అని గ్రామంలోని ఆధిపత్య కులాల పురుషులు అంటుంటారు. వీరితోపాటు బీసీకులాలకు చెందిన పురుషులూ కలిసిపోయి జోగినిల పట్ల నిర్దయగా ప్రవర్తించడం గమనించాల్సిన మరో సంగతి.

ఒక్కొక ప్రాంతంలో ఒక్కో పేరుతో..

దేవుడు, దేవతల పూజావిధానంలో భాగమైన స్త్రీలను ఒక్కో ప్రాంతంలో ఒక్కో పేరుతో పిలుస్తారు. కేరళ రాష్ట్రంలో మహారీ అని, అస్సాంలో నాటీ అని, మహారాష్ట్రలో మురళి అని,త మిళనాడులో తెవెడియార్ అని, కర్ణాటక, రాయలసీమల్లో బసివి అని, తెలంగాణ జిల్లాలో కొన్ని చోట్ల జోగిని అని, కరీంనగర్ లో పార్వతి అని; నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో మాతమ్మ, తాయమ్మ అంటు పిలుస్తారు. తెలంగాణలో అధికారిక లెక్కల ప్రకారం 30 వేల మంది, ఆంధ్రప్రదేశ్‌లో 20 వేల మంది జోగినులు ఉన్నట్లు సమాచారం. ఇందులో 90 శాతం మంది దళిత సామాజిక వర్గానికి చెందిన వారే ఉన్నట్లు సమాచారం. ఇంట్లో మగసంతానం లేకపోతే ఆడపిల్లను జోగినిగా మారిస్తే మగ సంతానం కలుగుతారనే నమ్మకం ఈ వ్యవస్థ రూపకల్పనలో ఒక భాగంగా ఉన్నది. అట్లాగే బలహీన వర్గాల అమ్మాయిలపై కన్నేసిన పెత్తందార్లు జోగినిలుగా వారిని మార్చేలా చేస్తున్నారని కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా దళితుల్లో ఉన్న నిరక్షరాస్య, ఆధిపత్యకులాలవారి స్వార్థం, మూఢనమ్మకాలు ఈ వ్యవస్థకు మూలకారణాలుగా కనిపిస్తున్నాయి.

ఎన్నో అవమానాలు..

దేవుని పేరుతో జోగినిగా చేసిన తమకు కనీస ఆదరణ లేదని పలువురు జోగినిలు వాపోయారు. వయస్సు పైబడుతున్న కొద్ది ఆరోగ్యం సహకరించక, ఆదరించే వారు లేక, వృద్ధాప్యంలో తోడులేక దుర్భరంగా జీవిస్తున్నట్లు పలువురు ఈ రచయితతో తమ ఆవేదనను పంచుకున్నారు. దేవుని పేరుతో ఉన్న తమకు దేవుని మాన్యం అయిన భూములను తాము అనుభవించలేని పరిస్థితిలో ఉన్నామని వీరు చెబుతున్నారు. గ్రామాల్లోని అనేక దేవాలయాల్లో పూజారులకు ప్రభుత్వం దీపం వెలిగించి పూజలు చేసేందుకు ప్రత్యేక పథకాలు ప్రవేశపెట్టి జీతం ఇస్తున్నారని, తమను దేవుని భార్యలంటూ అనేక విధాలుగా దోపిడీ చేస్తున్నా ప్రభుత్వం ఎటువంటి వేతనం కాని, మాన్యం కాని ఇవ్వడంలేదని, ఇదెక్కడి న్యాయమని వారు ప్రశ్నిస్తున్నారు. జోగిని పిల్లలు బడిలో చేరాలంటే ఎన్నో ఇబ్బందులను



ఎదుర్కొంటున్నారు. బడిలో చేర్పించడానికి వెళితే తండ్రిపేరు అడుగుతున్నారు. జోగినిని ఊరుమ్మడి ఆస్తిగా భావించి ఊళ్లో పురుషులు ఆమెపై లైంగిక దాడులకు దిగుతుంటారు. ఎవరి వల్ల బిడ్డలు పుట్టారో ఆ అభాగినులు ఎట్లా చెప్పగలరు? ఒకవేళ చెప్పినా ఈ మర్యాదస్తులైన పురుషులు ఆ బిడ్డలకు తండ్రులుగా గుర్తింపు పొందటానికి ఒప్పుకుంటారా? అట్లాగే హాస్పిటల్‌లో కనడానికి వెళితే భర్త పేరు అడుగుతున్నారు. ఏ భర్తపేరు చెప్పాలి. దేవుడి భార్య కాబట్టి ఏదో ఒక దేవుడి పేరు చెబితే హాస్పిటల్ అధికారులు అంగీకరిస్తారా? పదవ తరగతి పరీక్షలు తండ్రి పేరు చెబితేనే రాయనిస్తామని పాఠశాల అధికార్లు అంటే ఏంచేయాలి? ఈ సమస్యలకు తాళలేక జోగినులు పై అధికార్లకు మొరపెట్టుకుంటే డీఎన్ఏ పరీక్షలు చేయించాలని అధికారులు భావించగా దానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పురుష ప్రపంచం నిరసనలు తెలిపింది, దీంతో స్పందించిన ప్రభుత్వం 2009 డిసెంబర్ 30న జీ.ఓ139 ని విడుదల చేసింది. పాఠశాలలో తండ్రి పేరు లేకపోయినా తల్లి పేరుతో దరఖాస్తు తీసుకోవాలని ఆదేశాలిచ్చింది.



ప్రభుత్వ ఉద్యోగినీ వదల్లేదు...

తెలంగాణ ప్రాంతంలోని నిజామాబాద్ జిల్లాలో ఈ జోగిని ఆచారం ఎక్కువగా ఉందనేది ప్రచారం. జిల్లాలోని వర్ని, ఎడపల్లి, బోధన్, నవీపేట్ తదితర మండలాల్లో ఎక్కువగా జోగిని వ్యవస్థ ఉంది. ప్రముఖ సంఘ సంస్కర్త అయిన హేమలత లవణం ఈ దురాచారాన్ని ఎలాగైనా రూపుమాపాలనే ఉద్దేశంతో 'సంస్కార్ ప్లాన్' అనే సంస్థను ఏర్పాటు చేశారు. ఆ సంస్థ ద్వారా వారికి ఉపాధి కల్పించడం, సమాజం పట్ల అవగాహన కల్పించడం లాంటి కార్యక్రమాలు చేశారు. కాలక్రమేణ ఆ సంస్థ మూతపడడంతో మళ్లీ ఈ జోగిని దురాచారం గ్రామాల్లో బయటికీ వస్తున్నది. మళ్లీ ఆరోజులను గుర్తుచేస్తూ కొంతమంది పెద్దలు ఆచారం సాగించాలంటూ పండగల సందర్భంలో జోగినులతో నృత్యాలు చేయిస్తున్నారు. ఈ ఆధునిక కాలంలో ఇది ఎంత అవమానకరమైన, అమానవీయ చర్య! తాజాగా బోధన్, కోటగిరి మండలాల్లో బోనాల పండగ సంధర్భంగా జోగిని స్త్రీలను ఊరేగింపులో నృత్యాలు చేయించడం బహిరంగంగానే జరిగింది. ఈ వీడీయోలు సామాజిక మాధ్యమాలలో టీవీలలో ప్రసారమయినా అధికారులు గాని, ప్రభుత్వ పెద్దలు గాని పట్టించుకోకపోవడం విశేషం. చివరికి సంప్రదాయవాదులు ఎంతగా బరితెగించారంటే... బోధన్ రెవెన్యూ డివిజన్‌లోని ఓ గ్రామంలో ప్రభుత్వ అధికారిగా పనిచేసే ఓ మహిళను పండగ సందర్భంగా డ్యాన్స చేయాల్సిందేనని పట్టుబట్టారు. చిన్నప్పటి నుంచే జోగినిగా ఉండడంతో ఆ మహిళ తన ఆత్మాభిమానాన్ని పక్కనబెట్టి బోనాల పండుగ రోజు పోతరాజులతో కలిసి నృత్యం చేసింది. తన ఉద్యోగిని సైతం ఈ ఆచారం నుంచి రక్షించలేని ప్రభుత్వం సాధారణ జోగినులను రక్షిస్తుందని ఎట్లా ఆశించగలం?

ఊర పండగలో అమానుషం...

ఊరపండగ అంటే అది మూడు రోజులపాటు అత్యంత నిష్టతో చేసే పండగ. ఎవరు కూడా ఊరిలో నుంచి బయటికి వెళ్లకూడదు బయటి వారు రాకూడదు అనేది నిబంధన. అందుకోసం గ్రామం పొలిమేర చుట్టు పసుపులో కలిపిన వస్తువులతో భండారా వేస్తారు. దాంతో పండగ క్రతువు ప్రారంభమవుతుంది. గ్రామ దేవత ముందు నిర్వహించే క్రతువులో భాగంగా పోతరాజులను జోగినులను పూనకం వచ్చేలా డప్పుల చప్పుళ్లతో అంతా సిద్ధం చేస్తారు. ఊరిజనం అంతా అక్కడ జరిగే తంతుని తిలకించడానికి వస్తారు. అందరి మధ్యలో జోగినులు, పోతరాజులు నృత్యాలు చేయాలన్నమాట. లేకుంటే దేవుడు శాంతించడంటూ ప్రచారం చేస్తారు. అలాగే గ్రామానికి అరిష్టం కలగకూడదంటూ ఓ దళిత వ్యక్తిని ఒళ్లు గగుర్పోడిచే విధంగా తయారుచేసి గ్రామం చుట్టు తిప్పుతారు. ఎలాగంటే... దళిత వ్యక్తిని తెల్లవారుజామున అంటే 3 గంటల ప్రాంతంలో గ్రామ దేవత వద్ద నగ్నంగా తయారుచేసి అతని నడుము చుట్టు వేప ఆకులు కడతారు. అట్లాగే నెత్తిపై పేడ తట్టపెట్టి, అందులో దున్నపోతు వ్యర్థాలు వేస్తారు..అనంతరం అతని నోటిలో దున్నపోతు పచ్చిమాంసాన్ని ఉంచి ఊరు చుట్టూ తిప్పుతారు. ఇలా చేస్తే గ్రామానికీ అరిష్టం కలగదంటూ చెప్తారు. గ్రామంలో దేవతలు శాంతించాలంటే దళితులే నగ్నంగా ఊరేగాలా.. దళిత స్త్రీలే జోగినిలా నాట్యమాడాలా...ఆధిపత్య వర్ణాల వారు దిగంబరంగా తిరగటం దేవునికి ఇష్టం ఉండదా?

ఎప్పుడో రద్దుచేసిన జోగిని వ్యవస్థను తెలంగాణ సంస్కృతి పేరుతో మళ్లీ మనుగడలోకి తీసుకువచ్చే ప్రయత్నాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. అందులో భాగంగానే ఇటీవల కాలంలో జోగిని నృత్యాల వార్తలు తరచుగా వినిపిస్తున్నాయని సామాజిక కార్యకర్తలు వాపోతున్నారు. సాక్షాత్తు ప్రభుత్వ ఉద్యోగం చేసుకుంటున్న స్త్రీని జోగిని కాబట్టి డ్యాన్స్‌చేయాల్సిందేనని ఊరుజనం నృత్యం చేయిస్తే ఇక నిరక్షరాస్య జోగినుల బతుకులు ఎంత దుర్భరంగా ఉంటాయో ఊహించండి.

- లింబురి లక్ష్మణ్
నవతెలంగాణ- బోధన్
6305491627

బహమాస్ సంస్కృతి

అట్లాంటికి మహాసముద్రం తూర్పు తీరంలో ఉన్న నిరుపేద దేశం బహమాస్. ఇంగ్లీషు ఎక్కువగా మాట్లాడతారు. అందుకే దీన్నే అధికారభాషను చేశారు. ఈ దేశంలో మొదటగా నివసించడం ప్రారంభించింది 'లుక్కు-కెయిరిస్' (లుకయన్స్). అన్వేషకుడు క్రిస్టోఫర్ కొలంబస్ బహమాస్ ద్వీపాలను తన స్వదేశం స్పెయిన్‌కు చెందినవిగా ప్రకటించాడు. ఇక్కడ నివసించే అనేకమంది లుకయన్లు బానిసలుగా క్యూబా వంటి దేశాలకు తరలింపుకు గురయ్యారు. మిగతావారు తమ ద్వీపాలకు కొత్తగా వచ్చిన వారి వల్ల సంక్రమించిన జబ్బుల పాలబడ్డారు. అయితే స్పెయిన్‌వాళ్లు ఈ ద్వీపాల్లో స్థిరపడలేదు. అప్పట్లో ఈ ద్వీపాలు సముద్రపు దొంగలకు స్వర్గధామంగా మారాయి. 1629లో బ్రిటీష్‌వాళ్లు వీటిని తమ భూభాగాలని



ప్రకటించారు. అమెరికా స్వతంత్ర సంగ్రామ సమయంలోను, ఆ తరువాత.. బ్రిటిష్ అనుకూలవాదులు ఇక్కడికి పారిపోయి వచ్చి స్థిరపడ్డారు. అదే సమయంలో ఆఫ్రికా నుంచి తరలించబడిన నల్లజాతి బానిసలు కూడా పెరుగుతూ వచ్చారు. 18వ శతాబ్దం నుంచి నల్లజాతీయుల సంఖ్య తెల్లవాళ్ల కంటే పెరిగిపోసాగింది.

విభిన్న సంస్కృతి

బహమాస్‌లో అటు నల్లవారు ఇటు తెల్లవారు (బ్రిటీషర్స్) అనుసరించే ఆచార, సంప్రదాయాల మిశ్రమంతో కొత్త సంస్కృతి జీవం పోసుకుంది. బ్రిటీష్‌వాళ్లు ఇంగ్లీషు, ప్రొటెస్టెంటిజం, మార్కెట్ ఆర్థిక వ్యవస్థ ఇక్కడ పాదుకొనడానికి కారకులయ్యారు. దక్షిణాఫ్రికా నుంచి వచ్చిన ప్రజలు సంగీత పద్ధతులు, పరికరాలు, నృత్యపద్ధతులు, మతపరమైన భావనలు, జానపద కథలు, కుటుంబ నమూనాలు, భాషాపరమైన ప్రభావాలు తీసుకువచ్చారు. ఫలితంగా కొత్త విశ్వాస వ్యవస్థ ఉద్భవించింది. తోటలు, బానిస తిరుగుబాటులు, వలస పాలన, దీవులుగా ఉన్న భూభాగం, సముద్రం, హరికేన్లు వంటి అనేక ఇతర అంశాలు కూడా బహమాస్‌లో సాంస్కృతిక సంశ్లేషణకు కారణమయ్యాయి. 1973 వరకు బ్రిటీష్‌వాళ్ల అధికారంలోనే ఉన్న ఈ దీవులు శాంతియుతంగానే స్వతంత్ర్యాన్ని పొందాయి.

ఆహార పానీయాలు

పండ్లు, కూరగాయలు, చేపలు, మాంసం, బ్రెడ్, అన్నం... ఇవీ ప్రజలు తీసుకునే ఆహార పదార్థాలు. నత్తగుల్లలు, బటాని జాతీయ వంటకాలుగా పరిగణిస్తారు. పేద ప్రజలు అన్నంతో కలిపి వీటిని ఎక్కువగా తీసుకుంటారు. ఇవి ఎక్కువగాను, చౌకగాను లభించడమే ఇందుకు కారణం. సంపన్నులు ఈ వంటకాలను 'హెరిటేజ్ ఫుడ్స్'గా భావిస్తారు. పండుగలు పబ్బాలు, సెలవు దినాల సందర్భంలో లోకల్‌గా లభించే చేపలు, నత్త గుల్లలు, బటాని రైస్, బ్రెడ్‌లు, తాజా పండ్లు వడ్డనలో ఉంటాయి. బహమాస్‌లో తయారయ్యే రమ్, బీర్, ఇంపోర్టెడ్ బీర్, సాఫ్ట్ డ్రింక్స్, టీ, కాఫీ వంటి పానీయాలను రోజువారీగా తీసుకుంటారు.



చెక్క భజన కళారూపం

జానపద నృత్యాల్లో చెక్కభజన ఒకటి. పల్లె ప్రజలు పాల్గొనుటకు అనుగుణంగా ఉంటుంది. ప్రచార నృత్యాలు, పల్లెప్రజల కొరకు ఏర్పడిన నృత్య రీతులు అయినప్పటికీ ఇవి ప్రత్యేకంగా కొద్దిమంది కళాకారులు ఎక్కువ శ్రమించి, అభ్యసించే సంప్రదాయ నృత్యాలు. జానపద నృత్యాలు అట్లా కాకుండా ప్రజలందరూ పాల్గొని ఆనందించే సులభశైలిలో ఉంటాయి. వీటిని ప్రజా కళలుగా చెప్పవచ్చు. ఇవి కొన్ని ఏకపాత్ర నృత్యాలు, కొన్ని బృంద నృత్యాలు, మరికొన్ని ప్రత్యేకంగా స్త్రీలచే, పురుషులచే ప్రదర్శించేవి.

చెక్కభజనను పలకల భజన, పలకల కోలన్న అనికూడా పిలుస్తారు. చెక్కలతో చేసే భజన కాబట్టి దీన్ని చెక్కభజన అంటారు. దీంట్లో ఎంతమందైనా పాల్గొనవచ్చు. కానీ నృత్యంలో చిన్నవాళు ౢ, పెద్దవాళ్లు కలిసి ఉంటారు. చెక్కలు రెండు జానెల పొడవు, బెత్తెడు వెడల్పు కలిగి ఉంటాయి. వాటి



చివర రేకుతో చేసిన బిల్లలు అమర్చి ఉంటాయి. అలాంటివి రెండు చెక్కలకు అమరుస్తారు. కుడి చేతిలో ఉండే ఈ చెక్కలు రెండూ ఒకే పరిమాణంలో ఉంటాయి. పసుపు పచ్చని గుడ్డను నడుముకు కట్టుకొని ఉంటారు. కొన్ని చోట్ల ఇతరరంగుల గుడ్డలూ కట్టుకుంటారు. ఏ రంగు గుడ్డను కట్టినా కళాకారులందరూ ఒకే రంగును కట్టుకుంటారు. గురువు అందరినీ గుండ్రంగా నిలబెట్టి తాను మధ్యలో చెక్కల్ని తీసుకొని నిలబడతాడు. ముందుగా "శ్రీమద్రమారమణ గోవిందా హరి" అని భజన నృత్యం మొదలుపెడతాడు. అందరూ గోవిందా అని వంత పాడుతారు. ఇట్లా గురువు ఒక్కొక్క దేవుణ్ణి పేరు పేరునా వేడుకోవడం అందరూ చేతుల్లోని చెక్కల్ని గలగలమంటూ కదిలిస్తూ ఒకే లయలో శబ్దం చేస్తూ ఉంటారు. తరువాత గురువు చూపించే భంగిమలను అనుసరిస్తూ ఉంటారు. అట్లాగే రెండు కాళ్లకు గజ్జెలు కట్టుకొని నేలమీద ఒకే మాదిరిగా కొడుతూ గుండ్రంగా తిరుగుతుంటారు. ఒకే వరుసలో నిదానంగా తిరుగుతారు. గురువు ఒక్కొక్క గేయం పూర్తి కాగానే లేదా మధ్యలో గాని తాళం మార్చి బిరబిరా తిరుగుతూ పాటలోని ఒక పాదాన్ని పూర్తిగా సగం పాడతాడు. అప్పుడు ఆ దృశ్యం చూడ ముచ్చటగా ఉంటుంది. గజ్జెల రవళి చెవుల్లో మార్మోగుతూ వినసొంపుగా ఉంటుంది. నృత్యభంగిమ నయనానందకరంగా ఉంటుంది.

ప్రాచీన మార్గాల్లోనే కొత్త రహదారులా!



శేరి వణిజ్జ జాతకంలో ఒక ఆంధ్రపట్టణంలోవాణిజ్యానికి సంబంధించిన ప్రసక్తి ఉంది. ఈ కథ ప్రకారం బోధిసత్త్వుడు, కుండలు, చట్లు, అమ్మే వ్యాపారితో కలిసి ప్రయాణిస్తూ తెలివాహ నదిని దాటి ఆంధ్రపురిలో ప్రవేశించాడు. అక్కడ వాళ్లు తమ వాణిజ్యానికి వీథులను పంచుకున్నారు. అంటే మొదట తాము పంచుకున్న వీథులలో మాత్రమే తిరిగి ఆ తర్వాత పరస్పరం వీథులు మార్చుకుంటారు. మొదటి వ్యాపారి తన వంతు వీథిలో పాత్రల అమ్మకానికి బయలుదేరతాడు. ఒక స్త్రీ బంగారు పళ్ళెం ఇచ్చి మట్టి పాత్రను కొనబోతుంది. కాని అత్యాశపరుడైన వ్యాపారి మోసబుద్ధితో అది పనికిమాలిన లోహమని చెప్పి తిరస్కరిస్తాడు. వీథులు మారి ఈ వీథికి వచ్చిన బోధిసత్త్వుడు తన దగ్గర ఉన్న అన్ని పాత్రలు, అన్ని నాణేలు ఇచ్చి అదే బంగారు పాత్రను తీసుకుంటాడు.

ఈ కథ మనకు కొన్ని ఉపయోగకరమైన సంగతులను చెబుతుంది. తెలుగు ప్రాంతం ఉత్తరదేశంతో వాణిజ్య సంబంధాలు కలిగి ఉందని, ఈ వాణిజ్య మార్గంలో వర్తకులు ప్రయాణిస్తున్నారని తెలుస్తుంది. రెండో విషయం ఏమిటంటే అంత దూరం నుంచి మట్టిపాత్రలను మరో దేశంలో అమ్మడానికి తీసుకొని రావడం అంటే ఆ పాత్రలు విలువైనవి, నాణ్యమైనవి అయ్యి ఉండాలి. మూడోవిషయం ఈ పాత్ర సామగ్రిని కొన్నిసార్లు బంగారంతో కూడా వినిమయం చేసేవారని, వెండి నాణేలు, ఉత్తరపు నలుపు మెరుగు (నార్తర్న్ బ్లాక్ పోలిష్డ్) రకానికి చెందిన మట్టి పాత్రలను సామాన్య ప్రజలు బంగారం కంటే విలువైనవిగా చూసేవారు. దీన్ని బట్టి తెలుగు ప్రాంతాల్లో కనీసం కొంతమంది ప్రజల ఆర్థిక స్థాయిని గుర్తించవచ్చు. బంగారాన్ని విలువైన లోహంగానే తప్ప ద్రవ్య విలువగా పరిగణించడం తక్కువన్నమాట. ఆ పట్టణం ప్రతిష్టానపురమని మోతీచంద్రవంటి పండితులు చరిత్రకారులు అంటున్నారు.



తెలివాహ నేటి గోదావరి

కాని ఇది సరికాదని పరబ్రహ్మశాస్త్రి అభిప్రాయం. తెలివాహ నది గుర్తింపు సందేహాస్పదం. మెగస్తనీసు ప్రకారం ఆకాలంలో ఆంధ్రదేశంలో ప్రాకారాలు కలిగిన 30 పట్టణాలు ఉండేవి. ప్రతిష్టానపురం లేదా పైటాన్ తరువాతి కాలంలో ఆంధ్రశాతవాహనుల రాజధాని అయింది. కాని జాతక కథ అంతకంటే ముందు కాలాన్ని గురించి చెబుతుంది. తెలివాహ అన్న పేరు గోదావరికి సరిపోతుంది. నల్లఏరు లేదా నల్లబెన్న అని పిలిచే కృష్ణా నదితో పోల్చి తెలుగులో తెల్లఏరు లేదా తెల్లబెన్న అంటారు. తెలుగు మాట్లాడే ప్రాంతంలో ప్రవహించే కృష్ణా నది కాక ఇది మరో పెద్ద నది. ఈ గుర్తింపును అంగీకరించినట్లయితే ఉత్తరం నుంచి వచ్చేవారు కోటిలింగాల లేదా రాయపట్టణం వంటి గోదావరి దక్షిణ ఒడ్డున ఉన్న క్రీస్తుపూర్వం మూడవ శతాబ్దానికి చెందిన శాతవాహన పూర్వ నాణేలు లభించిన ప్రాచీన పట్టణాన్ని చేరుకోవాలంటే గోదావరి నదిని దాటాలి. ఆంధ్ర దేశాన్ని ప్రాచీన విదర్భ, కోసలతో కలిపే ప్రస్తుత జాతీయ రహదారి పక్కనే ఈ ప్రాచీన పట్టణాలు ఉన్నాయి. కాజీపేట నుండి ఉత్తరానికి వెళ్లే ప్రస్తుత రైలు మార్గం కూడా ఈ ప్రాచీన పట్టణాలకు ఎంతో దూరంలో లేదు. ఆధునిక ప్రధాన రహదారులు, రైలు మార్గాలు సాధారణంగా ప్రాచీనమైన రహదారుల తోవలోనే ఉన్నాయి. తర్వాతి కాలంలో చైనా యాత్రికుడు హుయాన్‌త్సాంగ్ ఈ ప్రాచీన మార్గం గుండానే కోసల నుంచి ఆంధ్రకు ప్రయాణించి ఉంటాడు. దీనిపైనే ఉన్న పెదబంకూరు, ధూళికట్ట, కోటిలింగాల, రాయపట్టణం వంటి పట్టణాలు శాతవామన పూర్వయుగానికి చెందినవిగా పురాతత్వ శాస్త్రవేత్తలు అంటున్నారు.

-మౌక్తిక్



- ఓడితే సిరీస్ ఆశలు ఆవిరి
- ఒత్తిడిలో కోహ్లిసేన
- నేడు ఆసీస్‌తో రెండో వన్డే పోరు
- ఉదయం 8.50 నుంచి సోనీసిక్స్‌లో..

లెక్క సరి చేస్తారా?

సిడ్నీలో ఫేవరేట్‌గా కనిపించినా, షాక్ తగిలింది. కొత్త జట్టుతో ఆతిథ్య శిబిరం ఉత్సాహంలో ఉండగా, ఆడిలైడ్ వన్డేకు ముందు కోహ్లిసేన ఒత్తిడిలో పడింది. చారిత్రక సిరీస్ విజయం సాధించిన తర్వాత, ఇక్కడ ఓడితే వన్డే సిరీస్‌పై ఆశలు వదులుకోవాల్సిన పరిస్థితి. జట్టు సమతుల్యం దెబ్బతినటం సహా కీలక ఆటగాళ్ల ఫామ్ సమస్యలు ఎదుర్కొంటున్న టీమ్ ఇండియా నేడు నెగ్గి లెక్క సరి చేయాలని చూస్తోంది. భారత్, ఆస్ట్రేలియా రెండో వన్డే సమరం నేడు.

ఆడిలైడ్ (ఆస్ట్రేలియా)

సిడ్నీలో ఆస్ట్రేలియా అద్భుత ప్రదర్శన ఎవ్వరూ ఊహించనిది!. స్మిత్, వార్నర్ జట్టును వీడిన తర్వాత ఆడిన కేవలం మూడు వన్డేల్లోనే గెలిచిన ఆస్ట్రేలియా, నిజానికి సిడ్నీలో గొప్ప ప్రదర్శన చేసింది. అన్ని విభాగాల్లో కోహ్లిసేనపై పైచేయి సాధించింది. ఆస్ట్రేలియా డ్రెస్సింగ్‌రూమ్ సహా విశ్లేషకులు సైతం ఊహించని ప్రదర్శన అది. టీ20 సిరీస్ సమం చేసుకొని, తొలిసారి టెస్టు సిరీస్ నెగ్గిన కోహ్లిసేనను.. ఓడితే వన్డే సిరీస్ వదులుకోవాల్సిన స్థితికి తీసుకొచ్చిన ఘనత కచ్చితంగా కంగారూలకు దక్కుతుంది. అయితే, ఆతిథ్య జట్టు ఆనందానికి ఆడిలైడ్‌లో చెక్ పెట్టేందుకు కోహ్లిసేన సిద్ధమైనట్టే కనిపిస్తోంది. జట్టు సమతూకంలో కొన్ని సమస్యలు ఎదుర్కొంటున్నా, నేడు ఆడిలైడ్‌లో విజయానికి రంగం సిద్ధం చేసుకుంటోంది.

అతడి ఫామ్ ఆందోళన : సిడ్నీలో ధావన్, కోహ్లి, రాయుడు విఫలమైనా రోహిత్ శర్మ చివరి వరకూ పోరాడాడు. అతడికి ఎం.ఎస్ ధోని సహకరించాడు. మహి అర్ధ సెంచరీ చేసినా, బంతులను వృథా చేయటంతో ఆఖర్లో సాధించాల్సిన రన్‌రేట్ భారీగా పెరిగిపోయింది. ఇది లోయర్ ఆర్డర్‌పై మరింత ఒత్తిడికి కారణమైంది. దీంతో మ్యాచ్ పరిస్థితులకు అనుగుణంగా ఆడే సత్తా కోల్పోయాడని విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆడిలైడ్‌లో మరోసారి ధోని ప్రదర్శనపై ఆసక్తి నెలకొన్నది. ధనాధన్ ఆటతో విమర్శలకు అతడు సమాధానం చెబుతాడేమో చూడాలి. గడిచిన ఏడాదిన్నర కాలంలో భారత టాప్-3 వైఫల్యం చెందటం సిడ్నీలో ప్రథమం!. ఆసీస్ కొత్త సీమర్లకు బదులు చెప్పేందుకు గబ్బర్, కోహ్లి, రాయుడు నేడు సిద్ధమవుతున్నారు. సిడ్నీలో స్వల్ప స్కోర్లకే పరిమితమైన ఈ త్రయం ఆడిలైడ్‌లో అదరగొట్టాలని ఎదురుచూస్తున్నారు. ఇక హార్దిక్ పాండ్య లేకపోవటంతో జట్టు సమతుల్యం దెబ్బతిన్నది. కేదార్ జాదవ్ తుది జట్టులో లేకపోవటం మరింత బెడిసి కొట్టింది. దినేశ్ కార్తీక్ స్థానంలో జాదవ్ తిరిగి తుది జట్టులోకి వచ్చే అవకాశం కనిపిస్తోంది. జడేజా, కుల్దీప్‌లతో కలిసి జాదవ్ స్పిన్ బాధ్యతలు పంచుకోవటం లాంఛనమే. పేస్ విభాగంలో భువనేశ్వర్ కుమార్ మునుపటి ఫామ్ కోసం ప్రయత్నిస్తున్నాడు. మహ్మద్ షమి జోరు మీదున్నాడు. సిడ్నీలో ఖలీల్ అహ్మద్ కాస్త ఇబ్బంది పడ్డాడు. అయినా, అతడికి మరో అవకాశం ఇవ్వటానికే కోహ్లి మొగ్గుచూపుతున్నాడు.



సిరీస్ కొట్టాలని.. : స్మిత్, వార్నర్ నిషేధం తర్వాత ఏ ఫార్మాట్‌లోనూ ఓ సిరీస్ విజయం సాధించిన ఆస్ట్రేలియాకు ఆడిలైడ్‌లో ఆ అవకాశం వచ్చింది. నేటి మ్యాచ్‌లో నెగ్గితే వన్డే సిరీస్ ఆసీస్ వశం కానున్నది. ఇదే అంశం ఆ జట్టులో మరింత ఉత్సాహాన్ని నింపుతోంది. ఫామ్ కోసం ఇబ్బంది పడుతోన్న కెప్టెన్ అరోన్ ఫించ్ ఇక్కడ మరింత కసితో కనిపిస్తున్నాడు. ఓపెనర్ అలెక్స్ నిరూపించుకునే పనిలో ఉన్నాడు. ఉస్మాన్ ఖవాజ, హాండ్స్‌కాంబ్, షాన్ మార్ష్‌లు రాణించటంపై ఆసీస్ ఇన్నింగ్స్ ఆధారపడి ఉంది. బంతితో రిచర్డ్‌సన్, బెహన్‌డార్ఫ్‌లు ఊహించిన అద్భుతం చేశారు. తొలి నాలుగు ఓవర్లలో కోహ్లిసేన కోరలు పీకి ఔరా అనిపించారు. నేటి మ్యాచ్‌లోనూ అటువంటి ప్రదర్శన పునరావృతం చేయాలని పేసర్లు భావిస్తున్నారు. నాథన్ లైయాన్ వన్డే జట్టులో ఉనికి నిలుపుకోవాల్సిన స్థితిలో నిలిచాడు. అతడూ ఆడిలైడ్‌లో వికెట్ల వేటపై ఆశలు పెట్టుకున్నాడు.

పిచ్ రిపోర్టు : ఆడిలైడ్‌లో ఇటీవల జరిగిన అన్ని వన్డేల్లోనూ స్వల్ప స్కోర్లే నమోదయ్యాయి. పేసర్లకు అనుకూలిస్తోన్న పిచ్‌పై పరుగులు చేయటం సవాల్‌గా మారింది. దీంతో నేటి మ్యాచ్ సైతం తక్కువ స్కోర్లకే పరిమితం కానున్నదని చెప్పవచ్చు. అధిక ఉష్ణోగ్రతల నడుమ పేసర్లతో పాటు స్పిన్నర్లూ కీలక భూమిక వహించనున్నారు. టాస్ నెగ్గిన జట్టు తొలుత బ్యాటింగ్ ఎంచుకునే అవకాశం కనిపిస్తోంది.

తుది జట్లు (అంచనా)

భారత్ : రోహిత్ శర్మ, శిఖర్ ధావన్, విరాట్ కోహ్లి, అంబటి రాయుడు, ఎం.ఎస్ ధోని, కేదార్ జాదవ్, రవీంద్ర జడేజా, భువనేశ్వర్ కుమార్, కుల్దీప్ యాదవ్, ఖలీల్ అహ్మద్, మహ్మద్ షమి.

ఆస్ట్రేలియా : అరోన్ ఫించ్, అలెక్స్ కారే, ఉస్మాన్ ఖవాజ, షాన్ మార్ష్ పీటర్ హాండ్స్‌కాంబ్, మార్కస్ స్టొయినిస్, గ్లెన్ మాక్స్‌వెల్, పీటర్ సిడిల్, జే రిచర్డ్‌సన్, నాథన్ లైయాన్, జేసన్ బెహన్‌డార్ఫ్.

బీసీసీఐ ఆటలు!

- పాండ్య, రాహుల్ వివాదంపై ఎస్‌జీఎంకు డిమాండ్
- కుర్ర క్రికెటర్ల కెరీర్‌తో ఆడుకోవద్దని రాయ్ వినతి



ముంబయి : ఓ టెలివిజన్ షోలో మహిళలతో లైంగిక సంబంధాలపై నియంత్రణ కోల్పోయి మాట్లాడిన హార్దిక్ పాండ్య, కెఎల్ రాహుల్‌పై బీసీసీఐ తీవ్ర చర్యలకు పట్టుబడుతోంది!. ఈ విషయంలో కొందరు సభ్యుల తీరు మరీ దూకుడుగా ఉండటం క్రికెట్ వర్గాల్లో కలవరం రేపుతోంది. రాత్రి పార్టీల్లో అమ్మాయిలతో లైంగిక సంబంధాల విషయంలో పాండ్య, రాహుల్‌ల వ్యాఖ్యలు తీవ్ర విమర్శలకు దారితీశాయి. దీంతో ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న వారిద్దని స్వదేశానికి పిలిపించటమే కాదు, విచారణ సైతం ఎదుర్కొవాలని బీసీసీఐ ఆదేశించింది. ఇక్కడి వరకూ బాగానే ఉంది, కానీ ఇదే అదనుగా కొన్ని రాష్ట్ర సంఘాలు ప్రత్యేక సర్వ సభ్య సమావేశం ఏర్పాటు చేసి దీనిపై నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేస్తుండటం విస్మయానికి గురి చేస్తోంది. ఈ విషయంలో మాజీ కాగ్, పాలకుల కమిటీ చైర్మన్ వినోద్ రాయ్ సూచనలను ఎవ్వరూ పట్టించుకోవటం లేదు. సహచర సభ్యురాలు డయాన ఎదుల్జీ సైతం ఇద్దరు క్రికెటర్లపై కఠిన వైఖరితోనే ఉండటం మరింత క్లిష్ట పరిస్థితికి దారితీస్తోంది.

కుర్రాళ్లు.. మందలిస్తే చాలు! : పాండ్య, రాహుల్‌ను మందలించి, వారిని సరి చేయటం బీసీసీఐ బాధ్యత. ఈ వివాదంతో క్రికెట్ కెరీర్ నాశనం కాకుండా, భవిష్యత్‌లో బాధ్యత వ్యవహరించటంపై వారిని కౌన్సెలింగ్ చేయాలి. మళ్లీ వారు మైదానంలో ఆత్మవిశ్వాసంతో ఆడేలా చేయాలి. కానీ ఈ కారణంగా యువ క్రికెటర్ల కెరీర్‌ను ఇక్కడితో అంతం చేద్దామనే ధోరణి కూడదు అని సీవోఏ చైర్మన్ వినోద్ రాయ్ సహచర సభ్యురాలు ఎదుల్జీకి రాసిన లేఖలో విన్నవించారు. వేగవంతమైన విచారణను వివాదాన్ని కప్పిపుచ్చే కోణంలో చూడవద్దు, క్రికెట్ ప్రయోజనాల దృష్ట్యా సీఈవో చేత విచారణకు అంగీకారం తెలపాలని కోరుతున్నాను అని ఎదుల్జీని రాయ్ కోరారు. ఇప్పటికే ఆసీస్ టూర్ మధ్యలోనే వెనక్కి పిలవటంతో వారు సగం శిక్షకు గురయ్యారని, ప్రపంచకప్ దృష్ట్యా ఈ విషయాన్ని ఎక్కువ కాలం నాన్చవద్దని రాయ్ అభిప్రాయపడ్డారు.

విచారణ మొదలు : బీసీసీఐ తాజాగా జారీ చేసిన షోకాజ్ నోటీసులకు హార్దిక్ పాండ్య, కెఎల్ రాహుల్ బేషరతు క్షమాపణలు చెబుతూ సమాధానం ఇచ్చారని బీసీసీఐ అధికారి ఒకరు తెలిపారు. బీసీసీఐ నూతన రాజ్యాంగం ప్రకరణ 41(సి) ప్రకారం సీఈవో రాహుల్ జోహ్రి విచారణ ఆరంభించారని ఆ అధికారి వెల్లడించారు.

ఎస్‌జీఎం ఏర్పాటుకు డిమాండ్ : మరో వైపు బీసీసీఐ ఆఫీస్ బేరర్లు ఈ విషయంలో అతిగా ప్రవర్తించటం విమర్శలకు చోటిస్తోంది. పది రాష్ట్ర సంఘాలు తాత్కాలిక అధ్యక్షుడు సి.కె ఖన్నాతో ప్రత్యేక సర్వ సభ్య సమావేశం ఏర్పాటు చేయాలని కోరినట్టు తెలిసింది. బీసీసీఐకి ప్రస్తుతం అంబుడ్స్‌మన్ లేరు. దీంతో ఎస్‌జీఎంలో పాండ్య, రాహుల్ వివాదంపై చర్చించి అంబుడ్స్‌మన్ నియామకం సహా విచారణపై నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర సంఘాలు కోరినట్టు సమాచారం. అవసరమైతే ఎస్‌జీఎం ఏర్పాటుకు నోటీసు ఇవ్వాల్సిందిగా కార్యదర్శి అమితాబ్ చౌదరికి ఖన్నా సూచించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇటీవల ముంబయిలో మాజీ బాస్ ఎన్. శ్రీనివాసన్ అధ్యక్షతన భేటీ అయిన పలు రాష్ట్ర సంఘాల పెద్దలు పాలకుల కమిటీ పాలనకు వీలైనంత ముగింపు పలికి, ఎన్నికలకు సిద్ధమయ్యే కార్యాచరణపై చర్చించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పాండ్య, రాహుల్ వివాదాన్ని అడ్డుగా పెట్టుకొని, బోర్డు రాజకీయాలకు తెరదీయాలని కొందరు ప్రయత్నిస్తున్నట్టు స్పష్టమవుతోంది.



శ్రీకాంత్ 35 కోట్ల ఒప్పందం



న్యూఢిల్లీ : తెలుగు తేజం, మాజీ వరల్డ్ నం.1 బ్యాడ్మింటన్ ఆటగాడు కిదాంబి శ్రీకాంత్ మెగా డీల్ కుదుర్చుకున్నాడు. ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ (పీబీఎల్)లో బెంగళూర్ రాప్టర్స్‌ను విజేతగా నిలిపిన మరునాడే, శ్రీకాంత్ రూ. 35 కోట్ల ఒప్పందంపై సంతకం చేశాడు. ప్రముఖ క్రీడా ఉపకరణాల తయారీదారు, పలు దేశాల జట్లకు స్పాన్సర్ లీ నింగ్‌తో శ్రీకాంత్ ఈ మెగా డీల్ ఒకే చేశాడు. నాలుగేండ్ల కాలానికి శ్రీకాంత్ రూ. 35 కోట్లు అందుకోనున్నాడు. 'వరల్డ్ బ్యాడ్మింటన్‌లో శ్రీకాంత్ ఇప్పటికే ఆకర్షణీయ ఆటగాడు. శ్రీకాంత్ పురోగతిలో లీ నింగ్ సైతం భాగం కావాలని అనుకున్నది. మా డీల్ శ్రీకాంత్‌కు సరిగ్గా సరిపోతుంది' అని లీ నింగ్ భారత డైరెక్టర్ మహేంద్ర కపూర్ వెల్లడించారు.



ప్రెస్ కాన్ఫరెన్స్‌లో వన్డే కెప్టెన్ మిథాలీరాజ్, కోచ్ రామన్

వివాదం దాటేశాం!

- కొత్త ఏడాది, కొత్త సిరీస్.. కొత్తగా ఆరంభం
- భారత మహిళల వన్డే జట్టు కెప్టెన్ మిథాలీరాజ్

ముంబయి : 2018 టీ20 ప్రపంచకప్ సెమీఫైనల్స్ తుది జట్టు ఎంపిక వివాదం నుంచి నేను, హర్మన్‌ప్రీత్ కౌర్ ముందుకెళ్లామనే భావిస్తున్నానని దిగ్గజ క్రికెటర్ మిథాలీరాజ్ తెలిపింది. సీవోఏ సభ్యురాలు డయాన ఎదుల్జీ డైరెక్షన్‌లో చీఫ్ కోచ్‌గా రమేశ్ పొవార్ తన కెరీర్ నాశనానికి కుట్ర చేస్తున్నాడని మిథాలీరాజ్ ఆవేదన భరిత లేఖ రాయటం క్రికెట్ వర్గాల్లో సంచలనం రేపింది. ఇంగ్లాండ్‌తో సెమీఫైనల్స్‌కు మిథాలీని పక్కనపెట్టడంపై పెద్ద యెత్తున విమర్శలు రేగాయి. కొత్త కోచ్ ఎంపికలోనూ మిథాలీరాజ్ ఓవైపు, హర్మన్‌ప్రీత్ మరో వైపు నిలువటంతో మహిళల క్రికెట్ పయనంపై ఆందోళన నెలకొన్నది. కానీ కొత్త ఏడాదిని కొత్తగా ఆరంభిస్తామని, ఆ వివాదాన్ని దాటేసి ముందుకొచ్చామని మిథాలీరాజ్ పేర్కొన్నది. న్యూజిలాండ్‌తో మూడు వన్డేలు, మూడు టీ20ల సిరీస్ కోసం భారత జట్టు ఆదివారం ముంబయి నుంచి క్రైస్ట్‌చర్చ్‌కు బయల్దేరింది. అంతకముందు వన్డే కెప్టెన్ మిథాలీరాజ్, కోచ్ డబ్ల్యూ.వీ రామన్‌లు ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. 'ఓ ఆటను వివాదాలు ఏ విధంగా ప్రభావితం చేస్తాయో నాకు తెలుసు. ప్రదర్శనలతోనే స్పోర్ట్స్ ప్రొఫైల్ ఉంటుందని అనుకునే దాన్ని. ప్రపంచకప్ సెమీస్ వివాదం మహిళల క్రికెట్‌లో దుమారం రేపింది. ఎక్కువగా క్రికెటేతర అంశాలు మాట్లాడుకోవటం ఆటకు అంత మంచిది కాదు. న్యూజిలాండ్ పర్యటనలో మా ప్రదర్శనలతో అందరి దృష్టిని మళ్లీ జట్టుపైకి మళ్లించే అవకాశం లభించింది. అది మాత్రమే స్పోర్ట్స్ ప్రొఫైల్‌ను మెరుగుపర్చుతుంది' అని మిథాలీ తెలిపింది. ఇది కొత్త ఆరంభం. కొత్త ఏడాదిలో నూతన సిరీస్. ఆ వివాదం నుంచి నేను, హర్మన్‌ప్రీత్ దూరం వచ్చేశాం. ఇప్పుడు మా దృష్టి న్యూజిలాండ్ పర్యటనపైనే. జట్టుగా ఐసీసీ మహిళల చాంపియన్‌షిప్ పాయింట్ల విధానం ప్రాధాన్యత మాకు తెలుసు. 2021 ప్రపంచకప్‌కు ఈ పాయింట్లు అత్యంత కీలకం. వన్డే కెప్టెన్‌గా జట్టును ఏకతాటిపై ఉంచటం , సమష్టిగా రాణించటం ముఖ్యం. వ్యక్తిగత ప్రదర్శనలతో మ్యాచులు నెగ్గవచ్చు కానీ సిరీస్‌లు సాధించలేం. సిరీస్ గెలవాలంటే జట్టులోని అందరూ తమ వంతు పాత్ర పోషించాలి. అదే ఫార్ములా నేను నమ్ముతాను. ఇక కోచ్ డబ్ల్యూ. వీ రామన్ వద్ద నేనెప్పుడూ శిక్షణ పొందలేదు. కానీ అతడితో పలుమార్లు మాట్లాడాను. భిన్న స్థాయిల్లో, వివిధ జట్లకు కోచింగ్ ఇచ్చిన అనుభవం ఆయన సొంతం. రామన్ కోచ్‌గా మహిళల క్రికెట్‌కు సానుకూల ఫలితాలు ఉంటాయనే ఆశిస్తున్నాను అని మిథాలీ రాజ్ తెలిపింది.

ఆండీ ఆట ముగిసింది

- తొలి రౌండ్లోనే బ్రిటన్ స్టార్‌కు షాక్
- కెరీర్ చివరి మ్యాచ్ ఆడేసిన ముర్రే
- ఫెడరర్, నడాల్, వొజ్నియాకి శుభారంభం
- ఆస్ట్రేలియన్ ఓపెన్ 2019



మెల్‌బోర్న్ : బ్రిటన్ స్టార్, తెలివైన టెన్నిస్ ఆటగాడు ఆండీ ముర్రే ఆట ముగిసింది. కొంత కాలంగా గాయాలతో సహజీవనం చేస్తున్న స్కాట్లాండ్ యోధుడు ఇక ఆటలో కొనసాగలేనని తప్పుకున్న సంగతి తెలిసిందే. కెరీర్ చివరి టోర్నీలో మెరుగైన వీడ్కోలు ఆశించినా, మెల్‌బోర్న్‌లో ఆండీకి తొలి రౌండ్లోనే చుక్కెదురైంది. స్పెయిన్ ఆటగాడు రాబర్టో బటిస్టా ఆగట్ చేతిలో ఐదు సెట్ల పోరులో ముర్రే తలొంచాడు. 6-4, 6-4, 6-7(5-7), 6-7(4-7), 6-2తో ముర్రేపై రాబర్టో గెలుపొందాడు. తొలి రెండు సెట్లలో ఖంగుతిన్న ముర్రే, మూడో సెట్లోనే ముగిస్తాడని అనిపించింది. కానీ ముర్రే గొప్పగా పుంజుకున్నాడు. టైబ్రేకర్లలో తర్వాతి రెండు సెట్లను నెగ్గి నిర్ణయాత్మక ఐదో సెట్‌కు వెళ్లాడు. కానీ అక్కడ ఆండీ అంచనాలను అందుకోలేదు. 2-6తో స్పెయిన్ ప్లేయర్‌కు మ్యాచ్‌ను కోల్పోయాడు. చివరి ప్రొ సర్వ్‌తో ప్రేక్షకులకు రాకెట్‌తో అభివాదం చేసిన ఆండీ ముర్రే, మెల్‌బోర్న్ తొలి రౌండ్‌తో కెరీర్‌కు గుడ్ బై చెప్పాడు.

మెన్స్ సింగిల్స్ సర్క్యూట్‌లో వెటరన్ స్టార్స్ రోజర్ ఫెడరర్, రఫెల్ నడాల్ శుభారంభం చేశారు. మూడో సీడ్ ఫెడరర్ 6-3, 6-4, 6-4తో ఇస్టోమన్‌పై గెలుపొందాడు. ఇస్టోమన్ నుంచి అద్భుతం ఆశించిన వారికి అతడు నిరాశే మిగిల్చాడు. వరుస సెట్లలో ఫెడరర్‌కు సరెండర్ అయిపోయాడు. స్పెయిన్ బుల్ రఫెల్ నడాల్ 6-4, 6-3, 7-5తో డక్‌వర్త్ (ఆస్ట్రేలియా)పై గెలుపొందాడు. రెండో సీడ్ నడాల్‌కు ప్రత్యర్థి నుంచి ఎటువంటి ప్రతిఘటన ఎదురు కాలేదు. అలవోకగా రెండో రౌండ్‌కు చేరుకున్నాడు. థామస్ బెర్డిచ్ 6-3, 6-0, 7-5తో ఎడ్మండ్ (బ్రిటన్)పై గెలుపొందగా, మోన్‌ఫీల్స్ 6-0, 6-4, 6-0తో విజయం సాధించాడు. ఆరో సీడ్ సిలిచ్ 6-2, 6-4, 7-6(7-3)తో టామిక్‌పై పైచేయి సాధించాడు. జపాన్ యువ కెరటం నిషోక 6-4, 7-6(7-5), 6-4తో యుఎస్ ఆటగాడిపై గెలుపొందాడు. ఆండ్రీ సెప్పీ 6-4, 4-6, 6-4, 6-3తో రెండో రౌండ్లోకి ప్రవేశించాడు.

మహిళల సింగిల్స్‌లో జర్మనీ భామ ఎంజెలికా కెర్బర్ 6-2, 6-2తో అలవోక విజయం సాధించింది. పొలొనా హర్కాండ్ (స్లోవేనియా) నుంచి కెర్బర్‌కు గట్టి పోటీ ఎదురు కాలేదు. అమెరికా అమ్మాయి స్టిఫెన్స్ 6-4, 6-2తో వరుస సెట్లలో విజయం సాధించింది. కరొలినా గార్సియా 6-2, 6-3తో, కొలిన్స్ 2-6, 7-6(7-5), 6-4తో శుభారంభం చేశారు. పెట్రా క్విటోవా 6-3, 6-2తో వరుస సెట్లలో విజయం సాధించింది. మూడో సీడ్ కరొలినా వొజ్నియాకి 6-3, 6-4తో అలవోక విజయం సాధించగా, మాజీ వరల్డ్ నం.1 మరియా షరపోవా 6-0, 6-0తో తిరుగులేని విజయం సాధించి రెండో రౌండ్లోకి ప్రవేశించింది.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.